www.andhrajyothy.com
నిజామాబాద్ సిటీ*

ఆంధ్రజ్యోతి

పేజీలు: 16 + 20 + 32
పేజీల ఆదివారం అనుబంధం

సంపుటి: 14
సంచిక: 35

వెల: రూ. 6.00

ఆదివారం | 13-8-2017

శ్రీహేవళంబినామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు,

శ్రావణమాసం, కృష్ణపక్షం; తిథి: షష్ఠి రా. 9.32 తదుపరి సప్తమి; నక్షత్రం: అశ్విని తె. 5.04 తదుపరి భరణి; వర్జ్యం: రా. 1.12-2.45; దుర్ముహూర్తం: సా. 4.58-5.49; అమృతఘడియలు: రా. 10.06-11.39; రాహుకాలం: సా. 4.30-6.00; సూర్యోదయం: 6.02; సూర్యాస్తమయం: 6.39

Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tanuku | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai



నేను చూసే ప్రపంచం వేరు!

"...ఫండమెంటల్‌గా నాకు మనుషులంటే ఇష్టం. వాళ్ల మధ్య అనుబంధాలు ఇష్టం. ఏ మనిషినైనా నేను పాజిటివ్‌గానే చూస్తాను. డబ్బుల మీద ఎక్కువ వ్యామోహం ఉండదు. ఏడాది నుంచీ మా అమ్మాయికి 'మహాప్రస్థానం' చెబుతున్నా.."

'ఫిదా' శేఖర్ కమ్ములతో ఇంటర్వ్యూ ..నవ్యలో




పెద్దాయనకు సన్మానం చేస్తున్నారా..
కట్నం పెడుతున్నారా..
మీ అమ్మాయికి డ్రెస్ మెటీరియల్ కొంటున్నారా..
అబ్బాయి తువ్వాలు కావాలంటున్నాడా..
శాలువాలు మరచిపోండి
మన చేనేతలు కొనండి
నేతన్నను ఆదుకోండి

2

మహిళలూ.. ఆపదలో ఉన్నారా?
181 కు ఫోన్ చేయండి

▶ గోల్డెన్ బోల్ట్



ఆఖరి పరుగు

బోల్ట్.. బోల్ట్.. బోల్ట్..! ప్రపంచ వ్యాప్తంగా ఉన్న క్రీడాభిమానుల కళ్లన్నీ ఈ చిరుతపైనే నిలిచాయి! తన పరుగుతో కాలాన్నే శాసించి.. వేగానికే అసూయ పుట్టించిన ఉసేన్ బోల్ట్ ఆఖరు పరుగును వీక్షించి తరించాయి!! ఎనిమిది ఒలింపిక్ స్వర్ణాలు సహా పలు ఈవెంట్లలో కుప్పలు కుప్పలుగా పతకాలు కొల్లగొట్టి ఏళ్లుగా ప్రపంచ స్ప్రింట్‌ను శాసించిన బోల్ట్ తన ఆఖరు 'పరుగు'ను పూర్తిచేశాడు. లండన్‌లో భారత కాలమానం ప్రకారం శనివారం అర్ధరాత్రి తర్వాత జరిగిన 4x100 మీటర్ల ఈవెంట్ ఫైనల్‌ను పూర్తిచేసి కెరీర్‌కు వీడ్కోలు పలికాడు.

15

'సోషల్' మేనియా

• అసత్యమేవ జయతే..!!



పదోతరగతి చదువుతున్న ఆ బాలికకు సామాజిక మాధ్యమాలే సర్వస్వం. టీవీ సీరియల్స్ అంటే ఆ అమ్మాయికి పిచ్చి. ముంబైకి చెందిన ఒక టీవీ సీరియల్ నటితో ఆ అమ్మాయికి ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం అయింది. నిత్యం ఆ నటితో చాట్ చేసేది. చిన్నపిల్ల కదా అని ఆ నటి కూడా ఆ కామెంట్లకు బదులిచ్చేది. దీంతో ఆ టీవీ నటి తనకు చాలా సన్నిహితం అయిపోయిందని భ్రమించిన బాలిక.. ఆమె దగ్గరకు వెళితే తను కూడా సీరియల్స్‌లో నటించవచ్చునుకుంది. ఇంట్లో వాళ్లకు చెప్పకుండా ముంబై రైలు ఎక్కేసింది. అక్కడకు వెళ్లి నానా కష్టాలూ పడింది. ఓ స్వచ్ఛంద సంస్థ ఆ బాలికను చేరదీసింది. నానా తంటాలు పడి పోలీసులు ఆమెను తీసుకు వచ్చేందుకు వెళితే తల్లిదండ్రుల దగ్గరకు రానంటూ షాకిచ్చింది. ముంబైలో వుండి సీరియల్స్‌లో నటిస్తానని భీష్మించింది. పోలీసులు నచ్చచెప్పి వెనక్కు తెచ్చి ఆమెను తల్లిదండ్రుల దగ్గరకు చేర్చారు.

ఓ అగ్రహీరో సినిమా రిలీజ్ అయింది. అందులో ఆ హీరో గురించి తన అభిప్రాయాన్ని నిష్కర్షగా సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు నిఖిల్. క్షణాల్లో ఆ అగ్రహీరో అభిమానులు రంగంలోకి దిగారు. మా హీరో మీద కామెంట్ చేస్తావా అని తిట్ల దండకం అందుకున్నారు. ప్రత్యర్థి హీరోకు చెందిన అభిమాన సంఘాలు నిఖిల్‌కు బాసటగా నిలిచాయి. బూతులు, సవాళ్లు, ప్రతిసవాళ్లు, హెచ్చరికలతో సోషల్‌మీడియా హోరెత్తిపోయింది. నాలుగు రోజుల పాటు ఆ టెన్షన్‌ను భరించిన నిఖిల్ బీపీ పెరిగి ఆస్పత్రి పాలయ్యాడు. ఏదైనా అద్భుతాన్ని చూసినప్పుడో.. ఆహ్లాదకరమైన దృశ్యాన్ని వీక్షించినప్పుడో.. ఆనందకర

మిగతా 2వ పేజీలో...

కార్పొరేటర్.. డర్టీ పిక్చర్!

జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్ల గ్రూపులో పోర్న్ వీడియో
పోస్ట్ చేసిన కిలారి మనోహర్.. డ్రైవర్ పోస్ట్ చేశాడని వివరణ
తోటి సభ్యుల ఆగ్రహం.. తీవ్రంగా మందలించిన పార్టీ పెద్దలు

11

లైక్‌లు, కామెంట్లు రాక ఆందోళన.. ఒత్తిడి తట్టుకోలేక డిప్రెషన్‌లోకి

చర్చ పేరిట బూతులు, సవాళ్లు.. మితిమీరుతున్న సైబర్ బుల్లీయింగ్

సోషల్ ప్రభంజనం

మన దేశంలో ఫేస్‌బుక్ ఉపయోగిస్తున్న వారి సంఖ్య 24 కోట్లు దాటింది. ఈ విషయంలో అమెరికాను అధిగమించాం. వీరిలో 7 కోట్ల మంది భారతీయులు నిత్యం ఫేస్‌బుక్ చూస్తున్నారు.

ఎక్కువ మంది రోజూ కనీసం మూడుసార్లు ఈ సైట్ ఉపయోగిస్తున్నారు.

ట్విటర్‌ను 2.3 కోట్ల మంది, యూట్యూబ్‌ను ఆరుకోట్ల మంది ఉపయోగిస్తున్నారు.

మన దేశంలో ఉద్యోగులు 34 శాతం సమయాన్ని సామాజిక మాధ్యమాలను ఉపయోగిస్తూ గడుపుతున్నారు.



గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ ఇన్‌చార్జి ఆర్సీ కుంతియా, ఉత్తమ్

2019 వరకు ఇదే టీమ్

రాష్ట్ర కాంగ్రెస్ పదవుల్లో మార్పులుండవు
అప్పటివరకు నేను కూడా ఇక్కడే ఉంటా
కాంగ్రెస్‌ను మించి ప్రత్యామ్నాయం లేదు
అందుకే అధికారంలోకి వచ్చేది మేమే
నాయకుల ఐక్యత, క్రమశిక్షణ నా ఎజెండా
తెలంగాణతో టీఆర్‌ఎస్‌కు మాత్రమే లాభం
వ్యక్తులను బట్టి పార్టీలోకి రీఎంట్రీ చాన్స్
కాంగ్రెస్ తెలంగాణ ఇన్‌చార్జ్ కుంతియా

హైదరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పదవుల్లో 2019లో జరిగే సాధారణ ఎన్నికల దాకా ఎలాంటి మార్పులూ ఉండవని, తనతో సహా అందరూ తమ పదవుల్లో కొనసాగుతారని ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి, ఏఐసీసీ కార్యదర్శి రామచంద్ర కుంతియా అన్నారు. పార్టీ అధిష్ఠానం కూడా ఇదే విషయాన్ని తేల్చి చెప్పిందన్నారు. ఇన్‌చార్జిగా నియమితుడయ్యాక శనివారం తొలిసారి రాష్ట్రానికి వచ్చిన కుంతియా శంషాబాద్ విమానాశ్రయం నుంచి నేరుగా గాంధీభవన్‌కు వచ్చారు. అక్కడ పార్టీ నేతల నుంచి ఘనస్వాగతం అందుకున్నారు. కొద్దిసేపు నేతలతో ముచ్చటించి అనంతరం మీడియాతో ఇష్టాగోష్ఠిగా సంభాషించారు. పీసీసీ,

మిగతా 11వ పేజీలో...

గ్రామ రెవెన్యూ వ్యవస్థకు చెల్లుచీటీ?

వ్యవసాయ శాఖలోకి వీఆర్‌ఏ, వీఆర్‌వో

తెలంగాణ సర్కారు యోచన
ఆరుగురు అధికారులతో కమిటీ
మున్ముందు రైతు సమాఖ్య కీలకం
దాని ఆధ్వర్యంలోనే క్రయవిక్రయాలు



హైదరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో గ్రామ రెవెన్యూ వ్యవస్థ రద్దు కానుంది. దీనిని వ్యవసాయ శాఖలో విలీనం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. రద్దుపై అధ్యయనం చేసి, నివేదిక అందించడానికి ఆరుగురు కీలక అధికారులతో కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ సచివాలయం బయట పలు మార్లు సమావేశమైంది. గ్రామ రెవెన్యూ వ్యవస్థను ఏ విధంగా రద్దు చేయాలి? ఇందుకు ఏ పద్ధతులు పాటించాలి? వ్యవసాయ శాఖలో విలీనం చేస్తే వీఆర్‌ఏ, వీఆర్‌వోలను ఎక్కడెక్కడ సర్దుబాటు చేయాలి? అలా చేస్తే మున్ముందు ఏయే ఇబ్బందులుంటాయి? తదితర అంశాలపై కమిటీ సంప్రదింపులు చేస్తోంది. కీలక అధికారి నేతృత్వంలో ఇప్పటికే పలు దఫాలుగా సమావేశాలు జరిగాయి. ఇదే విషయాన్ని ఆయన ఇటీవల వీఆర్‌వోలకు స్పష్టం చేశారు కూడా. ఇక గ్రామ రెవెన్యూ వ్యవస్థ ఉండబోదని సంకేతాలు కూడా ఇచ్చారు. గ్రామాల్లో 23 వేలమంది దాకా వీఆర్‌ఏలు; 5,800 మంది దాకా వీఆర్‌వోలు ఉన్నారు.

రైతు సమాఖ్య పవర్ ఫుల్

ఇక ముందు గ్రామంలో భూముల క్రయ విక్రయాలు జరిగితే ఆ సమాచారం గ్రామ రైతు సమాఖ్యకు అందించాలని, దాని ఆధ్వర్యంలోనే భూమి రికార్డుల నిర్వహణ/ నవీకరణ జరగాలన్న ముఖ్యమంత్రి నిర్దేశం మేరకే రెవెన్యూ వ్యవస్థకు స్వస్తి చెప్పాలని భావిస్తున్నారు. ఈ నిర్ణయంతో భవిష్యత్తులో గ్రామాల్లో రైతు సమాఖ్యలే శక్తిమంతంగా మారనున్నాయి. గ్రామంలో భూములు కొనాలన్నా.. అమ్మాలన్నా వీటి అనుమతి తప్పనిసరి కానుంది. గ్రామానికి చెందిన ఏ భూమిని రిజిస్ట్రేషన్ చేయాలన్నా అధికారులు విధిగా సమాఖ్య అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. గ్రామ రైతు సమాఖ్యను

మిగతా 11వ పేజీలో...



అబ్బాయికి చీర సింగారం!

చీర చుట్టారు. కుంకుమ దిద్దారు. మెడలో హారాలు దిగేశారు. కాళ్లకు, చేతులకు అలంకరించారు. పెళ్లి కొడుకు అలంకరణ పూర్తి చేశారు! ఇదేం విడ్డూరమంటారా.. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో శనివారం ఉదయం అచ్చంగా ఇలాగే, మేడిబోయినవారి అబ్బాయిని పెళ్లికి సిద్ధం చేశారు. కొన్నితరాలుగా ఇదే ఆచారం మేడిబోయిన కుటుంబాల్లో కొనసాగుతుందట! తమ పూర్వీకుల దారిలోనే నడిచాడు సూర్యనారాయణ, అమరావతి దంపతుల కుమారుడు ఉమా మహేశ్. స్త్రీలా సింగారించుకొని, రావిచెట్టుకు పూజలు చేశాడు. ఆ తరువాత పట్టుపంచెలోకి మారిపోయాడు.

– రాజమహేంద్రవరం సిటీ

181

మహిళలకు భరోసా..

హైదరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళలకు మరింత భద్రత కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్రంలో బాలికలు, మహిళలకు భరోసానిచ్చేలా పోలీస్ కంట్రోల్ నెంబర్‌తో అనుసంధానం చేస్తూ ప్రత్యేకంగా హెల్ప్‌లైన్ నెంబరు '181' ను ప్రవేశపెట్టింది. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడైనా బాలికలు, మహిళలు వేధింపులకు గురైనా, అత్యవసర సాయం అవసరమైనా ఈ నెంబర్‌కు ఫోన్ చేయవచ్చు. 24 గంటలూ ఈ సహాయ కేంద్రం అందుబాటులో ఉండేలా అవసరమైన సాంకేతిక ఏర్పాట్లను చేశారు. హైదరాబాద్ శివారు కొంపల్లిలో ఈ కేంద్రం ఉంది. ప్రతి జిల్లాకు ఈ నెంబర్ అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టనున్నారు. ఇప్పటికే షీ టీమ్స్ ద్వారా కొంత వరకూ సహాయం పొందుతున్న బాధిత మహిళలకు.. ఈ నెంబర్ద్వారా మరింత భరోసాను ప్రభుత్వం కల్పిస్తున్నది.



• దుక్కిటెద్దులకు విద్యుదాఘాతం



మహబూబాబాద్ జిల్లా గూడూరు శివారు బందాలగడ్డ తండాకు చెందిన రైతు బానోత్ మొగిలికి చెందిన రెండు దుక్కిటెద్దులు విద్యుదాఘాతంతో మృతి చెందాయి. శనివారం దుక్కిటెద్దులతో పొలంలో దున్నుతుండగా విద్యుత్తు స్తంభానికి సహాయంగా ఉన్న స్టే వైరుకు కరెంటు సరఫరా అయింది. దీంతో రెండు దుక్కిటెద్దులతోపాటు మొగిలికి కూడా షాక్ తగిలింది. త్రుటిలో ప్రమాదం నుంచి మొగిలి తప్పించుకోగా సుమారు లక్ష రూపాయల విలువైన దుక్కిటెద్దులు చనిపోయాయి. -గూడూరు

ధరిస్తేనే చేనేతకు ఆధరువు



చేనేత వస్త్రాలను బహూకరిద్దాం!

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

చేనేత వస్త్రం.. అది కుర్తా అయినా చీర అయినా ధరిస్తే ఉట్టిపడే ఆ హుందాతనమే వేరు!! అలాంటి చేనేత బట్టలు.. ఆధునిక, పాశ్చాత్య పోకడల సుడిగుండాల్లో చిక్కుకొని మనుగడ కోసం అలమటిస్తున్నాయి. అటు నేతన్నలూ పని కరువై పూట గడవక కొట్టుమిట్టాడుతున్నారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన చేనేత వస్త్రాలను పరిరక్షించడం.. నేతన్నల బతుకు బండికి భరోసా కల్పించడం.. అనే బృహత్ లక్ష్యాలతో రాష్ట్ర ప్రభుత్వం చేనేత వస్త్రాలను ప్రొత్సహించాలని నిర్ణయించింది. ఇందుకుగాను ఎన్నో చర్యలు తీసుకుంటోంది. వారంలో ఒకరోజు చేనేత వస్త్రాలను ధరించాల్సిందిగా ప్రజాప్రతినిధులకు టెక్స్‌టైల్స్ శాఖ మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఇలా ఎన్నో చర్యలను తీసుకుంటున్నా.. చేనేతకు ఆదరణ లభించాలంటే మనం ఏం చేద్దాం? "చేనేతను ప్రేమిస్తాను.. చేనేతను కొంటాను.. చేనేతను ధరిస్తాను", "స్వయంగా మనం ధరిస్తేనే చేనేతకు ఆదరణ".. ఈ నినాదాలతో సరికొత్త సంస్కృతికి శ్రీకారం చుట్టాయి కళావేదికలు. ఆధరువు కోల్పోతున్న చేనేత రంగానికి కొండంత అండగా నిలబడేందుకు పది నుంచి ఇరవై సంఘాలు చేతులు కలిపాయి. రోజు రాష్ట్రంలో ఎక్కడో ఓ చోట సాహిత్య, సాంస్కృతిక, సామాజిక, ప్రభుత్వ కార్యక్రమాలు జరుగుతుంటాయి. అక్కడ సన్మానకర్తలకు నేతన్న తయారు చేసిన అంగీబట్టో, ఓ తువ్వాలో, మహిళలైతే చేనేత చీరనో బహూకరించాలన్న నిబంధన తప్పనిసరిగా అమలు చేయించేందుకు ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. కాగా, పనిదొరక్క జనగామ జిల్లా నుంచి సూరత్ (గుజరాత్)కు వెళ్లిన కార్మికులు అక్కడ అనుభవం సంపాదించి తుక్కుకింద పారేసిన పాత యంత్రాలు కొనుక్కొని సొంత ప్రాంతాలకు తిరిగొచ్చి చేనేత వస్త్రాల ఉత్పత్తిని ప్రారంభించారు. లుంగీలు, బెడ్‌షీట్లు, టవల్స్ తక్కువ ధరలకే లభిస్తుండటంతో గిరాకీ పెరిగి కార్మికులకు చేతినిండా పని దొరుకుతంది. "అబ్బో చేనేత వస్త్రాలా.. మరీ పాతపోకడలు గురూ".. చాలామందిలో ఇదే అభిప్రాయం ఉంటుంది. అయితే, ఆధునిక ఫ్యాషన్ పోకడలకు ఏమాత్రం తీసిపోకుండా బ్రాండెడ్ దుస్తులను మరిపించేలా చేనేత వస్త్రాలు కనువిందుచేస్తున్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లిలో!

పట్టు వస్త్రాలకు పెట్టింది పేరు అనంతపురం జిల్లా ధర్మవరం. ఈ ప్రాంతానికి చెందిన డిజైనర్ అన్వర్.. 'ధర్మవరం ముత్యాల పట్టు' పేరుతో సరికొత్త డిజైనర్ పట్టు చీరను ఆవిష్కరించారు. నలుగురు కార్మికులు 14 రోజుల్లో నేశారని అన్వర్ తెలిపారు. ఈ చీరలో 800 ముత్యాల పూసలను పొదిగామన్నారు. ఈ చీర విలువ రూ.30 వేలు!!

చేనేత వస్త్రాలకు మనవంతుగా ఆదరణను తీసుకువచ్చేందుకు సరికొత్త ట్రెండ్‌ను సృష్టిద్దాం. ఇంటికి బంధువులొస్తారు. వారికి కొత్తబట్టలు పెడతాం. ఓ పెళ్లి, పుట్టినరోజు.. మరేదో శుభకార్యానికో వెళ్తాం. కొత్త బట్టలు, లేదంటే మరేదైనా గిఫ్ట్ పట్టుకెళ్లి ఇస్తాం. ఈ సందర్భాల్లో చక్కగా చేనేత వస్త్రాలనే బహూకరిద్దాం. మనమూ చేనేతలను ధరిద్దాం. ఏడాదిలో ఐదారు పండుగలకు చేనేత వస్త్రాలనే కొని వేసుకుందాం. ఏమంటారు?

బుక్ ఫెయిర్ అతిథులకు చేనేత వస్త్రాలే

ఏటా నిర్వహించే హైదరాబాద్ బుక్‌ఫెయిర్‌కు వచ్చే అతిథులు, కవులకు, రచయితలకు, సాహితీ సంస్థల ప్రముఖులకు శాలువాలకు బదులు చేనేత దుస్తులను బహూకరిస్తామని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం సభ్యుడు జూలూరి గౌరీ శంకర్ చెప్పారు.

సెప్టెంబరులో వాషింగ్టన్‌లో వంగూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరగబోయే ప్రపంచ తెలుగు మహిళా సాహిత్య సదస్సులో చేనేత దుస్తులే వాడాలని నిర్ణయించామని వంశీ సంస్థల అధినేత డాక్టర్ వంశీరామరాజు చెప్పారు. త్యాగరాయ గానసభలో శాలువాలకు బదులుగా చేనేత వస్త్రాలనే తప్పనిసరిగా అందజేసేలా నిర్వాహకులకు ఆదేశాలు ఇచ్చామని త్యాగరాయ గానసభ అధ్యక్షుడు కళా జనార్దన మూర్తి తెలిపారు.

'సోషల్' మేనియా!



ఎప్పుడో పదో తరగతిలో చూసిన దోస్తు.. పాతికేళ్ల తర్వాత ఫేస్‌బుక్‌లో తగుల్తాడు. ఎంత ఆనందమో!

ఇంటర్‌లో ఇష్టపడ్డ అమ్మాయి.. చాలా ఏళ్ల తర్వాత ఏ వాట్సప్ గ్రూపు ద్వారానో టచ్‌లోకి వస్తే ఎంత సంబరమో!!

ఫేస్‌బుక్.. వాట్సప్.. ట్విటర్.. ఇన్‌స్టాగ్రామ్.. పేరేదైనాగానీ, వీటన్నిటినీ కనిపెట్టిన ఉద్దేశం ఇదే. దూరమైపోయిన వారిని దగ్గర చేయడం. కానీ.. జరుగుతున్నది మరొకటి! అనుబంధాలను పెంచాల్సిన సామాజిక మాధ్యమాలు.. చాలామందిలో ఒత్తిడిని, డిప్రెషన్‌ను పెంచుతున్నాయి. ఆత్మహత్యల బాట పట్టించి.. అయినవారికి, అందరికీ శాశ్వతంగా దూరం చేస్తున్నాయి!!

తెలిసీ తెలియక చేసిన కామెంట్లు కేసుల పాల్జేస్తున్నాయి! ప్రలోభాలకు గురిచేసి అన్నివిధాలా నష్టపోయేలా చేస్తున్నాయి!!


(మొదటి పేజీ తరువాయి)

ఎందుకు వ్యసనం?

ఫేస్‌బుక్ అయినా.. ఇన్‌స్టాగ్రామ్, ట్విటర్.. ఇలా ఏదైనా ఎందుకు వ్యసనంగా మారుతుంది? ఈ ప్రశ్నకు సమాధానం ఈ వ్యాసం మొదట్లోనే ఉంది. లైకులు, కామెంట్లు ఇచ్చే కిక్కు. మనం పెట్టిన పోస్టుకు ఎన్ని ఎక్కువ లైకులు, కామెంట్లు వస్తే అంత కిక్కు. ఆ కామెంట్లకు సమాధానమివ్వడానికి పదేపదే వాటిలోకి తొంగిచూస్తాం. వాదనల వేడితో పాటు బీపీని పెంచుకుని లేనిపోని రోగాలు కొనితెచ్చుకుంటాం. దీనికి అలవాటు పడ్డాక.. ఎక్కడైనా నెట్ అందుబాటులో లేకపోతే ఒత్తిడి మరింత పెరిగిపోతుంది. తస్మాత్ జాగ్రత్త!!

సంఘటన జరిగినప్పుడో.. మనసులో విరిసిన ఆనందం కళ్లలో ప్రతిఫలించేలోపే సామాజిక మాధ్యమంలో ఫోటోగా షేర్ అయిపోతుంది. ఇంట్లో చేసిన రుచికరమైన వంటకం ఆఫీసుకు వెళ్లే భర్త బాక్స్‌కు చేరేలోపే గ్రూప్‌లోని సభ్యులందరి నోరూరిస్తుంది. మనసును వేధిస్తున్న సందేహానికి గ్రూప్ సభ్యుల నుంచి క్షణాల్లో సమాధానం లభిస్తున్నది. అంతేకాదు.. కథలో కవితలో వ్యాసాలో రాసేవారు ఇదివరకట్లో అయితే దిన, వార, మాస పత్రికలకు పంపి అవి ప్రచురితమయ్యేదాకా కళ్లు కాయలు కాచేలా వేచిచూసేవారు. కానీ సోషల్ మీడియా వచ్చాక పరిస్థితి మారిపోయింది. 'ఎవడి (ఫేస్‌బుక్) వాల్‌కి వాడే రాజు.' ఇలా రాసి అలా పోస్ట్ చేయగానే వెంటనే ఫీడ్ బ్యాక్ వచ్చేస్తుంది. అలాగే.. 2010 డిసెంబరులో ట్యునీషియాలో మల్లెల విప్లవం విజయవంతమైంది.. అరబ్ వసంతానికి దారి తీసి నియంతృత్వాలు నశించింది సోషల్ మీడియా వల్లనే! కానీ.. ఇవన్నీ సామాజిక మాధ్యమం అనే నాణానికి ఒక వైపు మాత్రమే!

21 శతాబ్దపు అరుదైన ఆవిష్కరణల్లో ఒకటైన సోషల్ మీడియా కోట్లాది మంది ప్రజల జీవితాలు, ఆలోచనలు, అనుబంధాలను గాఢంగా ప్రభావితం చేస్తోంది. ఫేస్‌బుక్, ట్విటర్, స్నాప్‌చాట్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ వంటి డజనుకు పైగా సామాజిక మాధ్యమాలు అద్భుతాలతోపాటు.. ఎన్నో సమస్యలకూ కారణమవుతున్నాయి.



లైకులు.. కామెంట్ల ఒత్తిడి..

ఒక ఫొటో తీసుకుంటాం.. ఫేస్‌బుక్‌లోకి అప్‌లోడ్ చేస్తాం. చేసిన దగ్గర్నుంచీ ఎదురుచూపులు! ఎన్ని లైకులు వచ్చాయి.. ఎంత మంది షేర్ చేశారు.. ఎంత మంది కామెంట్లు పెట్టారు.. ఇదే ఆలోచన!! ఆశించినన్ని లైకులు, షేర్లు, కామెంట్లు రాకపోతే.. ఎందుకు రాలేదు? ఎంతో గొప్పగా ఊహిస్తే ఇన్నిలైకులేనా? ...అనిపిస్తుంది. అది ఒత్తిడి. దీన్ని కొందరు లైట్ తీసుకుంటారు గానీ.. కొందరు మాత్రం దాన్ని అంత తేలిగ్గా తీసుకోలేరు. ఒత్తిడి పెరిగి కుంగుబాటులోకి జారిపోతారు. మన పోస్టులకు స్పందన లేకపోవడం ఒక బాధ అయితే.. వేరేవాళ్ల పోస్టులకు లైకులు, షేర్లు, కామెంట్లు ఎక్కువగా రావడం మరీ బాధ! ఇవి కాక.. అభిమాన హీరో దగ్గర్నుంచీ నమ్మే భావజాలం దాకా రకరకాల అంశాలపై బూతు పురాణాలు (సైబర్ బుల్లీయింగ్, ట్రోల్స్), అన్నీ కలిసి యువత ప్రాణాల మీదకు తెస్తున్నాయి. ఇవే కాదు.. సోషల్ మీడియాలో వ్యాఖ్యలతో కేసులపాలైనవారు.. తప్పుడు ప్రచారాలను నమ్మి మోసపోయేవారు ఎక్కువవుతున్నారు. వీటన్నిటికీ మించి.. రిప్, లోల్ లాంటి పదాల వాడకం.. గ్రామర్ లేకుండా వాక్యాలు రాయడం ఎక్కువై చాలా మంది భాషా నైపుణ్యాలను కోల్పోతున్నారు. చిన్నపిల్లలు బయటికెళ్లి ఆడుకోవడం.. యువత స్నేహితులతో సరదాగా సమయం గడపడం ఇవేవీ లేవు. మానసిక ఆనందాన్ని, పరిణతిని పెంచే పనులను వదిలి.. కుంగుబాటులోకి నెట్టేసే సోషల్‌మీడియాకు అతుక్కుపోవడం నేటి వైపరీత్యం.

కాలేజీలకు వెళ్లే యువతే కాదు.. 10–12 ఏళ్ల పిల్లల నుంచి 90 ఏళ్ల వృద్ధుల దాకా అందరూ ఈ సోషల్ మీడియాకు బానిసలవుతున్నారు. ఫేస్‌బుక్‌లోనో.. ట్విటర్‌లోనో.. వాట్సప్‌తోనో ఎంత ఎక్కువ సమయం కేటాయిస్తే అంతగా డిప్రెషన్‌కు గురయ్యే ముప్పు అధికమని యూనివర్సిటీ ఆఫ్ మిచిగాన్ పరిశోధకుల అధ్యయనంలో తేలింది.

అబద్ధపు ప్రచారాలపై మొజిల్లా పోరు

- "భారత జాతీయగీతం ప్రపంచంలోనే అత్యుత్తమమైనదిగా ఎంపికైంది.. చైనా ఉత్పత్తుల వాడకంపై అనంతపురం కోర్టు నిషేధం విధించింది.. కువాయిట్‌లో 62 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది, ఆ వేడికి ఏకంగా ఒక వాహనమే కాలిపోయింది.. రూ.2000 నోటులో ట్రాకింగ్ పరికరాలున్నాయి.. ఈ నెలలో ఐదు శని, ఆది, సోమవారాలు వచ్చాయి మళ్లీ వెయ్యేళ్ల దాకా ఇలా రావు.."
- ఈ తరహా అబద్ధపు ప్రచారాలకు ఆన్‌లైనే వేదిక. ఇలాంటివాటిని నమ్మి ఫార్వర్డ్ చేయడమంటే సమయాన్ని వృథా చేసుకోవడమే. ఇలాంటి వార్తలు నిజమా కాదా అనే విషయాన్ని ధ్రువీకరించుకోవడానికి ఇంటర్‌నెట్‌లో 10 నిమిషాల సమయాన్ని ఖర్చు చేస్తే చాలు. కానీ, బాగా చదువుకున్నవాళ్లు కూడా ఇలాంటివాటిని ఫార్వర్డ్ చేసి ఇతరుల సమయాన్ని వృథా చేస్తారు. ఇంటర్‌నెట్‌లో ఈ తరహా ఫేక్ న్యూస్ పని పట్టేందుకు ప్రముఖ నాన్-ప్రాఫిట్ ఓపెన్ సోర్స్ గ్రూప్ మొజిల్లా సిద్ధమైంది. ఈబే వ్యవస్థాపకుడి నేతృత్వంలో రూపొందిన సాఫ్ట్‌వేర్‌ను ఆ సంస్థ ఇందుకు ఉపయోగిస్తోంది.

అసంతృప్తి 62%

- ఫేస్‌బుక్, ట్విటర్‌ను ఉపయోగిస్తున్న వారిపై బ్రిటన్‌కు చెందిన ఒక సంస్థ అధ్యయనం జరపగా.. సర్వేలో పాల్గొన్న 1500 మంది ఖాతాదారుల్లో 62 శాతం మంది ఆ సామాజిక మాధ్యమాల పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇతరులతో తమను పోల్చుకుని అసూయ కారణంగా అశాంతికి గురౌతున్నామని 60 శాతం మంది వెల్లడించారు. మనసు బాగాలేనప్పుడు ఫేస్‌బుక్ ఓపెన్ చేసిన అధిక శాతం మంది అందులోని పోస్టింగ్‌లు చూసి మరింత కుంగుబాటుకు లోనవుతున్నామని చెప్పారు.

పెరిగే ఒత్తిడి..

- చాలా సందర్భాల్లో సామాజిక మాధ్యమాలు ఎదుటి వారిని కించపరిచే దారుణమైన వ్యాఖ్యలు, తిట్ల దండకాలు, బూతు పురాణాలకు వేదికలుగా మారుతున్నాయి. ఏదైనా అంశం మీద ఒకరు కామెంట్ పోస్ట్ చేస్తే.. ఆ భావాలు నచ్చనివారు సంయమనం కోల్పోయి సోషల్ మీడియా వేదికగా మాటలతో విషం చిమ్ముకుంటున్నారు. ఆకతాయిలు మారుపేర్లతో అకౌంట్ ప్రారంభించి వంచనలకు పాల్పడుతున్నారు. యువతులతో చాటింగ్ చేస్తూ వికృతమైన కామెంట్లు, ఫొటోలు పోస్ట్ చేస్తున్నారు.

కేసుల ముప్పు

ఇటీవల బెంగాల్‌లో ఒక యువకుడు ఒక మతాన్ని ఉద్దేశించి కించపరిచే వ్యాఖ్యలు ఫేస్‌బుక్‌లో పెట్టి జైలు పాలయ్యాడు. బాల్ థాక్రే మరణించినప్పుడు ముంబైలో ఒక మహిళ ఆయన్ను ఉద్దేశించి ఒక వ్యాఖ్య చేసింది. మరో మహిళ ఆ పోస్టుకు లైక్ కొట్టింది. అభిమానుల ఆందోళన నేపథ్యంలో పోలీసులు.. పోస్టు పెట్టిన మహిళతోపాటు లైక్ కొట్టిన అమ్మాయిని కూడా అరెస్టు చేశారు. ఇక.. ఆంధ్రప్రదేశ్‌లో శాసన మండలిని ఉద్దేశించి కార్టూన్ పెట్టిన రవికిరణ్ ఉదంతం నిన్నమొన్నటిదే. అలాగే, ఇటీవల మోదీ ముఖానికి స్నాప్‌చాట్‌లో కుక్క చెవులు, ముక్కు పెట్టినందుకు ఒక గ్రూపుపైనే కేసు పెట్టారు.

లోకం తీరు



ఉష్ణోగ్రతలు

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
ఆదిలాబాద్	21.5	33.8
హైదరాబాద్	22.1	31.2
రామగుండం	23.4	30.6
మహబూబ్‌నగర్	23.5	31.5
నిజామాబాద్	24.5	31.6
ఖమ్మం	26.0	31.0



బట్టల్లేకుండా తిరిగేవాళ్లకు వాటి గురించి

మాట్లాడే హక్కు లేదు

బట్టలు లేకుండా తిరిగేవాళ్లకు బట్టల గురించి మాట్లాడే హక్కులేదు. రోజాలాంటి వాళ్లు తప్పుడు కూతలు కూస్తే ప్రజలు తిరగబడతారు.. మొన్ననే చూపించారు తడాఖా.. పచ్చిగా మాట్లాడే రోజమ్మలాంటి వాళ్లు వ్యవస్థలో ఉండడం సిగ్గు చేటు. అడ్డదిడ్డంగా కాదు. ప్రచారానికి ప్రజాస్వామిక మార్గంలో రావాలి. బరి తెగించి కాదు మాట్లాడాల్సింది. ఎన్ని నిధులు ఇచ్చాం.. ఎన్ని మంచి పనులు చేస్తున్నాం.. చేస్తున్న అభివృద్ధి వాళ్ల కంటికి కనబడదా..? సిగ్గుండాలి. ఏది జరిగినా ఏమీ జరగలేదని అనడం. చిన్న పిల్లను చూసి బట్టల గురించి మాట్లాడడం అప్రజాస్వామికం. వైసీపీ వాళ్లు ఓటుకు రూ.5 వేలు కాదు.. ఎంత ఇచ్చుకున్నా గెలుపు టీడీపీదే

- రోజాపై మంత్రి ఆదినారాయణరెడ్డి ధ్వజం

నేటి పెట్రో ధరలు (లీ.)

పెట్రోల్	డీజిల్
పాత ధర రూ.70.89	పాత ధర 61.72
కొత్త ధర రూ.71.22	కొత్త ధర 61.90
పెరుగుదల 33 పైసలు	పెరుగుదల 18 పైసలు



చెడు కొలెస్ట్రాల్‌ను

తగ్గించే బాదం

న్యూయార్క్, ఆగస్టు 12: రోజుకు పిరికెడు బాదం తింటే శరీరంలో ఆరోగ్యకరమైన కొలెస్ట్రాల్ పెరుగుతుందని తాజా అధ్యయనంలో తేలింది. అదే సమయంలో చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి శరీర పనితీరును మెరుగుపడుతుందట. మఫిన్(బ్రెడ్) తిన్నవారిలో, బాదం తిన్నవారిలో అధిక సాంద్రత కలిగిన లిపోప్రొటీన్(హెచ్‌డీఎల్) స్థాయుల్ని పరీక్షించగా బాదం తిన్నవారిలో హెచ్‌డీఎల్ స్థాయులు సంతృప్తికర రీతిలో 6.4శాతం మెరుగైనట్లు అమెరికాలోని పెన్సిల్వేనియా స్టేట్ యూనివర్సిటీ పరిశోధకులు వెల్లడించారు. బాదం శరీరానికి ఆరోగ్యకరమైనదని, అయితే హృద్రోగాలు రాకుండా చేసే ఆహారం కాదని తెలిపారు.



ఇష్టంలేని ఉద్యోగంతో

అనారోగ్యం

లండన్, ఆగస్టు 12: నిరుద్యోగంతో ఉండేకంటే తక్కువ జీతమైనా, పని ఒత్తిడి ఎక్కువగా ఉన్నా ఇష్టంలేని ఉద్యోగం చేస్తుంటాం! నిరుద్యోగం వల్ల కొంత మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నా.. ఇష్టం లేని ఉద్యోగం వల్ల అనారోగ్యం బారిన పడతామని యూకేలోని యూనివర్సిటీ ఆఫ్ మాంచెస్టర్ పరిశోధకులు హెచ్చరించారు. ఇష్టం లేని, చెడు ఉద్యోగం చేసేవారిలో ఒత్తిడి శాతం నిరుద్యోగుల్లో కంటే ఎక్కువగా ఉంటుందని, అది దీర్ఘకాలిక ఒత్తిడికి దారితీస్తుందని తెలిపారు. ఇష్టమైన ఉద్యోగంతోనే మానసిక ఆరోగ్యం సాధ్యమని, ఇష్టం లేని ఉద్యోగం హానికరమని వివరించారు.

పల్లెసీమలో అంతర్జాతీయ వైద్యవిధానం

అది కుప్పం పీఈఎస్ మెడికల్ కళాశాలకే సొంతం

మండుటెండలో సుధీర్ఘ ప్రయాణం చేసేవాడికి ఓ చిన్నపాటి చెట్టునీడ కనిపిస్తే... ఎడారి పయనంలో నీటిమడుగు దర్శనమిస్తే ఇక మరింత కాలం బతికేస్తాననే ధైర్యం హృదయంలోనుంచి పుట్టినట్లు ... ఎంతదూరం వెళ్ళినా పల్లె బతుకులు, ఏమార్గమైనా సింగిల్ రోడ్డులో ముందుకు సాగాల్సిందే అనేటువంటి మారుమూల కుగ్రామమైన కుప్పంకు చేరేసరికే, ఇవేమి భవనాలు ఏదైనా పరిశ్రమ ఉందా లేక మరో మహానగరంకు చేరామా అనిపిస్తుంది. అయితే అది అత్యావసరమైన వైద్య సేవలందించే మహా దేవాలయమని సమీపానికి వెళ్ళితే తప్ప తెలియదు అదే ఆంధ్రప్రదేశ్‌లోని కుప్పం పీఈఎస్ మెడికల్ కళాశాల........... (బెంగళూరు)

సువిశాలమైన కుప్పం పీఈఎస్ వైద్య కళాశాల ప్రాంగణం





డా. ఎం.ఆర్. దొరస్వామి, ఛాన్సలర్



డా. రూపా సురేష్ అసోసియేట్ డైరెక్టర్



డా. సురేష్ మెడికల్ డైరెక్టర్

ప్రపంచం మెచ్చిన మానవవిలువలు కలిగిన మహా మేధావి అంతరిక్ష పరిశోధకులు భారత గౌరవాన్విత రాష్ట్రపతి అబ్దుల్‌కలాం ఆలోచనగా ఉండే మహానగరాలకే పరిమితమైనవిద్యావైద్య సేవలు గ్రామీణప్రాంతాల అందుబాటులోకి తీసుకురావాలనే ఆశయం.... ఆధునిక సాంకేతిక ఆలోచనాపరుడు దేశవిదేశాలో ఓ ముఖ్యమంత్రి ఎలా ఉండాలనేందుకు రెండుదశాబ్దాల లెజండ్‌గా పేరొందిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు సలహా సూచనలతో... దేశంలోనే గుణాత్మక విద్యావిధానానికి పునాది వేసి సాంకేతిక విద్యా రాష్ట్రం కర్ణాటకలోనే నంబర్ వన్ ఇంజనీరింగ్ కళాశాలగా తీర్చి, కోర్సు ఏదైనా అక్కడ చదివి పరిజ్ఞాన భండారం దక్కించుకునామనే లక్షలాది మంది విద్యార్థుల స్ఫూర్తి దాత వేలాది సాంకేతిక మేధావుల సృష్టికర్త పీఈఎస్ విద్యాసంస్థల వ్యవస్థాపకులు డా. ఎం.ఆర్ దొరస్వామి సొంత కష్టార్జితంతో రూపొందినదే కుప్పం మెడికల్ కళాశాల... విద్యాసంస్థల ద్వారా జాతీయ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందినా పుట్టి పెరిగిన జిల్లా వాసులకు తనవంతు శాశ్వతమైన సేవఉండాలనే వైద్యసౌలభ్యాల కల్పనద్వారా లక్షలాదిమంది ప్రజల హృదయాలలో నిలిచారు దొరస్వామి. ఇక్కడ సాధ్యంకాదనే వైద్యసేవలే లేవు. రోగిగా వచ్చిన వారు ఎంతటి వైద్యమైనా పొంది సంతృప్తికరంగా ఇంటికి చేరాలన్నదే ఆశయంగా సేవలు కొనసాగుతున్నాయి.

నీట్ ద్వారా ప్రవేశాలకు డిమాండ్

దేశవ్యాప్తంగా మెడికల్ కోర్సుల ప్రవేశానికై నిర్వహిస్తున్న నీట్ ద్వారా అడ్మిషన్లు ఆరంభమయ్యాయి. ఆంధ్రప్రదేశ్‌లో డిమాండ్ కలిగిన మెడికల్ కళాశాలగాపీఈఎస్ గుర్తింపు పొందింది. ఉత్తమ విద్యతో పాటు అన్ని సౌలభ్యాలు కలిగిన పీఈఎస్‌లో ప్రవేశించేందుకు ఎక్కువ మంది ఉత్సాహం చూపుతున్నారు.



అధునాతన ఆపరేషన్ థియేటర్

త్రివేణీ సంగమంలా....

పీఈఎస్ మెడికల్ కళాశాల ఆరంభమైనప్పటి వరకూ కుప్పం ఎక్కడ ఉందంటే ఏరాష్ట్రానికి చెందిన ప్రాంతమనేది తెలుసుకోవడం కూడా కష్టమనే చెప్పవచ్చు. ఆంధ్రప్రదేశ్‌కు సుదూరాన కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు అత్యంత సమీపాన ఉన్న చిన్నపాటి పట్టణం కుప్పం. మెడికల్ కళాశాల ఏర్పడిన దశాబ్దన్నర కాలంలోనే మూడు రాష్ట్రప్రభుత్వాల నుంచి ప్రశంసలు. మూడు రాష్ట్రాల నుంచి వందకిలోమీటర్ల విస్తీర్ణంలో అత్యాధునిక వైద్యసౌలభ్యాలు కలిగిన పీఈఎస్ మెడికల్ కళాశాల నిత్యం వేలాదిమంది ప్రాణాలకు అండగా నిలుస్తోంది.

ఆవిర్భంచింది ఇలా...

కుప్పంలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాలనే ఆలోచన వచ్చిన వెంటనే కార్యాచరణ ఆరంభించారు దొరస్వామి. కుప్పంనుంచి జిల్లా కేంద్రమైన చిత్తూరుకు వెళ్ళే ప్రధానరహదారికి అనుబంధంగా 100ఎకరాల సువిశాల విస్తీర్ణంలో నిర్మాణాలు ఆరంభించారు. 2000నాటికి భవనాల నిర్మాణాలు పూర్తికాగా 2001నుంచి ఆసుపత్రి సేవలకు శ్రీకారం చుట్టారు. కుప్పంలో అత్యాధునిక వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయనే ప్రచారం కోసం యాజమాన్యం మూడు రాష్ట్రాల పరిధిలో ప్రచారాలు చేయడంతో ఆరంభం నుంచే ప్రజలు సేవలు పొందేందుకు ఆసక్తి చూపారు. 2002లో మెడికల్ కళాశాలను అప్పటి రాష్ట్రపతి ఎ.పి.జె. అబ్దుల్‌కలాం లాంఛనంగా ఆరంభించారు.

మెడికల్ కళాశాలలో ల్యాబ్‌లు

2002లో పీఈఎస్‌లో ఎంబీబీఎస్ కోర్సులు ఆరంభం కాగా 150మంది విద్యార్థులు చేరారు. వారి విద్యావిధానానికి అనుగుణంగా అనాటమీ, ఫిజియోలజీ, మైక్రోబయాలజీ, బయోకెమిస్ట్రీ, పెథాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, కమ్యూనిటీ మెడిసిన్ ల్యాబ్‌లను అత్యాధునిక సాంకేతిక విధానాలకు అనుగుణంగా ఏర్పాటు చేశారు.

2007లో 17 పీజీ కోర్సులు

ఎంబీబీఎస్ తొలిబ్యాచ్ 2007లో పూర్తికాగా అప్పటినుంచి పీజీకోర్సులు ఆరంభం అయ్యాయి. ప్రొఫెసర్‌లకు అనుగుణంగా కేటాయించే పీజీ సీట్లు 48తో ఆరంభమై ప్రస్తుతం 78కు చేరింది. పీజీ కోర్సులలో జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్స్, ఈఎన్‌టీ, ఆప్తమాలజీ, స్త్రీలు, గర్భకోశవ్యాదులు, జనరల్ మెడిసిన్, డెర్మటాలజీ, సైక్రియాట్రిక్స్, పిడియాట్రిక్స్, కమ్యూనిటీ మెడిసిన్, ఫార్మకాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, మైక్రోబయాలజీ, అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, ఎమర్జెన్సీ మెడిసిన్, ఫెథాలజీ కోర్సులు ఉన్నాయి.

దేశానికి 1500లమంది డాక్టర్‌లను అందించిన ఘనత

పీఈఎస్ మెడికల్‌శాలకు ఇప్పటి వరకూ దేశానికి 1500ల మంది డాక్టర్‌లను అందించిన ఘనత దక్కింది. 2002లో ఎంబీబీఎస్ కోర్సు ఆరంభం కాగా 2007 నాటికి తొలిబ్యాచ్ పూర్తి అయ్యింది. ఇలా పదేళ్ళ వ్యవధిలో పది బ్యాచ్‌లు పూర్తి కాగా 1500ల మంది ఎంబీబీఎస్ కోర్సులు పూర్తిచేశారు. దేశ విదేశాలలో ఇక్కడ చదివిన వారు సేవలు అందిస్తున్నారు. 2007లో 48 మందితో పీజీ కోర్సులు ప్రారంభం కాగా ప్రస్తుతం 78కు చేరింది. పీఈఎస్ విద్యార్థులు ఎంబీబీఎస్, పీజీ కోర్సులు పూర్తి చేసి 1850కు పైగా సేవలందిస్తున్నారు.

అత్యాధునిక లైబ్రరీ, స్పోర్ట్స్ విభాగాలు

వైద్యవిద్యార్థులు రోజు 24గంటలు చదివినా ఇంకా పూర్తీ కాలేదనే అంటుంటారు. అంతటి స్థాయిలోనే సౌలభ్యాలు కల్పించేదిశగా అత్యాధునిక లైబ్రరీను ఏర్పాటు చేశారు. ఒకేసారి 500లమంది కూర్చొని చదువుకునేంతటి విశాలమైన గ్రంథాలయ ప్రాంగణం ఉంది. వివిధ అంశాలకు సంబంధించి 17790 పుస్తకాలతో పాటు జాతీయ స్థాయి 232, అంతర్జాతీయ స్థాయి 118 జర్నల్స్ అందుబాటులో ఉన్నాయి. ఇక డిజిటల్ లైబ్రరీలో 660 పుస్తకాలు ఉన్నాయి. ఏటా జర్నల్స్‌సహా అన్ని పుస్తకాలు అప్‌డేట్ చేస్తుంటారు. ఇలా లైబ్రరీ కోసమే ఏటా రూ.1.15 కోట్లు వెచ్చిస్తున్నారు. ఇక క్రీడల కోసం అంతర్జాతీయ స్థాయి ఇండోర్ స్టేడియం నిర్మించారు. జిమ్నాస్టిక్ సౌలభ్యంతో పాటు విశాలమైన మైదానం ఉంది. యూనివర్శిటీ స్థాయి క్రీడాపోటీలకు శిక్షణలిస్తున్నారు.

నర్సింగ్, పారా మెడికల్ కోర్సులు

పీఈఎస్ మెడికల్ కళాశాలకు అనుబంధంగా 2004లో నర్సింగ్ కళాశాలను ఆరంభించారు. 40 మందితో ఆరంభమైన నర్సింగ్ కళాశలలో ప్రస్తుతం ఏటా వందమంది కోర్సు చేసే అవకాశం ఉంది. ఆరంభంలో ఉండే డిప్లొమో నర్సింగ్ కోర్సును ప్రభుత్వం రద్దుచేయడంతో 2006 నుంచి బీఎస్‌సీ నర్సింగ్ కోర్సు కొనసాగుతోంది 2009లో ఎంఎస్‌సీ నర్సింగ్ కోర్సులు ప్రారంభమయ్యాయి. వీటిలో పిడియాట్రిక్స్, సర్జికల్, సైక్రియాట్రిక్స్, కమ్యూనిటీ మెడిసిన్, మెడికల్ సర్జన్ కోర్సులు ఉ న్నాయి. ప్యారామెడికల్ విభాగంలో డీఎంఎల్‌టీ, బీఎస్‌సీ ఎంఎల్‌టీ, ఎంఎస్‌సీ మెడికల్ కోర్సు లు ఉన్నాయి. వీటితోపాటు టెన్త్‌క్లాస్‌కే పరిమితంగా ఉండే వారి కోసం డీఎంఈ సర్టిఫికెట్ కోర్సులు నిర్వహిస్తున్నారు. వీటిలో రేడియోగ్రాఫిక్, ఎక్స్‌రే, ఈసీజీ, ఎకో, క్యాథ్‌ల్యాబ్, ఫార్మ్.డి, బ్లడ్ బ్యాంక్, అనస్తీషియా, అత్యవసర విభాగం, ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్ కోర్సులు నిర్వహిస్తున్నారు.

అంతర్జాతీయ స్థాయి అనుభవం

గుణాత్మక వైద్యవిధానంతో పాటు నిత్యపరిశోధనలకు కేంద్రంగా కొనసాగుతున్న పీఈఎస్ వైద్యవిద్యా సంస్థలో అంతర్జాతీయ స్థాయి అనుభవం కలిగిన అధ్యాపకులు ఇక్కడ ఉండటం మరో ప్రత్యేకం. డాక్టర్ సురేష్ క్రిష్ణమూర్తి ఎంబీబీఎస్, ఎండీ, ఎఫ్ఆర్‌సీపీ, ఎఫ్ఎఎస్ కోర్సులు చేసి మెడికల్ డైరెక్టర్‌తో పాటు కార్డియాలజీ హెచ్‌ఓడీగా వ్యవహరిస్తుండగా డాక్టర్ రూపా సురేష్ ఎంబీబీఎస్, ఎండీ, ఎబీఐఎం కోర్సులు చేసి అసోసియేట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ జిరియాట్రిక్స్ హెచ్‌ఓడీగా కొనసాగుతున్నారు. ఇక డాక్టర్ హెచ్.ఆర్. క్రిష్ణారావ్ ప్రిన్సిపాల్‌తో పాటు అనాటమీ హెచ్‌ఓడీగాను, డాక్టర్ వేణుగోపాలరావ్ మెడికల్ సూపరింటెండెంట్‌తో పాటు అనస్తీషియా హెచ్‌ఓడీగాను డాక్టర్ వై.జే. విశ్వేశ్వరరెడ్డి వైస్‌ప్రిన్సిపాల్‌తో పాటు జనరల్ మెడిసిన్ విభాగం హెచ్‌ఓడీగాను, డాక్లర్ నారాయణ్.ఎం అసోసియేట్ మెడికల్ సూపరింటెండెంట్‌తో పాట ఆప్తమాలజీ విభాగం అధిపతిగాను డాక్టర్ క్రాంతికుమార్ డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్‌తో పాటు న్యూరోసర్జన్ హెచ్‌ఓడీగాను విధులు నిర్వహిస్తున్నారు. అదేరీతిన సీనియర్ ప్రొఫెసర్‌లుగా జనరల్ మెడిసిన్ విభాగానికి డాక్టర్ శ్రీనివాసరావ్, డీవీఎల్ హెచ్‌ఓడీగా డాక్టర్ శివకుమార్, సైక్రియాట్రిస్టు హెచ్‌ఓడీ వీఎస్ సుబ్బారావ్, జనరల్‌సర్జరీ విభాగంలో తినగరన్ హెచ్‌ఓడీ కాగా శివానంద, శ్రీనివాసన్‌లు సీనియర్ ప్రొఫెసర్‌లు, ఈఎన్‌టీ హెచ్‌ఓడీ బైరారెడ్డికాగా అశోకమూర్తి ప్రొఫెసర్‌గా ఉన్నారు. ఆప్తమాలజీ ప్రొఫెసర్‌గా డాక్టర్ సీఎన్‌గుప్త, ఆర్థోపెడిక్స్ విభాగం హెచ్‌ఓడీగా బాలక్రిష్ణగడియార్ కాగా ప్రొఫెసర్‌లుగా వెంకటేష్‌రెడ్డి, ఎన్ఎస్‌గుడిలు ఉన్నారు. అనస్తీషియా హెచ్‌ఓడీగా కె.వి. శ్రీనివాసన్, రేడియాలజీ ప్రొఫెసర్‌గా సీఆర్ శ్రీనివాసబాబు, ఓబీజీ విభాగం హెచ్‌ఓడీగా ఎల్. క్రిష్ణ, ప్రొఫెసర్‌గా ప్రదీప్‌లు, పిడియాట్రిక్స్ హెచ్‌ఓడీగా డాక్టర్ రాజేంద్రనాయుడులు వ్యవహరిస్తున్నారు.

మెడికల్ కళాశాలకు అనుబంధ ఆసుపత్రి సేవలు

నిత్యం వేయిమందికి పైగా ఓపీడీ ద్వారా వైద్యసేవలు అందిస్తుండగా 450లమంది ఇన్ పేషెంట్‌లకు వైద్యం అందుతోంది. మెడికల్ కళాశాలకు అనుబంధంగా 750 పడకల ఆస్పత్రి. వీటిలో జనరల్ మెడిసిన్, సర్జరీ విభాగాలు ఉన్నాయి. 52 పడకల ఐసీయూ, 12 పడకల హార్ట్‌కేర్, 20పడకలు నవజాత శిశువుల యూనిట్, 20 పడకలు పిడియాట్రిక్స్, 8పడకలు అత్యసరం, 24 గంటల అత్యవసర వార్డు క్యాథ్ ల్యాబ్ సౌకర్యంతో పాటు ఎంఆర్ఐ, ఎక్స్‌రే, 24 గంటల ఫార్మసీ, బ్లడ్‌బ్యాంక్ ల్యాబ్, అంబులెన్స్, మోడ్రన్ ఆపరేషన్ థియేటర్ సౌలభ్యాలున్నాయి.

సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో సౌలభ్యాలు

పీఈఎస్ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో 150పడకల జనరల్ వార్డుతో పాటు 52 పడకల ఐసీయూ, 54 పడకల స్పెషల్ వార్డుతో పాటు ఓపీడీ విభాగంలో కార్డియాలజీ, డర్మటాలజీ, న్యూరాలజీ, న్యూరోసర్జరీ, పిడియాట్రిక్ సర్జరీ, గ్యాస్ట్రిక్ సర్జరీ, యూరాలజీ, ఆంకాలజీ, రుమటాలజీ విభాగాలు ఉన్నాయి వీటితో పాటు ఎగ్జిక్యూటివ్, మాస్టర్ హెల్త్‌చెక్, డయాబిట్, కార్పొరేట్ హెల్త్‌చెక్ విభాగాలు అందుబాటులో ఉన్నాయి. 15 పడకల ద్వారా డయాలసిస్ సేవలు, ల్యాప్రోస్కోపి, బ్రెయిన్‌స్కోపి సేవలు అందుతున్నాయి.

ఎన్ఎబీహెచ్ గుర్తింపు కలిగిన ఏకైక సంస్థ

దేశంలోని వైద్య విద్యాసంస్థలకు గుర్తింపు నిచ్చే క్యాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియాచే 2014 ఏప్రిల్‌లో నేషనల్ అక్రిడేషన్ బోర్డ్ ఫర్ హాస్పిటల్ గుర్తింపు. ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్ఎబీహెచ్ గుర్తింపు పొందిన ఏకైక ప్రైవేటు మెడికల్ కళాశాల పీఈఎస్‌గా నిలిచిందని దొరస్వామి తెలిపారు. నాణ్యమైన సేవలు, రోగుల భద్రత అనే అంశంపై గుర్తింపు వచ్చింది. 2014లో నేషనల్ అక్రిడేషన్ బోర్డు ఫర్ లైబ్రరీ విభాగానికి నాణ్యత, ధృవీకరణలో స్పష్టతకు గుర్తింపు వచ్చింది.

ఏపీ, తమిళనాడు ప్రభుత్వ వైద్యసేవలు

ఆంధ్రప్రదేశ్ అమలు చేస్తున్న ఎన్‌టీఆర్ వైద్యసేవాపథకంతో పాటు ఏపీఎల్ కార్డుదారులకు అందించే ఆరోగ్యరక్ష పథకాలు అమలులో ఉన్నాయి. ఎంప్లాయ్స్ హెల్త్ సర్వీస్, జర్నలిస్టు హెల్త్ సర్వీస్, ప్రభుత్వ ఉద్యోగులకు రీయింబర్స్‌మెంట్ సేవలు, తమిళనాడు ప్రభుత్వానికి అనుగుణంగా ముఖ్యమంత్రి ఆరోగ్య పథకం ద్వారా సేవలు కొనసాగుతున్నాయి. అన్ని బీమా కంపెనీలకు అనుగుణంగా వైద్యం అందుబాటులో ఉంది. కుప్పంలో అర్బన్‌హెల్త్‌సెంటర్, వీ.కోటలో గ్రామీణ ఆరోగ్య కేంద్రాల ద్వారా పూర్తిగా ఉచిత సేవలు అందిస్తున్నారు. ఆపరేషన్‌లు, ప్రత్యేక చికిత్సలు అవసరమైతే మెడికల్ కళాశాలకు రెఫర్ చేస్తుంటారు.

దేశంలో ఎక్కడా లేని హెల్త్ సర్వే

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచనమేరకు దేశంలోనే ఎక్కడా లేని విధంగా హెల్త్‌సర్వే జరిపారు. కుప్పంలోని ప్రతి కుటుంబంకు సంబంధించి ఆరోగ్యవివరాలను డిజటలీకరణ చేశారు. వాటి వివరాలను వైద్యఆరోగ్యశాఖతో పాటు మెడికల్ కళాశాల రికార్డులకు చేర్చారు. తద్వారా ఒక ప్రాంతంలో ఎటువంటి రుగ్మతలతో ఇబ్బంది పడుతున్నారనేది తేలినట్లు అయ్యింది. ప్రస్తుతం మరో నాలుగు పంచాయతీలలో సర్వే కొనసాగిస్తున్నారు. ఈప్రాంతానికి చెందిన వారు ఆసుపత్రికి వెళితే సమగ్రమైన వివరాలతో వైద్యం అందించే సౌలభ్యం ఉంది. మెడికల్ కళాశాల వివరాల కొరకు రాజారాజ ను 95507 05766 ద్వారా సంప్రదించవచ్చు.

రాష్ట్రానికి ఎన్ని ఇళ్లయినా ఇస్తాం


- బొంబాయి - కరీంనగర్‌కు కొత్త రైలు
- యాదాద్రి వరకు ఎంఎంటీఎస్: దత్తాత్రేయ

హైదరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కోరినన్ని ఇళ్లను కేటాయించడానికి కేంద్రం సిద్ధంగా ఉందని కేంద్ర కార్మిక శాఖ మంత్రి బండారు దత్తాత్రేయ తెలిపారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద రాష్ట్రానికి 1,51,155 ఇళ్లను కేంద్రం మంజూరు చేసిందని, కానీ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకూ 40 వేల ఇళ్లను మాత్రమే ప్రారంభించిందని చెప్పారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌పై ఒత్తిడిని తగ్గించడానికి త్వరలోనే చర్లపల్లి, లింగపల్లిలోని నాగులపల్లి రైల్వేస్టేషన్‌లను పెద్ద ఎత్తున అభివృద్ధి చే సేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు తెలిపారు. శనివారం రైల్వే, హౌసింగ్, మెడికల్ అండ్ హెల్త్, విద్య తదితర అంశాలపై ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఎంఎంటీఎస్ రెండో దశను యాదాద్రి వరకూ పొడిగించాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. ముంబయి, కరీంనగర్ మధ్య కొత్త రైలును కూడా త్వరలోనే ప్రారంభించనున్నట్టు తెలిపారు. కాజీపేటలో ఏర్పాటు చేయతలపెట్టిన వ్యాగన్ ఫ్యాక్టరీకి అవసరమైన భూమిని రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చితే.. ఆ ప్రాజెక్టు కూడా త్వరలోనే ప్రారంభిస్తామని పేర్కొన్నారు. సికింద్రాబాద్ - మహబూబ్‌నగర్ డబ్లింగ్ పనులను త్వరలోనే చేపట్టనున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో విద్యా ప్రమాణాలను మరింత పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సౌకర్యాలు పెరగాల్సిన అవసరం ఉందని, డాక్టర్ల కొరత కూడా అధికంగా ఉందన్నారు. ఈ విషయంపై త్వరలోనే రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డితో భేటీ అవుతానని ఆయన చెప్పారు.

తేలని 6,7 తరగతుల 'లెక్కలు'

- తెగని మ్యాథ్స్, ఫిజిక్స్ టీచర్ల వివాదం
- అధ్యయనానికి కమిటీ వేసిన విద్యాశాఖ
- ఏడాది దాటినా ఎక్కడి గొంగళి అక్కడే

హైదరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో మ్యాథ్స్ స్కూల్ అసిస్టెంట్లు, ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్ల మధ్య వివాదం రగులుతూనే ఉంది. 6,7 తరగతులకు మ్యాథ్స్ సబ్జెక్టును ఎవరు బోధించాలనే అంశంపై విద్యాశాఖ స్పష్టత ఇవ్వకపోవటంతో ఈ పరిస్థితి ఉత్పన్నమైంది. త్వరగా వివాదానికి తెరదించాల్సిన పాఠశాల విద్యాశాఖ ఈ సమస్యపై కమిటీ వేసి.. అధ్యయనం పేరుతో సాగదీతకు తెరలేపింది. 2017-18 విద్యా సంవత్సరం స్కూళ్లు ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా వివాదం మాత్రం పరిష్కారం కాలేదు. గత ఏడాది 6,7 తరగతుల బోధన బాధ్యతను మ్యాథ్స్ టీచర్లకే అప్పగించాలని ఫిజికల్ సైన్స్ టీచర్లు విద్యాశాఖకు విజ్ఞప్తి చేశారు. దాంతో పాఠశాల విద్యా కమిషనర్ ఉత్తర్వులు జారీ చేస్తూ.. 7వ తరగతి మ్యాథ్స్‌ను గణితం స్కూల్ అసిస్టెంట్లు, 6వ తరగతికి ఫిజికల్ సైన్స్ టీచర్లు లెక్కలు బోధించాలని పేర్కొన్నారు. దీనిపై మ్యాథ్స్ టీచర్లు విద్యాశాఖ మంత్రిని కలిసి ఫిర్యాదు చేయడంతో.. విద్యాశాఖ కమిషనర్ తన ఆదేశాలను అబయన్స్(పెండింగ్)లో పెడుతూ.. మౌఖిక ఆదేశాలు జారీచేశారు. విద్యాశాఖ స్పష్టత ఇవ్వకపోవడంతో.. ప్రస్తుతం రాష్ట్రంలో చాలా జిల్లాల్లో గణితం సబ్జెక్టు బోధన తమది కాదంటే తమది కాదంటూ టీచర్లు తప్పించుకుంటున్నారు. కొన్ని చోట్ల గణితం సబ్జెక్టు ఎవరో ఒకరు బోధిస్తున్నారు. అదీ అయిష్టంగానే బోధిస్తుండటంతో.. అర్థంకాక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.



పని దినాలు తగ్గటంపై హెచ్ఎంల ఆందోళన

2017-18 విద్యా సంవత్సరం పని దినాలు తగ్గే అవకాశాలు ఉండటంతో ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విద్యా సంవత్సరాన్ని ఏప్రిల్ 12తో ముగించాలని విద్యాశాఖ సూత్రప్రాయంగా నిర్ణయించడం.. 6,7 తరగతులకు గణితం ఎవరు బోధించాలనే విషయంపై ఇంకా స్పష్టత లేకపోవటమే వారి ఆందోళనకు కారణం. ముందుగా విద్యా సంవత్సరం ముగిస్తే సుమారు రెండు వారాల పాటు పని దినాలు తగ్గే అవకాశం ఉంది. ఇప్పటికే 6,7 తరగతుల గణితం సబ్జెక్టును ఎవరు బోధించాలనే అంశంపై విద్యాశాఖ స్పష్టం చేయక పోవడంతో కొన్ని చోట్ల బోధన జరగడం లేదు. ఈ పరిస్థితుల్లో సిలబస్ ఎలా పూర్తి చేయాలని ప్రధానోపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫిజిక్స్, మ్యాథ్స్ టీచర్లకు సర్ది చెబుదామంటే.. ఇది కాస్తా రాష్ట్రస్థాయి సమస్య అయి కూర్చుంది. రెండు సబ్జెక్టులకు సంబంధించిన టీచర్ల యూనియన్లు.. మంత్రులు, అధికారులకు పోటీపోటీగా వినతి పత్రాలు ఇవ్వటంతో సమస్య జఠిలంగా తయారైంది. ఇప్పటికైనా విద్యాశాఖ ఈ అంశంపై దృష్టి సారించి సమస్య పరిష్కరించాలని ప్రధానోపాధ్యాయులు కోరుతున్నారు.

ఓయూ దూర విద్యలో ఆన్‌లైన్ అడ్మిషన్లు

- కొత్త వెబ్‌సైట్‌ను ప్రారంభించిన వీసీ

ఉప్పల్/హైదరాబాద్: ఉస్మానియా యూనివర్సిటీలోని ప్రొఫెసర్ జి.రాంరెడ్డి దూరవిద్యా కేంద్రం కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టిందని ఓయూ వీసీ ప్రొఫెసర్ రామచంద్రం పేర్కొన్నారు. శనివారం ఇక్కడ జరిగిన కార్యక్రమంలో ఓయూ దూర విద్యా కేంద్రం ఆన్‌లైన్ అడ్మిషన్, వెబ్‌సైట్‌ను ఆయన ప్రారంభించారు. దూర విద్యలో రాష్ట్రంలోనే నాణ్యత ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తున్న పీజీఆర్ఆర్ సీడీఈ ఆన్‌లైన్ అడ్మిషన్ విధానంతో తెలంగాణలోని మారుమూల ప్రాంత విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన వివరించారు. విద్యార్థుల సేవల కోసం రాష్ట్రంలో పది స్టడీ సెంటర్లను ఏర్పాటు చేశామని తెలిపారు. భవిష్యత్తులో ఈ-లెర్నింగ్ విధానాన్ని దూరవిద్య విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చి ఆన్‌లైన్‌లో పాఠాలు చదువుకునే అవకాశం కల్పించాలని, ఇతర సమాచారాలన్నింటినీ నేరుగా విద్యార్థులకు చేరే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. దూర విద్యా కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ గణేష్ మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం నుంచి ఆన్‌లైన్‌లోనే అడ్మిషన్లు చేసుకోవాలని, రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగిశాక సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం కేవలం ఒకే ఒక్కసారి ఓయూలోని దూర విద్యా కేంద్రానికి విద్యార్థి రావాల్సి ఉంటుందని తెలిపారు.



వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న ఓయూ వీసీ రామచంద్రం

ఎస్సీ వర్గీకరణ వద్దు: మాల మహానాడు

న్యూఢిల్లీ, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు సహకరించొద్దని తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి ఆర్‌సీ కుంతియాకు మాలమహానాడు విజ్ఞప్తి చేసింది. జి.చెన్నయ్య, జంగాల శ్రీనివాస్ నేతృత్వంలోని బృందం శనివారం ఢిల్లీలో కుంతియాను కలిసింది. ఈ మేరకు శాస్త్రీయ పరిశీలన జరిపి తమ పార్టీ నిర్ణయం తీసుకుంటుందని కుంతియా హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.

అటల్ నాటి విలువలేవీ?

"నంద్యాల ఫలితం ఎలా ఉండబోతుందా? అని ఏపీలోనే కాదు- తెలంగాణలో కూడా ఎదురుచూస్తున్నారు. తెలంగాణలో ఉప ఎన్నికలు జరిగినందున ముఖ్యమంత్రి కేసీఆర్ తన బలం పెరిగిందని రుజువు చేసుకున్నారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన మూడేళ్ల తర్వాత తొలిసారిగా ఉప ఎన్నిక పరీక్షను ఎదుర్కొంటున్నారు. అందుకే నంద్యాల పోరు ప్రతిష్ఠాత్మకం అవుతోంది."



■ ఆర్కే
RK
కొత్తపలుకు

"తామందరూ ఇప్పటికీ స్మరించుకుంటూ గౌరవం వ్యక్తం చేస్తున్న వాజపేయి నెలకొల్పిన విలువలను ఈ నాయకులు ఎందుకు పాటించలేకపోయారో తెలియదు. గుజరాత్ నుంచి ఒక్క రాజ్యసభ సీటును అదనంగా గెలుచుకున్నా, గెల్చుకోకపోయినా బలాబలాలు ఏమీ తలకిందులు కావు. మోదీ అధికారానికి వచ్చిన ప్రమాదం ఏమీ లేదు. అయినా ఒక్క ఎంపీ సీటు కోసం కక్కుర్తి పడటంతో ఇతర రాజకీయ నాయకులకు, మోదీకి మధ్య అట్టే తేడా లేదు అని ప్రజలు భావించే పరిస్థితిని తెచ్చుకున్నారు."

అది 1999 ఏప్రిల్ 17వ తేదీ. 18 మంది ఎంపీలున్న జయలలిత పార్టీ అటల్ బిహారీ వాజపేయి సర్కారుకు మద్దతు ఉపసంహరించుకుంది. ప్రభుత్వం మైనారిటీలో పడింది. ఐదుగురు ఎంపీలున్న మాయావతి.. వాజపేయికి మద్దతు ప్రకటించారు. అయినా మేజిక్ మార్కు కంటే ఒక ఓటు తక్కువగానే ఉంది. ఒడిసా ముఖ్యమంత్రిగా వెళ్లిన కాంగ్రెస్ ఎంపీ గిరిధర్ గమాంగ్ అప్పటికింకా లోక్‌సభ సభ్యత్వానికి రాజీనామా చేయలేదు. ముఖ్యమంత్రిగా ఉన్నందున, నైతిక ధర్మాన్ని అనుసరించి ఆయన లోక్‌సభకు రారని, ఓటేయరని వాజపేయి భావించారు. కానీ ఆయన ఆఖరి నిముషంలో సభకు వచ్చారు. ఆయనకు ఓటేసే అధికారం లేదని రూలింగ్ ఇవ్వడం ద్వారా స్పీకర్‌గా ఉన్న బాలయోగి అయినా ప్రభుత్వాన్ని కాపాడతారని ఎన్డీయే పెద్దలు ఊహించారు. కానీ బాలయోగి రూల్‌బుక్‌ను అనుసరించి, గమాంగ్‌ను ఓటేసేందుకు అనుమతించారు. ఒక్క ఓటు తేడాతో వాజపేయి ప్రభుత్వం కుప్ప కూలింది. స్పీకర్ బాలయోగి తన ఓటు వేసి ఉన్నా ప్రభుత్వం పడిపోయేది కాదు. స్పీకర్ స్థానంలో కూర్చున్న తాను ఏ ఒక్క పక్షానికో మద్దతు ఇవ్వడం సరైనది కాదన్న భావనతో ఆయన తటస్థంగా ఉన్నారు. లోక్‌సభలో ఒక్క ఎంపీ మద్దతు ప్రకటించి ఉన్నా నాడు వాజపేయి ప్రభుత్వం బతికి బట్టకట్టేది. కానీ ఎంపీలను కొనుగోలు చేయడం లేదా మేనేజ్ చేయడం ఇష్టంలేని వాజపేయి, ప్రభుత్వాన్ని కోల్పోవడానికే మొగ్గు చూపారు. తనకంటే ముందు ప్రధానమంత్రిగా ఉన్న పీవీ నరసింహారావు, లోక్‌సభలో మెజారిటీ లేకపోయినా, జార్ఖండ్ ముక్తి మోర్చా వంటి పార్టీలకు చెందిన ఎంపీలను కొనుగోలు చేసి అధికారాన్ని కాపాడుకున్నారు. అయినా వాజపేయి ఆ సంప్రదాయాన్ని పాటించలేదు. అనైతికంగా అధికారంలో కొనసాగడానికి ఇష్టపడలేదు. ఇప్పుడు అదే వాజపేయి వారసుడిగా, అదే భారతీయ జనతా పార్టీకి చెందిన నరేంద్ర మోదీ ప్రధానమంత్రిగా ఉన్నారు. కానీ ఒక్క ఎంపీ కోసం అనైతిక చర్యలను ప్రోత్సహించారు. గుజరాత్‌లో తగిన బలం లేకపోయినా మూడవ అభ్యర్థిని రాజ్యసభకు పోటీ పెట్టి, కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడం ద్వారా అదనంగా ఒక ఎంపీ సీటు సంపాదించడానికి చేసిన ప్రయత్నాలను మనం చూశాం. పార్టీ ఒక్కటే! అయితే అందలం ఎక్కిన వ్యక్తులు వేరు! నైతిక విలువలు- ఉన్నత సంప్రదాయాలు నెలకొల్పడంలో మాత్రం ఎంత పతనం! గుజరాత్‌లో ఇప్పుడు బాధిత పక్షంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఇలాంటి అనైతిక చర్యలకు పాల్పడింది. 'నీవు నేర్పిన విద్యయే నీరజాక్ష' అని ఇప్పుడు మోదీ- షా ద్వయం అవే అనైతిక చర్యల ద్వారా కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడానికి ప్రయత్నించింది. ఫలితంగా 57 మంది సభ్యులు ఉన్న కాంగ్రెస్ బలం గుజరాత్‌లో 44కి పడిపోయింది. ఈ 44 మందినీ కర్ణాటకలో క్యాంపులో ఉంచి తీసుకొచ్చినా అందులో ఇద్దరు చివరి నిముషంలో సొంత పార్టీ అభ్యర్థిని కాదని భారతీయ జనతా పార్టీ అభ్యర్థికి ఓటు వేశారు. అయితే అధీకృత ఏజెంట్‌కు కాకుండా ప్రత్యర్థి పార్టీ ఏజెంట్‌కు తాము వేసిన ఓటును చూపించడంతో వారి ఓట్లు చెల్లవు అని ఎన్నికల కమిషన్ ప్రకటించింది. మోదీ కేబినెట్‌లోని అతిరథ మహారథులు స్వయంగా వచ్చి ఒత్తిడి తెచ్చినా ఎన్నికల కమిషన్ సభ్యులు నిష్పక్షపాతంగా వ్యవహరించారు. ఇందుకు వారిని అభినందించాల్సిందే! ఇతర పార్టీలకు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు ఓటు వేయడంతో కాంగ్రెస్ అభ్యర్థి అహ్మద్ పటేల్ చచ్చీ చెడీ గెలిచారు. నిజానికి రాజ్యసభలో ఒక ఎంపీ తక్కువైనంత మాత్రాన నరేంద్ర మోదీ ప్రభుత్వానికి వచ్చే ఇబ్బంది ఏమీ ఉండదు. కానీ దేశాన్ని 'కాంగ్రెస్ ముక్త భారత్' చేయాలన్న పట్టుదలతో మోదీ- షా ద్వయం ఆ పార్టీని దెబ్బతీయడానికి ఏ చిన్న అవకాశం వచ్చినా వదలడం లేదు. ఈ నేపథ్యంలోనే ఎమ్మెల్యేల కొనుగోలు క్రీడకు తెర లేపారు. దేశం నుంచి అవినీతిని పారదోలాలనీ, నైతిక విలువలను నెలకొల్పాలనీ రోజూ ఉపన్యాసాలు ఇచ్చే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో ఇటువంటి అనైతిక కార్యకలాపాలు జరగడం మాత్రం ఎబ్బెట్టుగా ఉంది. దీనివల్ల ప్రధానమంత్రి చిత్తశుద్ధిని శంకించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. నిజానికి దేశంలో నల్లధనానికి, అవినీతికి చోటు ఉండకూడదన్న నినాదంతోనే పెద్ద నోట్ల రద్దు నిర్ణయాన్ని మోదీ తీసుకున్నారు. ఈ నిర్ణయం ప్రభావం వల్ల ఇబ్బందులు ఎదురైనా తమ జీవితాలలో మార్పు వస్తుందనీ, నల్లకుబేరుల ఆట ముగిసినట్టేనని నమ్మిన సామాన్య జనం ప్రధానమంత్రికి మద్దతుగా నిలిచారు. ఇప్పుడు అదే దారిలో జీఎస్‌టీ తీసుకువచ్చినా ప్రధానికి అండగా ఉన్నారు. కుళ్లు, కుతంత్రాలు, అవినీతిమయమైన రాజకీయాలను నరేంద్ర మోదీ ప్రక్షాళన చేయగలరన్న నమ్మకం ఉండటం వల్లనే ప్రజలు ఆయనకు జైకొడుతున్నారు. కానీ జరుగుతున్నది ఏమిటి? గుజరాత్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యేల కొనుగోలుకు డబ్బు ఎక్కడిది? ఎవరు ఇచ్చారు? లెక్కలు ఉన్నాయా? ఎమ్మెల్యేలను కొనుగోలు చేయలేదనీ, మోదీ- షాల నాయకత్వం పట్ల ముచ్చటపడే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బయటకు వచ్చారని బీజేపీ నాయకులు చెబుతూ ఉండవచ్చు గానీ, అది ఆత్మవంచనే అవుతుంది. వాస్తవంగా ఏమి జరిగిందీ వారికీ తెలుసు. కాంగ్రెస్ నుంచి ఫిరాయించిన ఎమ్మెల్యేలకూ తెలుసు. ప్రజలకూ తెలుసు. బ్యాంకులలో దాచుకున్న డబ్బును సొంత అవసరాలకు తీసుకోవడానికి కూడా రైతులు ఇబ్బందిపడటాన్ని మనం చూస్తున్నాం. నగదు ఉపసంహరణపై ఎన్నో ఆంక్షలు పెట్టారు. వీటి అన్నింటి వల్ల ప్రజలు ఇబ్బంది పడుతూనే ఉన్నారు. అయినా ప్రధానమంత్రి ఉద్దేశం మంచిది కదా! అని సర్దుకుపోతున్నారు. ప్రజలకు అందని నగదు రాజకీయ పార్టీలకు మాత్రం లభిస్తోంది. నిన్నగాక మొన్న ఉత్తరప్రదేశ్‌లో జరిగిన ఎన్నికలలో కూడా భారతీయ జనతా పార్టీ వందల కోట్ల రూపాయలు ఖర్చు చేసిందని వార్తలు వచ్చాయి. ఇప్పుడు గుజరాత్‌లో ఎమ్మెల్యేల మద్దతు కోసం డబ్బు ఖర్చు చేశారు. ఈ డబ్బుకు లెక్క ఉందో లేదో మోదీ- షా ద్వయమే చెప్పాలి. నిజానికి దేశంలో నల్ల ధనం, అవినీతి పోవాలంటే రాజకీయ పార్టీల నుంచే ప్రక్షాళన మొదలవ్వాలి. నల్లధనం రూపంలో రాజకీయ పార్టీలు విరాళాలు తీసుకుని ఓటర్లను కొనుగోలు చేయడానికి వాడుతున్నాయి. ఎన్నికలు అయ్యాక తగిన మెజారిటీ సమకూరని సందర్భాలలో ఎమ్మెల్యేలు లేదా ఎంపీల బేరసారాల కోసం ఈ నల్లధనాన్నే వాడుతున్నారు. వ్యాపారులు- పారిశ్రామికవేత్తలు రాజకీయ పార్టీలకు



"దేశాన్ని 'కాంగ్రెస్ ముక్త భారత్' చేయాలన్న పట్టుదలతో మోదీ- షా ద్వయం ఆ పార్టీని దెబ్బతీయడానికి ఏ చిన్న అవకాశం వచ్చినా వదలడం లేదు. ఈ నేపథ్యంలోనే ఎమ్మెల్యేల కొనుగోలు క్రీడకు తెర లేపారు. దేశం నుంచి అవినీతిని పారదోలాలనీ, నైతిక విలువలను నెలకొల్పాలనీ రోజూ ఉపన్యాసాలు ఇచ్చే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో ఇటువంటి అనైతిక కార్యకలాపాలు జరగడం మాత్రం ఎబ్బెట్టుగా ఉంది."

ఇస్తున్న విరాళాలలో అత్యధిక భాగం నల్ల డబ్బు రూపంలోనే ఉంటోంది. ఈ పరిస్థితిని నివారించకుండా ఉపరితల విన్యాసాలు ఎన్ని చేసినా ఫలితం ఉండదు. నంద్యాలలో జరుగుతున్న ఉప ఎన్నికనే తీసుకోండి. ప్రధాన పార్టీలు రెండూ పోటీ పడి డబ్బు ఖర్చు చేస్తున్నాయి. ఓటర్లు కూడా ఈసారి ఒక్కో ఓటుకు అయిదు వేల రూపాయలు అయినా ఇవ్వాలని కోరుతున్నారట! నంద్యాలలో రెండు లక్షల పైచిలుకు ఓటర్లు ఉన్నారు. అందరికీ కాకపోయినా ఇందులో కనీసం లక్ష మందికి డబ్బు పంచాలనుకున్నా అయిదు వేల వంతున ఒక్కో పార్టీ 50 కోట్ల రూపాయలు ఖర్చు చేయవలసి ఉంటుంది. ఇవి కాక నాయకుల కొనుగోలుకు లేదా సొంత పార్టీవాళ్లు చేజారిపోకుండా కాపాడుకోవడానికి ఇతర ఖర్చులకు మరెంతో డబ్బు కావలసి ఉంటుంది. అంటే రెండేళ్ల పదవీకాలం కూడా లేని ఎమ్మెల్యే పదవి కోసం ఒక్కో పార్టీ వంద కోట్ల రూపాయల వరకు ఖర్చు చేయవలసి వస్తోందన్న మాట! ఇందులో ఒక్క రూపాయి కూడా తెల్ల డబ్బు ఉండదు. ఎన్నికల ఖర్చు లక్షల నుంచి కోట్లకు చేరిపోయింది. ఇప్పుడు నంద్యాలలో జరుగుతున్న దాన్ని ప్రాతిపదికగా తీసుకుంటే వచ్చే ఎన్నికలలో ఏపీలోని 175 స్థానాలకు ఎంత ఖర్చు అవుతుందో ఊహించుకోవచ్చు. నంద్యాలలో ఖర్చు చేసినంత కాకపోయినా ఒక్కో నియోజకవర్గంలో ఒక్కో అభ్యర్థి సగటున 15 కోట్ల రూపాయల వరకు ఖర్చు చేయవలసి ఉంటుందని ఇప్పుడు ఎమ్మెల్యేలుగా ఉంటున్న వారే చెబుతున్నారు. ఈ లెక్కన రెండు ప్రధాన పార్టీలూ కలిసి వచ్చే ఎన్నికలలో అయిదు వేల కోట్ల రూపాయల వరకు ఖర్చు చేయవలసి ఉంటుందన్న మాట! ఇవికాక ఎంపీ ఎన్నికలు ఉండనే ఉన్నాయి. 2019 ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ ఎంత డబ్బు ఖర్చు చేస్తుందో చూడాలి! ఎన్నికలలో డబ్బు అవసరం లేకుండా సంస్కరణలు తీసుకురాకుండా ఎన్ని చర్యలు తీసుకున్నామని చెప్పినా నల్లధనం ఊరుతూనే ఉంటుంది. రాజకీయ పార్టీల ప్రధాన లక్ష్యం అధికారం. ఆ అధికారం అందుకోవడం కోసం ఎంతకైనా తెగబడతాయి. ఆ క్రమంలోనే ఖర్చు వందలు, వేల కోట్ల రూపాయలకు చేరిపోయింది.

■ మోదీ.. ఏదీ తేడా?

ఇప్పుడు మళ్లీ గుజరాత్‌కు వెళదాం! గుజరాత్‌లో చోటుచేసుకున్న పరిణామాల వల్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతిష్ఠ ఎంతో కొంత మసకబారిందని చెప్పవచ్చు. ఈ మూడేళ్లుగా తన వైపు వేలెత్తి చూపే అవకాశం లేకుండా మోదీ జాగ్రత్తగా వ్యవహరించారు. అధికారంలోకి వచ్చిన ప్రారంభంలో శివసేన పార్టీకి చెందిన ఎంపీ సురేశ్ ప్రభును ఆ పార్టీ అధిష్ఠానం అభిప్రాయానికి విరుద్ధంగా ఏకంగా కేబినెట్‌లోకి తీసుకున్నా ప్రజలు పట్టించుకోలేదు. మోదీ ప్రభంజనంలో అది కొట్టుకుపోయింది. ఉత్తరప్రదేశ్- బిహార్‌లో తెర వెనుక ఏమి జరిగినా ప్రజలు గమనించలేదు. ఈ మూడేళ్లూ అవినీతి మరక అంటకుండా, ఇతరులకు కూడా అంటుకోనివ్వకుండానే మోదీ దేశాన్ని పాలించారు. అంతవరకు ఆయనను అభినందించవలసిందే! అయితే మొన్న బిహార్‌లో, నిన్న గుజరాత్‌లో జరిగిన పరిణామాల వల్ల ప్రధాని మోదీ నైతికత, నిబద్ధత ప్రశ్నార్థకంగా మారాయి. బిహార్‌లో భారతీయ జనతా పార్టీకి వ్యతిరేకంగా నితీశ్- లాలూ కూటమికి ప్రజలు అధికారం అప్పగించారు. ఈ ఇద్దరు నాయకులూ విభేదాలు వచ్చి విడిపోయారు. దీంతో ప్రజలు తిరస్కరించిన భారతీయ జనతా పార్టీ ఇప్పుడు బిహార్ ప్రభుత్వంలో భాగస్వామి అయ్యింది. అంటే ప్రజల తీర్పుతో సంబంధం లేని ప్రభుత్వం అక్కడ ఇప్పుడు పరిపాలిస్తోంది. ఇది ఎంతవరకు సమర్థనీయమో మోదీజీనే చెప్పాలి. కాంగ్రెస్ పార్టీని దెబ్బతీసే క్రమంలో చేస్తున్న పనులన్నీ దేశహితం కోసమేనని సరిపెట్టుకోవాలేమో తెలియదు. ఇప్పుడు గుజరాత్‌లో కూడా తగిన సంఖ్యాబలం లేకపోయినా బీజేపీ మూడవ అభ్యర్థిని పోటీ పెట్టింది. దీని ద్వారా ఎమ్మెల్యేల బేరసారాలకు తెర తీసినట్టే కదా! ఈ క్రతువులో చాలావరకు విజయం సాధించగలిగినా చివరి ప్రయత్నం విఫలమై మొదటికే మోసం వచ్చింది. ఫలితంగా మిగతా నాయకులకు, మిగతా పార్టీలకు, భారతీయ జనతా పార్టీకి చెందిన మోదీ-షాలకు కూడా తేడా లేదని ప్రజలు భావించే పరిస్థితిని కోరి తెచ్చుకున్నారు. ఒక్క ఎంపీ కోసం ఇంతలా దిగజారడం అవసరమా? తామందరూ ఇప్పటికీ స్మరించుకుంటూ గౌరవం వ్యక్తంచేస్తున్న వాజపేయి నెలకొల్పిన విలువలను ఎందుకు పాటించలేకపోయారో తెలియదు. గుజరాత్ నుంచి ఒక్క రాజ్యసభ సీటును అదనంగా గెలుచుకున్నా, గెల్చుకోకపోయినా బలాబలాలు ఏమీ తలకిందులు కావు. మోదీ అధికారానికి వచ్చిన ప్రమాదం ఏమీ లేదు. అయినా ఒక్క ఎంపీ సీటు కోసం కక్కుర్తిపడటంతో ఇతర రాజకీయ నాయకులకు, మోదీకి మధ్య అట్టే తేడా లేదు అని ప్రజలు భావించే పరిస్థితిని తెచ్చుకున్నారు. భారతీయ జనతా పార్టీ విస్తరణ కాంక్ష మోదీ- షాలను నిలవనివ్వడం లేదు. ఈ క్రమంలోనే తప్పటడుగులు వేస్తున్నారు. దేశమంతటా అన్ని రాష్ట్రాలలో భారతీయ జనతాపార్టీ పతాకం రెపరెపలాడాలన్నది ఈ ఇరువురి నాయకుల కోరిక! ఈ కారణంగానే ఇప్పుడు దక్షిణాదిపై దృష్టిపెట్టారు. తమిళనాడులో పళనిస్వామి ప్రభుత్వాన్ని బుట్టలో వేసుకున్నారు. పేరుకు బీజేపీ ప్రభుత్వం కాకపోయినా తమిళనాడులో పళనిస్వామి ప్రభుత్వం మోదీ- షాల ద్వయం ఆడమన్నట్టు ఆడుతోంది. లేని పక్షంలో ఏమవుతుందో శశికళ విషయంలో రుజువైంది కదా! కానీ ఇక్కడ ఒక్క విషయాన్ని భారతీయ జనతా పార్టీ నాయకులు గుర్తుంచుకోవాలి. దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చిన కాంగ్రెస్ పార్టీ కూడా స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో అన్ని రాష్ట్రాలలో అధికారంలోకి రాలేకపోయింది. అలాంటిది ఇప్పుడు దేశం మొత్తం ఒకే ఏలుబడిలో ఉండాలనుకోవడం అత్యాశ కాదా! ప్రపంచం మొత్తాన్ని జయించాలనుకున్న వాళ్లు కూడా సఫలం కాలేదు. అలాగే ఇప్పుడు దేశాన్ని జయించాలనుకుంటున్న మోదీ- షాలు ఎంతవరకు విజయం సాధిస్తారో వేచి చూద్దాం. గుజరాత్ వ్యవహారంలో బాధితపక్షంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు నీతి వాక్యాలు వల్లె వేస్తోంది గానీ దేశ రాజకీయాలు ఇవ్వాళ ఇంతలా భ్రష్టుపట్టిపోవడానికి ఆ పార్టీనే ప్రధాన కారణం. చట్టాలను తెచ్చిందీ వాళ్లే- వాటికి తూట్లు పొడిచిందీ వాళ్లే! పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం తెచ్చింది కాంగ్రెస్

"గుజరాత్ వ్యవహారంలో బాధిత పక్షంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు నీతి వాక్యాలు వల్లె వేస్తోంది గానీ దేశ రాజకీయాలు ఇవ్వాళ ఇంతలా భ్రష్టుపట్టిపోవడానికి ఆ పార్టీనే ప్రధాన కారణం. చట్టాలను తెచ్చిందీ వాళ్లే- వాటికి తూట్లు పొడిచిందీ వాళ్లే! పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం తెచ్చింది కాంగ్రెస్ పార్టీనే! ఆ చట్టాన్ని తుంగలో తొక్కి అవసరమైనప్పుడల్లా, అవకాశం చిక్కినప్పుడల్లా పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిందీ కాంగ్రెస్ పార్టీనే!"

పార్టీనే! ఆ చట్టాన్ని తుంగలో తొక్కి అవసరమైనప్పుడల్లా, అవకాశం చిక్కినప్పుడల్లా పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిందీ కాంగ్రెస్ పార్టీనే! అటల్ బిహారి వాజపేయి ప్రభుత్వానికి జయలలిత నేతృత్వంలోని అన్నాడీఎంకే మద్దతు ఉపసంహరించుకోవడంతో ఆయన ప్రభుత్వం ఒక్క ఓటు తేడాతో కూలిపోయింది. కానీ ఆ తర్వాత కొంతకాలానికి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వానికి కూడా లోక్‌సభలో బలాబలాల సమస్య తలెత్తింది. అప్పుడు ప్రభుత్వాన్ని కాపాడుకోవడానికి కాంగ్రెస్ పార్టీ అనేక అడ్డదారులు తొక్కింది. ఇప్పుడు చచ్చీ చెడీ గుజరాత్ నుంచి రాజ్యసభకు ఎన్నికైన అహ్మద్ పటేల్ వంటివారే అప్పుడు ఇతర పార్టీలకు చెందిన ఎంపీలను ప్రలోభపెట్టారు. అప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డికి ఇతర పార్టీల ఎంపీల మద్దతు కూడగట్టే బాధ్యత అప్పగించారు. దీంతో రంగంలోకి దిగిన రాజశేఖరరెడ్డి, తెలుగుదేశం పార్టీ ఎంపీలపై గురిపెట్టారు. ఫలితమే.. డీకే ఆదికేశవులునాయుడు, మందా జగన్నాథం వంటి తెలుగుదేశం పార్టీ ఎంపీలు లోక్‌సభలో యూపీఏ ప్రభుత్వానికి జైకొట్టారు. ఇక రాష్ట్రాలలో అధికారం నిలబెట్టుకోవడం కోసం లేదా అధికారంలో ఉన్న ఇతర పార్టీల ప్రభుత్వాలను కూల్చడం కోసం కాంగ్రెస్ పార్టీ చేయని అరాచకం లేదు. ఐబీ, సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, ఆదాయపు పన్ను శాఖ వంటి ఏజెన్సీలను రాజకీయ ప్రత్యర్థులపై ఉసిగొల్పిన ఘనచరిత్ర కాంగ్రెస్‌కు ఉంది. ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయనపైకి ఇంటెలిజెన్స్ బ్యూరో వంటి సంస్థలను ప్రయోగించి నానా ఇబ్బందులు పెట్టారు. సీబీఐ ద్వారా విచారణలు జరిపించారు. ఇప్పుడు కాంగ్రెస్ అడుగుజాడలలో అదే నరేంద్ర మోదీ, అవే ఏజెన్సీలను కాంగ్రెస్ నాయకుల మీదకు ప్రయోగిస్తున్నారు. తన కుమారుడిని ముప్పుతిప్పలు పెడుతున్న సీబీఐ, ఆదాయపుపన్ను విభాగాలపై కాంగ్రెస్ పార్టీకి చెందిన కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం ఇప్పుడు చిందులేస్తున్నారు. ఆయన కేంద్ర ఆర్థిక మంత్రిగా, కేంద్ర హోం శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఇవే ఏజెన్సీలను ఆయన పర్యవేక్షణలో రాజకీయ ప్రత్యర్థులపైకి ఉసిగొల్పలేదా? కక్ష సాధింపులు అనేవి రాజకీయాలలో ఒక క్రీడగా మారిపోయాయి. కేంద్ర దర్యాప్తు సంస్థలు అధికారంలో ఉన్న పార్టీల చేతుల్లో పావులుగా ఉంటున్నాయి. ఫలితంగా నిజంగా తప్పుచేసిన వాళ్లు కూడా బుకాయించగలుగుతున్నారు. ప్రజలలో కూడా దర్యాప్తులపై అపనమ్మకం ఏర్పడుతోంది. కేంద్రంలో యూపీఏ అధికారంలో ఉన్నప్పుడు తెలుగుదేశం పార్టీకి చెందిన ఒక ఎంపీపై ఆదాయం పన్ను శాఖ అధికారులు పదే పదే దాడులు నిర్వహించారు. దీంతో కలత చెందిన సదరు ఎంపీ సీఎం ఎంకు చెందిన ఒక ముఖ్య నాయకుడైన ఎంపీని నాటి కేంద్ర ఆర్థిక మంత్రి ప్రణబ్ ముఖర్జీ వద్దకు రాయబారం పంపారు. "దాడులకు గురవుతున్న ఎంపీపై నాకు వ్యక్తిగతంగా కోపం ఏమీలేదు. మేడం సోనియాగాంధీ నుంచి ఆ ఆదేశాలు రావడానికి రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా ఉన్న రాజశేఖర్‌రెడ్డి కారణం" అని ప్రణబ్ చెప్పారు. సదరు తెలుగుదేశం పార్టీ ఎంపీ కాంగ్రెస్‌లో చేరడానికి అంగీకరించకపోవడమే అప్పుడు రాజశేఖర్‌రెడ్డి ఆగ్రహానికి కారణం! ఇలా చెప్పుకొంటూ పోతే కాంగ్రెస్ దురాగతాలు ఎన్నో ఉంటాయి. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడంలో గానీ, ప్రభుత్వ ఏజెన్సీలను దుర్వినియోగం చేయడంలో గానీ అన్ని రాజకీయ పార్టీలకు ఎంతో కొంత పాత్ర ఉంటూనే వస్తోంది. ఈ క్రీడలో అధికారంలో ఉన్నవారిది అప్పటికి పైచేయి అవుతుంది. అధికారం కోల్పోగానే వారే బాధితులుగా బోరుబోరుమంటుంటారు. బహుశా అందుకే కాబోలు పార్టీ ఫిరాయింపులను ప్రజలు కూడా సీరియస్‌గా పరిగణించడం లేదు. అంతేకాకుండా అవినీతి ఆరోపణలకు గురవుతున్న రాజకీయ నాయకులను కూడా ఆదరిస్తున్నారు.

■ నోరు జారితే..

ఇప్పుడు కాసేపు ఏపీ వ్యవహారాలకు వద్దాం. భూమా నాగిరెడ్డి మృతి వల్ల ఉప ఎన్నిక జరుగుతున్న నంద్యాలలో వాతావరణం వేడెక్కుతోంది. ప్రధాన రాజకీయ పార్టీలైన తెలుగుదేశం- వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలు కత్తులు దూసుకుంటున్నాయి. ఇరు పార్టీల నాయకుల నోటి నుంచి మాటల తూటాలు వర్షంలా కురుస్తున్నాయి. ఈ క్రమంలో హద్దూ- పద్దూ లేకుండా పోతోంది. ప్రతిపక్ష నాయకుడు జగన్మోహన్‌రెడ్డి రోజుల తరబడి నంద్యాలలో మకాం చేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని నడిబజారులో కాల్చినా తప్పులేదని జగన్మోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్య ఎంత వివాదం అయ్యిందో, భూమా నాగిరెడ్డి కుమార్తె మంత్రి భూమా అఖిలప్రియ వస్త్రధారణపై వైఎస్ఆర్ కాంగ్రెస్ స్టార్ క్యాంపెయినర్‌గా చలామణి అవుతున్న రోజా చేసిన వ్యాఖ్యలు కూడా అంతే వివాదాస్పదం అయ్యాయి. చీర కట్టుకోకుండా చుడీదార్‌తో తిరిగే అఖిలప్రియకు సంప్రదాయం తెలియదంటూ చేసిన వ్యాఖ్యలు రోజాకే ఎక్కువ నష్టం కలిగించాయి. రోజా కూడా చుడీదార్ ధరించిన రోజులు ఉన్నాయి. టీవీషోలలో ఇప్పటికీ ఆమె చుడీదార్ల వంటి దుస్తులు ధరించి అప్పుడప్పుడు పాల్గొంటున్నారు. అంతెందుకు రోజా కుమార్తెలు చీరలే కట్టుకుంటున్నారా? లంగా ఓణీలు, చీరలు ధరించడం అనేది పెళ్లిళ్లు, పేరంటాలు వంటి ఉత్సవాలలోనే చూస్తున్నాం. మిగతా సందర్భాలలో చాలామంది మహిళలు, యువతులు సౌకర్యంగా ఉంటుందని చుడీదార్లు, ప్యాంట్ షర్టులే ధరిస్తున్నారు. ఇప్పుడు అవన్నీ మన పిల్లల వస్త్రధారణలో భాగమైపోయాయి. అలాంటిది- నిండా 30 ఏళ్ల వయసు కూడా లేని అఖిలప్రియ చుడీదార్లు ధరిస్తే తప్పు ఏమిటో రోజాకే తెలియాలి. ఎదుటివారు చప్పట్లు కొడుతున్నారు కదా అని ఏది పడితే అది మాట్లాడితే మొదటికే మోసం వస్తుంది. అందుకే కాలు జారినా తీసుకోవచ్చు గానీ, నోరు జారితే వెనక్కు తీసుకోలేమని పెద్దవాళ్లు చెప్పారు. నంద్యాలలో ఎన్నికల ప్రచారం ప్రారంభంలోనే ఇలా ఉంటే ప్రచారం ముగింపు దశకు వచ్చేనాటికి మన నాయకుల మాటలు మరెంత వేడి పుట్టిస్తాయో చూడాలి. గతంలో ఉప ఎన్నికలు చడీ చప్పుడు లేకుండా జరిగేవి. ఇప్పుడు ఏ ఎన్నిక అయినా రాజకీయ పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతోనే నోళ్లు అదుపు తప్పుతున్నాయి. నంద్యాల ఫలితం ఎలా ఉండబోతుందా? అని ఏపీలోనే కాదు- తెలంగాణలో కూడా ఎదురుచూస్తున్నారు. తెలంగాణలో ఉప ఎన్నికలు జరిగినందున ముఖ్యమంత్రి కేసీఆర్ తన బలం పెరిగిందని రుజువు చేసుకున్నారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన మూడేళ్ల తర్వాత తొలిసారిగా ఉప ఎన్నిక పరీక్షను ఎదుర్కొంటున్నారు. అందుకే నంద్యాల పోరు ప్రతిష్ఠాత్మకం అవుతోంది. పనిలో పనిగా కాకినాడ నగరపాలక సంస్థకు కూడా ఎన్నికలు జరగబోతున్నాయి. అక్కడ పరిస్థితి ఎలా ఉంటుందో చూడాలి. ప్రధాన పార్టీల ప్రధాన నాయకులందరూ నంద్యాలలోనే మకాం వేసినందున కాకినాడలో ఏమి జరుగుతున్నదో అంతగా తెలియడం లేదు. నేతలు ప్రచార రంగంలోకి దిగితే అక్కడ కూడా వేడి రాజుకోకుండా ఎలా ఉంటుంది?

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం
http://www.youtube.com/abntelugutv

లెఫ్ట్ వారి పుట్టింటి ప్రేమ!

చెవిలో చిన్నమాట

ఒక చిన్నమాట.. ఒక్క చిన్న మాట...
చిన్నగానో, సన్నగానో... సణుగుడో, గొణుగుడో...
అంత ఘాటుగా, ముక్కు సూటిగా కాకున్నా, చాటుగానో, మాటుగానో...
గుండె లోలోతుల నుంచి రాకున్నా, పెదవుల పైపైనుంచైనా...
తలుపు సందులోంచో, తడిక చాటు నుంచో, బూజు పట్టిన పుస్తకాల బీరువాలోంచో, పాత తరం పాగా వేసిన అటుకు మీది నుంచో... ఒక చిన్న మాట వినిపిస్తుందేమోనని 60 రోజులుగా, ఆశగా, ఆత్రంగా, ఆరాటంగా, చెవులు చింకి చాటంత చేసుకుని మరీ వింటున్నా. కళ్లు పేలిపోయేలా పేపర్లు, టీవీలు, సోషల్ మీడియాను గాలిస్తున్నా... సింగిల్‌కాలమ్ వార్తైనా కనిపిస్తుందేమోనని!

మావోయిస్టు చైనాది తప్పని, డోక్లాంలోకి వారి సైన్యం జొరబడడం భారత్‌కు, భూటాన్‌కు ముప్పని భారత కమ్యూనిస్టు దళంలోని ఒక్క నాయకుడైనా ఒకించుక ధైర్యంతో గళం విప్పుతాడని అనుకున్నా! కానీ నా ఆశలు అడియాసలే అయ్యాయి!

1962లో జరిగిందిదే. ఇప్పుడు జరుగుతున్నదీ ఇదే. 'హిందీ- చీనీ భాయీ భాయీ' అని సోషలిస్టు నెహ్రూ నినదిస్తే.. ఆ మాటున, అధాటున కమ్యూనిస్టు చైనా హిమాలయ యుద్ధంతో గాయిగాయి చేసింది. సామ్యవాద చైనా... అలీన భారత్‌పై దాడి చేయడం ఏమిటి? అది పచ్చి అబద్ధం! అని భారత కమ్యూనిస్టులు ఘోషించారు! కృష్ణమీనన్ (అప్పటి రక్షణ మంత్రి) జోరే వార్‌కు అసలు కారణమని చైనాను పచ్చిగా సమర్థించారు.

అర్ధ శతాబ్ది గడిచినా ఆలోచనల తీరు మారలేదు. నానాటికీ పార్టీ అంతరించి పోతున్నా... చైనా భక్తితో తరించడం ఆగలేదు. డోక్లాంపై సీపీఎం పత్రిక పీపుల్స్ డెమాక్రసీ సంపాదకీయం ఏం రాసిందో చూడండి. "డోక్లాం భూటాన్ భూమి. ఆ వివాదాన్ని భూటాన్నే పరిష్కరించుకోనివ్వండి. అందులో మనం జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదు. సమస్యకు మూల కారణం డోక్లాం కాదు; మోదీ సర్కారు! మోదీ అమెరికాకు సన్నిహితం కావడం, టిబెట్ బౌద్ధ గురువు దలైలామాకు ప్రాధాన్యం పెంచడం చైనాకు చిరాకు తెప్పిస్తున్నది" అని సీపీఎం పత్రిక పేర్కొంది.

ఎంత నికార్సైన విశ్లేషణ! బలవంతులకు వ్యతిరేకంగా, పీడితుల పక్షాన నిత్యం రోడ్డెక్కి, ధర్నాలు, హర్తాళ్లు, బందులు, సమ్మెలతో వర్గ పోరాటాలు చేసే ఎర్ర వీరులు... చైనా పీడిత భూటాన్ పక్షాన భారత్ నిలబడొద్దంటున్నారు. అంటేగింటే వద్దనాల్సింది భూటాన్ కదా! చైనాలాంటి మహా సామ్రాజ్యంతో చిట్టెలుకలాంటి భూటాన్ చర్చలు జరిపి తేల్చుకుంటుందట! టిబెట్ ఏం తేల్చుకోగలిగింది? భూటాన్ సంగతి భూటాన్ తేల్చుకుంటుందని భారత్‌కు ఉచిత సలహా ఇస్తున్న కమ్యూనిస్టులు.. భారత- పాక్‌లు వాటి సంగతి అవి తేల్చుకుంటాయి... మీరెందుకు వేలు పెడుతున్నారని తమ మాతృభూమి చైనాను ప్రశ్నించరు. టిబెట్ సంగతి టిబెట్ తేల్చేసుకుంటుందని సలహా ఇవ్వరు. పైగా భూస్వామ్య లామాల నుంచి విముక్తి కలిగించడానికే టిబెట్‌ను చైనా ఆక్రమించిందని వంతపాడుతారు. నరహంతక గడాఫీ నుంచి లిబియాకు, డెడ్లీ కెమికల్ వెపన్ సద్దాంహుస్సేన్ నుంచి ప్రపంచానికి విముక్తి కలిగించడానికే



"భార్య కోసం భక్తి మార్గం పడుతున్న, సీట్ల కోసం సిద్ధాంతం మరుస్తున్న కమ్యూనిస్టులూ... ఈ దేశం కోసం చిన్న సాయం చేయరూ! ఈసారికైనా చైనాది తప్పని చిన్నమాట గట్టిగా చెప్పరూ! వినాలని ఉంది ప్లీజ్!!"

తాము యుద్ధాలు చేశామని చెప్పే అమెరికాకు, చైనాకు తేడా ఏముంది? రాచరికం నుంచి భూటాన్‌కు విముక్తి కలిగించడానికే దాన్ని ఆక్రమిస్తున్నట్టు, భారత్ ఆక్రమణ నుంచి విముక్తి కలిగించడానికే అరుణాచల్‌ను, సిక్కింను స్వాధీనం చేసుకుంటున్నట్టు రేపు చైనా ప్రకటిస్తే కూడా దాన్ని మన కమ్యూనిస్టులు సమర్థిస్తారేమో! ఎందుకంటే చైనాకు మనం చిరాకు తెప్పించకూడదు మరి!!

1962 యుద్ధంలో అవిభక్త సీపీఐ చైనాను సమర్థించింది. ఆ పార్టీ నేతలను ప్రభుత్వం జైల్లో పెట్టింది. అలా చెరసాల్లోకి వెళ్లిన వాళ్లలో కేరళ లెఫ్టిస్టు వీఎస్ అచ్యుతానందన్ ఒకరు. జైల్లో ఆయనకు కొంచం జ్ఞానోదయం అయింది. చైనా ఏజెంట్లు అనే ముద్ర తప్పించుకోవడానికైనా ఏదో ఒకటి చేద్దామని ఆయన ప్రతిపాదించారు. గాయపడ్డ భారత సైనికుల కోసం జైల్లోనే రక్తదానం చేద్దామని, తిండి తగ్గించుకుని మిగిలిన దాన్ని అమ్మడం ద్వారా వచ్చే డబ్బును యుద్ధ ఖర్చుల కోసం ఇద్దామనీ ప్రతిపాదించారు. జైల్లోనే ఉన్న నికార్సైన కమ్యూనిస్టులు తీవ్రంగా వ్యతిరేకించారు. రెండు వర్గాలు కొట్లాడుకునేదాకా వెళ్లింది. యుద్ధం ముగిసింది. కమ్యూనిస్టులు విడుదలయ్యారు. అచ్యుతానందన్ నిబద్ధత మీద పార్టీలో ఫిర్యాదు నమోదైంది. (చైనాకు కాకుండా) ప్రభుత్వానికి సాయం చేయడానికి అచ్యుతానందన్ ప్రయత్నించాడని, ఇది ముమ్మాటికీ నేరమేనని నిర్ధారించారు. ఆయన కమ్యూనిస్టు పటుత్వాన్ని శంకిస్తూ డిమోట్ చేసి పారేశారు. ఇదీ కమ్యూనిస్టుల చైనా భక్తి!

మనం మామూలు మనుషులం. ఈ మట్టిమీద పుట్టి, ఈ మట్టి తిండి తిని, ఈ మట్టిలో కలసిపోతాం కనుక, ఈ మట్టికి కట్టుబడి ఉండాలని అనుకుంటాం. కానీ మన లెఫ్టిస్టులు మేధావులు. అందువల్ల వారికి భౌగోళిక సరిహద్దులు వర్తించవు. దేశభక్తి, విదేశ భక్తి అన్న తేడా లేదు. జాతి ప్రయోజనాలకన్నా అంతర్జాతీయ సిద్ధాంత నిబద్ధతే ముఖ్యం! అందుకే వారు చైనాను వ్యతిరేకించలేరు. భారత్‌లో ముస్లింలను మాటైనా అనకముందే వారికి లౌకిక వాదం గుర్తుకొస్తుంది. చైనాలోని జిన్‌జియాంగ్ రాష్ట్రంలో ముస్లిం మహిళలు నిండా బురఖాలు వేసుకోవద్దని, మగాళ్లు పెద్దపెద్ద గడ్డాలు పెంచుకోవద్దని, పిల్లలకు మత ప్రాతిపదికన పేర్లు పెట్టొద్దని 15 రకాల నిషేధాజ్ఞలు విధించినా సామ్యవాదంలో భాగంగానే కనిపిస్తుంది. ఎక్కడో ఓ రచయిత మీద దాడి జరిగిందని అవార్డులు వాపస్ చేసే కమ్యూనిస్టు పరివారంలో ఒక్కరైనా... చైనా దుందుడుకుతనానికి వ్యతిరేకంగా కమ్యూనిజాన్ని వాపస్ చేస్తున్నట్టు ప్రకటించరు. భారత్‌కు ఇబ్బంది అయినా డోక్లాంలోకి చైనా రావచ్చు. కానీ తమకు ఇబ్బంది అవుతుంది కనుక కేరళలోకి ఆరెస్సెస్ రాకూడదు. వస్తే చంపేస్తారు. ఇక్కడ కశ్మీరీలు చేసేది అస్తిత్వ పోరాటంలా, ప్రభుత్వానిది అణచివేతలా కనిపిస్తుంది. కానీ చైనాలో యుఘుర్ ముస్లింలది వేర్పాటువాదంలా, కమ్యూనిస్టు సర్కారుది రాజ్య పరిరక్షణలా అనిపిస్తుంది. డోక్లాం చైనాదేనని, భూటాన్ ఈ విషయాన్ని అంగీకరించిందని చైనా బొంకినా... మరుసటి రోజే భూటాన్ దాన్ని ఖండించినా.. వారికి చైనాయే కరెక్ట్ అనిపిస్తుంది. ఎందుకంటే వారికి వాస్తవికతకన్నా వామపక్షీయతే ప్రధానం. భారత ప్రజల ప్రయోజనాల కన్నా చైనా ప్రజాసైన్యమే మిన్న!

నేతి బీరకాయలో నెయ్యంత కమ్యూనిజాన్ని కలిగివున్న చైనా అంటే వారికి మమకారమింకా చావలేదు. చైనాకు దాదాపు 22 దేశాలతో సరిహద్దు, తీర వివాదాలున్నాయి. అలనాడు బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీ వ్యాపారం పేరుతో వచ్చి, దేశాలను ఆక్రమించుకుని, సామ్రాజ్యాన్ని విస్తరించినట్టు.. ఇప్పుడు చైనా అధిక వడ్డీకి డబ్బులు అప్పిచ్చి, భూభాగాలను కుదువ పెట్టించుకుని, వాటిని స్వాధీనం చేసుకుని సామ్రాజ్య విస్తరణ చేస్తోంది! అయినా మనం మాట్లాడకూడదు. ఎందుకంటే చైనా నిప్పు. మనం శుద్ధ తప్పు! భార్యకోసం భక్తి మార్గం పడుతున్న, సీట్ల కోసం సిద్ధాంతం మరుస్తున్న కమ్యూనిస్టులూ... ఈ దేశం కోసం చిన్న సాయం చేయరూ! ఈసారికైనా చైనాది తప్పని చిన్నమాట గట్టిగా చెప్పరూ! వినాలని ఉంది ప్లీజ్!!

చివరాఖరు: కుహనా కమ్యూనిస్టుల కంటే, పేదల కోసం ప్రాణాలను పణంగా పెట్టి, అడవుల్లో ఆకలి దప్పులతో పోరాడుతున్న మావోయిస్టులే ఎంతో నయం. మావోయిస్టు చైనా మారిపోయిందనీ, ప్రాంతీయ విస్తరణవాద శక్తిగా తయారైందని వారు 9వ కాంగ్రెస్‌లోనే తీర్మానించారు. చైనా వైఖరిని ఖండించాలని కూడా నిర్ణయించారు.

■ కృ.తి.


kruthi1972@gmail.com

కన్యాశుల్కం@125

గురజాడ అప్పారావు గారు 'కన్యాశుల్కం' నాటకం 1896 సంవత్సరంలో రాశారు. ఆ నాటకం రెండవ ముద్రణ పీఠికలో- తెలుగుభాష నాటకరచనకు పనికి రాదన్న అభిప్రాయం తొలగించడానికే తాము 'కన్యాశుల్కం' నాటకం రాశామని ఆయన స్పష్టంగా చెప్పారు.

తొలిరోజుల్లో తెలుగులో స్వతంత్ర నాటకాలు చాలా తక్కువ. సామాజిక ఇతివృత్తం తీసుకొని నాటకాలు రాయడానికి సాహసించినవారు ఆ కాలంలో ఇద్దరే వున్నారు. మొదటివారు కందుకూరి వీరేశలింగ పంతులుగారు. వారు రాసిన 'బ్రాహ్మవివాహం' మొదలైనవి ప్రహసనాలు. కనక గురజాడ అప్పారావు గారి కన్యాశుల్కమే తొలి తెలుగు సాంఘిక నాటకం అవుతుంది.

ఏడవ శతాబ్దంలో మనదేశంలో బానిస వ్యాపారం ఉన్నట్టు 'మృచ్ఛకటిక' నాటకం తెలియచేస్తోంది... అందులోని అనేక ఘట్టాలు 'మృచ్ఛకటికం' కాలంనాటి సాంఘిక పరిస్థితులను తెలియచేస్తున్నాయి. అదేవిధంగా 'మృచ్ఛకటిక'తో పోల్చతగిన ఉన్నతస్థాయిలో కన్యాశుల్కం నాటక రచన సాగింది.



అంతకుముందు వాడుకభాషలో రచనలు లేనందువల్ల అప్పారావుగారు స్వంతపంథాలో -ప్రజలు మాట్లాడే భాషలో యీ నాటకం రాశారు. గిడుగురామమూర్తి పంతులుగారి వ్యవహారిక భాషా ఉద్యమం ఆ రోజుల్లోనే ప్రారంభమయ్యింది. గిడుగువారి ఉద్యమానికి మరింత బలం చేకూర్చాడు అప్పారావుగారు.

కందుకూరి వీరేశలింగం పంతులుగారి సంఘసంస్కరణోద్యమం ప్రభావం కూడా గురజాడ మీద ఉంది. 'కన్యాశుల్కం'లో వితంతు వివాహాలతో పాటు వీరేశలింగం గారి ప్రసక్తి కూడా ఉంది. 'మృచ్ఛకటిక' నాటకంలో ఆ కాలంనాటి బౌద్ధమత ప్రసక్తివున్నట్టే 'కన్యాశుల్కం'లో బ్రహ్మసమాజం ప్రసక్తి వుంది...అప్పారావుగారి కాలంనాటికి బ్రహ్మసమాజం బలంపుంజుకొంది. వేశ్యావృత్తి నిర్మూలన కూడా ఒక ఉద్యమంగా కొనసాగుతున్న రోజులవి. 'కన్యాశుల్కం' నాటకంలో మధురవాణి ఘట్టాలను విన్న తర్వాత గిడుగు రామమూర్తి గారు 'ఈ పాత్ర యింత సహజంగా రూపొందిందంటే నువ్వు వేశ్యల యిళ్ళకు వెళ్ళి వుంటావు. వెళ్ళావా? లేదా?' అని అడిగితే- నిజమేనని యిద్దరు వేశ్యలిళ్ళకు వెళ్ళి వారి అలంకరణ, మాటల తీరు గమనించానని గురజాడ గారు చెప్పారంటే- ఆయన పాత్ర చిత్రణకు యెంత శ్రద్ధ తీసుకున్నదీ తెలుసుకోవచ్చు.

గురజాడ అప్పారావుగారు షేక్స్పియర్‌ను నాటక శిల్పంలో మాత్రమే అనుకరించారని- గిరీశం, మధురవాణి, బుచ్చమ్మ, అగ్నిహోత్రావధానులు, రామప్పంతులు మొదలైన పాత్రలన్నీ నూటికి నూరుపాళ్ళు తెలుగుపాత్రలనీ నిస్సందేహంగా చెప్పవచ్చు. ఆ నాటకంలోని ప్రతిపాత్రలోను యీనాటికీ జీవం వుట్టిపడుతూ వుండడానికి మరో ముఖ్య కారణం సజీవమైన భాష!

■ అంగర సూర్యారావు

(సినీ, రంగస్థల నటులు జె.వి. సోమయాజులు, రమణమూర్తి ఆధ్వర్యంలోని 'నటరాజ కళాసమితి' వారి కన్యాశుల్కం నాటక ప్రదర్శన రజతోత్సవాల ప్రత్యేక సంచిక (1980) నుండి... సంక్షిప్తంగా)

(కన్యాశుల్కం నాటకం తొలి ప్రదర్శనకు నేటికి 125 వసంతాలు)

బాసరలో వంశపారంపర్యానికి చెల్లు

- పండితులందరికి సమాన బాధ్యతలు

బాసర, ఆగస్టు 12 : నిర్మల్ జిల్లా బాసర సరస్వతీ ఆలయంలో కొనసాగుతున్న వంశపారంపర్య విధానానికి శనివారం ఆలయ అధికారులు స్వస్తి పలికారు. ఆలయంలో కొంతమంది పండితులు విధులు నిర్వహిస్తూ కానుకలు మొదలైనవాటిని పక్కదారి పట్టించడంపై 'ఆంధ్రజ్యోతి' మెయిన్‌లో శనివారం కథనం ప్రచురితమైన విషయం పాఠకులకు తెలిసిందే. దీనికి స్పందించిన ఆలయ ఈవో సుధాకర్‌రెడ్డి వంశపారంపర్య విధానాన్ని రద్దుచేసేందుకు ఉత్తర్వులు జారీచేశారు. ఆలయంలో పనిచేసే వైదిక సిబ్బంది అందరికీ సమాన బాధ్యత నిర్వర్తించేలా ఆదేశాలు ఇచ్చారు. దీని ప్రకారం ఒక్కో పండితుడు నెలలో రెండు రోజులు అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించాల్సి ఉంటుంది. ఎంతోకాలంగా కొనసాగుతున్న వంశపారంపర్య విధానం రద్దవడంతో అటు ఆలయ వర్గాలో హర్షం వ్యక్తమవుతోంది.

కోదండరాం అరెస్టును ఖండిస్తున్నాం

- ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ గజ్జెల కాంతం



కరీంనగర్: సీఎం కేసీఆర్ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యారని ప్రజలను మరోమారు నమ్మించి మోసం చేయడానికే బహిరంగ సభలు నిర్వహిస్తున్నారని ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతం అన్నారు. శనివారం కరీంనగర్‌లో మాట్లాడుతూ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన జేఏసీ చైర్మన్ కోదండరాం యాత్రకు అనుమతి ఇచ్చి అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కామారెడ్డిలో జరిగిన దాడిని కూడా ఖండిస్తున్నామన్నారు. 16న హైదరాబాద్‌లో ప్రజా సంఘాల జేఏసీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, రెడ్డి సామాజిక వర్గాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహింస్తున్నట్లు తెలిపారు.

ప్రజాసంఘాలపై ఆంక్షలు తగవు: చాడ

జేఏసీ చైర్మన్ కోదండరాంను పోలీసులు అరెస్టు చేయడం శోచనీయమని, ప్రజాసంఘాలపై పోలీసుల ఆంక్షలు టీఆర్ఎస్‌కు తగదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి అన్నారు. కోదండరాం నిర్వహించే బహిరంగ సభ వేదికను కామారెడ్డిలో టీఆర్ఎస్ కార్యకర్తలు ధ్వంసం చేయడం, ప్రజా సంఘాల నాయకులపై దాడిచేస్తే పోలీసులు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంపై టీఆర్ఎస్ హింసను ప్రోత్సహిస్తుందా? అని ప్రశ్నించారు.

నీలాలో ఇరువర్గాల మధ్య ఘర్షణ

పలువురికి గాయాలు.. భారీగా పోలీస్ బందోబస్తు



ఇరువర్గాల ఘర్షణలో గాయపడ్డ యువకుడు

రెంజల్, ఆగస్టు 12 : నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలంలోని నీలా గ్రామంలో శనివారం రాత్రి ఇరువర్గాల మధ్య చిన్నపాటి విషయంలో ఘర్షణ చోటుచేసుకోగా, పలువురు గాయాలపాలయ్యారు. వివరాల్లోకి వెళితే.. శనివారం రాత్రి ఓ వర్గానికి చెందిన వ్యక్తి తన మోటార్‌సైకిల్‌పై వస్తుండగా, మరో వర్గానికి చెందిన వ్యక్తిని తాకడంతో చిన్నపాటి గాయాలయ్యాయి. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ద్విచక్రవాహనం నడుపుతున్న యువకుడిపై గాయాలపాలైన వ్యక్తి వర్గానికి చెందినవారు దాడికి దిగారు. విషయం తెలుసుకున్న మరో వర్గానికి చెందిన యువకులు గాయాలు తగిలిన వ్యక్తి ఇంటిపై దాడికి దిగారు. ఈ దాడిలో ఇరువర్గాలవారు ఒకరిపై దాడులకు పూనుకోగా, ఇద్దరు యువకులపై చాకుతో దాడి జరగడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఇరు వర్గాలవారు వందల సంఖ్యలో గుమికూడడంతో విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టే ప్రయత్నం చేశారు. బోధన్ ఏసీపీ మోహన్ నేతృత్వంలో బోధన్ టౌన్ సీఐ, బోధన్ ఎస్ఐ, ఎడపల్లి ఎస్ఐ సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను శాంతిపజేశారు.



నిద్రపోతున్న నిఘా

బాసర ఆలయంలో కీలక ప్రవేశాల్లో బిగించని కెమెరాలు
భద్రత పేరిట యేటా రూ.5 లక్షలకు పైగా భక్షణ!

బాసర, ఆగస్టు 12 : ప్రముఖ పుణ్యక్షేత్రమైన నిర్మల్ జిల్లా బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో నిఘా కరువైంది. ఇటీవల ఓ పండితుడు అమ్మవారి విగ్రహాన్ని తీసుకువెళ్ళి దేవరకొండలో పూజలు నిర్వహించిన ఘటనలో ఏం జరిగిందో తెలుసుకుందామని అధికారులుగుడిలో ఉన్న సీసీ కెమెరా ఫుటేజ్‌ని పరిశీలించారు. కానీ అవి సరిగా పనిచేయకపోవడంతో ఆ రోజు దృశ్యాలు కనిపించలేదు. ఆలయంలో సీసీ కెమెరాలు నామమాత్రంగా పనిచేస్తున్నాయి. కీలక ప్రదేశాల్లో సీసీ కెమెరాలు కనిపించడం లేదు. భద్రత కోసం ఏర్పాటుచేసే సీసీ కెమెరాలను అలంకార ప్రాయంగా దర్శనమిస్తున్నాయి. తమ అవినీతి, అక్రమాలు ఎక్కడ బయటపడతాయోనని కొంతమంది దేవస్థాన అధికార సిబ్బంది సీసీ కెమెరాల వ్యవస్థను పటిష్ట పరచడం లేదని విమర్శలు ఉన్నాయి. దేవస్థానంలో 12, 8 కెమెరాలతో పనిచేసే రెండు డిజిటల్ వీడియో రికార్డర్‌లు ఉన్నాయి. 20 కెమెరాలలో సగం వరకు పనిచేయడం లేదు. మిగతా కెమెరాలు కూడా స్పష్టమైన చిత్రాలను రికార్డ్ చేయడం లేదు. మూడేళ్ళ కిందట ఏర్పాటుచేసిన ఇవి శిథిల పరిస్థితికి చేరుకున్నాయి. సీసీ కెమెరా పరికరాలన్నీ నాసిరకమైన కంపెనీవిగా తెలుస్తుంది. భక్తులు నగదు చెల్లించే కౌంటర్లు, కానుకలు సమర్పించే ప్రదేశాలు, భక్తుల నుండి టికెట్లు స్వీకరించే ప్రవేశ ద్వారాల ద్వారా సీసీ కెమెరాల ఏర్పాటు లేదు. తమ అక్రమాలు బయటపడతాయని ముందు జాగ్రత్తగా కీలక ప్రదేశాల్లో సీసీ కెమెరాలను బిగించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇక మిగతా చోట్ల ప్రధాన ఆలయం, అక్షర శ్రీకార మండపాలు, భక్తులకు అద్దెకు ఇచ్చే కౌంటర్, అతిథి గృహాల వద్ద తగినన్ని సీసీ కెమెరాలను ఏర్పాటుచేయలేదు. దాదాపు వెయ్యి మంది భక్తులుండే రూ.100 అక్షర శ్రీకార మండపంలో ఒకే ఒక సీసీ కెమెరాను ఏర్పాటుచేశారు. అదే విధంగా రూ.వెయ్యి టికెట్ మండపం, భక్తుల టికెట్ స్వీకరించే ద్వారం వద్ద సీసీ కెమెరా పనిచేయడం లేదు. భక్తుల టికెట్‌లను రీ సైక్లింగ్ చేసేందుకే ఇక్కడ కెమెరా బిగించలేదనే విమర్శలు ఉన్నాయి. ఆలయంలో సీసీ కెమెరాల వ్యవస్థ ఇలా ఉంటే అధికారులు మాత్రం సీసీ కెమెరాలపై యేటా రూ.లక్షలు ఖర్చు చేస్తున్నారు. మరమ్మతుల పేరిట ప్రతినెల దొంగబిల్లులు సృష్టిస్తూ జేబులు నింపుకుంటున్నారు. యేడాదికి రూ.5 లక్షలకు పైనే ఖర్చు చూపిస్తున్నారు. ఇదిలా ఉండగా నాలుగు నెలల కిందట సీసీ కెమెరాల వ్యవస్థను పూర్తిగా మార్చివేయాలని ఇందుకు రూ.15 లక్షలు ఖర్చు అవుతుందని అనుమతి కోసం దేవాదాయ శాఖ కమీషనర్‌కు ఫైల్ పంపించారు. రూ. లక్షలు వ్యయంతో కొనుగోలు చేసిన వాకీటాకీలు, మెటల్ డిటెక్టర్‌లు కనిపించకుండా పోయాయి. నిత్యం వేలాది మంది భక్తులతో కిటకిటలాడే బాసర అమ్మవారి ఆలయంలో భద్రతా లోపాలే కనిపిస్తున్నాయి. గతంలో కేంద్రం నిఘా విభాగం అధికారులు ఇక్కడకు వచ్చి భద్రత కోసం చేపట్టాల్సిన చర్యల గురించి సూచించారు. ఆలయ అధికారులు ఇవేం పట్టించుకోవడం లేదు. ఆలయంలో 28 మంది హోంగార్డులు పనిచేస్తున్నారు. వారు భద్రత సేవలతో పాటు భక్తుల నియంత్రణ సేవలను నిర్వర్తిస్తున్నారు. అతి ముఖ్యమైన సీసీ కెమెరాల నిఘా లేకపోవడంతో పలు అపశృతులు చోటుచేసుకుంటున్నాయి.బాసర పుణ్యక్షేత్రంపై ఉగ్రవాదుల దృష్టి ఉన్నట్లు నిఘా వర్గాలు పలుమార్లు హెచ్చరించాయి. బాసరకు అతి సమీపంలో గల నిజామాబాద్, భైంసా, మహారాష్ట్రలోని ధర్మాబాద్, నాందేడ్ పట్టణాల్లో ఉగ్రవాదుల మూలాలు వెలుగుచూస్తూనే ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో బాసరలో భద్రత పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వీధి వ్యాపారులకు అండ ఏది?

కేంద్రం ఆదేశించినా చర్యలు అంతంతే?.. సర్వే, ఐడీకార్డుతోనే సరిపెట్టిన సర్కారు



హైదరాబాద్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): చిరు వ్యాపారాలు చేసుకునే వారికి అండగా నిలవాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. అర్బన్ స్ట్రీట్ వెండర్ పాలసీని మూడేళ్ల క్రితమే తీసుకొచ్చింది. ఫుట్‌పాత్‌లు, తోపుడు బండ్లు, సైకిళ్లపై వస్తువులు విక్రయించే వారు, గంప నెత్తిన పెట్టుకుని విక్రయించే వారు.. ఇలా వీధుల్లో వ్యాపారం చేసుకునే వారిని గుర్తించి చేయూతనివ్వాలని అర్బన్ స్ట్రీట్ వెండర్ పాలసీలో కేంద్రం ఆదేశించింది. అయితే, రాష్ట్రంలో రెండు, మూడేళ్లుగా ఆ దిశగా చర్యలు చేపట్టిన దాఖలాల్లేవు. కూరగాయలు, పండ్లు, చిన్న వస్తువులు, నిత్యావసర వస్తువులు వంటివి వీధుల్లో విక్రయించే వారికి ఒకే చోట ఉండి వ్యాపారం చేసుకునేలా వసతి సౌకర్యాలు కల్పించాలని కేంద్రం ఆదేశించింది. వీరందరికీ గుర్తింపు కార్డులివ్వాలని సూచించింది. అంతే కాదు.. వ్యక్తులు, సంఘాలుగా ఏర్పడిన వారికి బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించాలని కూడా ఆదేశించింది. దీని కోసం వీధి వ్యాపారులు ఎందరున్నారో గుర్తించాలని సూచించింది. రాష్ట్రంలోనూ గతంలోనే సర్వే నిర్వహించారు. మునిసిపల్ అధికారుల సర్వే ప్రకారం గ్రేటర్ హైదరాబాద్ మినహా రాష్ట్రంలో 50 వేలకు పైగా వీధి వ్యాపారులు ఉంటారని అంచనా, గ్రేటర్ పరిధిలో 30 వేలకు పైగా ఉంటారని భావిస్తున్నారు. సర్వేలో 43,459 మందిని (గ్రేటర్ హైదరాబాద్ మినహా) గుర్తించిన ప్రభుత్వం 40 వేల మందికి జాబ్‌కార్డులు జారీ చేసింది. అయితే ఇప్పటివరకూ ప్రభుత్వం నుంచి సహాయ, సహకారాలు అందలేదని తెలుస్తోంది. అర్బన్ స్ట్రీట్ వెండర్ పాలసీలో సూచించిన చర్యలు రాష్ట్రంలోని ఏ పట్టణంలోనూ సమగ్రంగా అమలు కాలేదు. గ్రేటర్ హైదరాబాద్ సహా ఇతర పట్టణాల్లో వీధి వ్యాపారులకు ప్రత్యేక స్థలాలు కేటాయించాలన్న కేంద్రం సూచన అమలు కాలేదు. పలు చోట్ల కూరగాయల మార్కెట్లు, మాంసం మార్కెట్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నప్పటికీ వీధి వ్యాపారులకు పెద్దగా ఉపయోగపడవని అంటున్నారు.

స్థలాభావమే సమస్య...

పట్టణాల్లో వీధి వ్యాపారులంతా జనావాసాలకు దగ్గరలో లేదా కాలనీలు, ప్రధాన కూడళ్ల వద్ద వ్యాపారం చేసుకుంటారు. తోపుడు బళ్లు, సైకిళ్లు, గంపలు నెత్తిన ఎత్తుకుని వ్యాపారం చేసుకునే వారు కాలనీల్లో ఇంటింటికి వెళ్తారు. దూరంగా కేంద్రీకృతమైతే వ్యాపారులకూ, వినియోగదారులకూ ఇబ్బందిగా మారుతుంది. కూడళ్లు, జనావాసాలు ఉన్న ప్రాంతాల్లో కొంత స్థలాన్ని వీధి వ్యాపారులకు కేటాయిస్తే ఫలితం ఉంటుందంటున్నారు. అయితే అనేక మునిసిపాలిటీల్లో స్థలాభావమే సమస్యగా మారుతోందని చెబుతున్నారు.

పట్టణాల్లో గుర్తించిన వీధి వ్యాపారులు..

గ్రేటర్ వరంగల్-3014, ఖమ్మం-2221, నిజామాబాద్-2054, సూర్యాపేట-1581, కరీంనగర్-1566, నల్లగొండ-1181, మహబూబ్‌నగర్-1175, కోదాడ-1037, కామారెడ్డి-1014, ఆదిలాబాద్-1201, మిర్యాలగూడ-832, సిద్దిపేట-820.





రామాలయంలో భక్తుల సందడి

భద్రాచలం, ఆగస్టు 12: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. శనివారం రెండు తెలుగు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యంలో భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణం, పరిసరాల్లో కోలాహలం ఏర్పడింది. వేకువ జామునుంచే భక్తులు గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించారు. రామయ్య దర్శనం కోసం క్యూలైన్లల్లో బారీగా భక్తులు బారులుతీరారు. ఈ సందర్భంగా ఆలయంలో అర్చకులు సువర్ణ తులసిఅర్చన , సహస్రనామార్చన , నిత్యకల్యాణం, కేశవనామార్చన, తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. నిత్యకల్యాణంలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శనివారం, ఆదివారాలఉ సెలవులతో పాటు సోమవారం కృష్ణాష్టమి, ఆగస్టు 15 స్వాతంత్ర్య వేడుకల నేపథ్యంలో సెలవులు రావడంతో భక్తుల రద్దీ పెరిగింది. ఇదిలా ఉండగా రామయ్య దర్శనం అనంతరం వేలల్లో భక్తులు, పర్యాటకులు ఏపీలోని పాపికొండలు- పేరంటాలపల్లి, కొల్లూరు హట్స్ కు తరలివెళ్తున్నారు.

బీసీ పాలసీపై అన్ని రాజకీయ పార్టీలు స్పందించాలి

- జాజుల శ్రీనివాస్



వడ్డెపల్లి(వరంగల్అర్బన్) : బీసీ పాలసీపై అన్ని రాజకీయ పార్టీలు స్పందించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ అన్నారు. శనివారం హన్మకొండలో జరిగిన బీసీ సంక్షేమ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోని 60 కోట్ల మంది బీసీల ఆకాంక్షలను, అన్ని రాజకీయ పార్టీలు గుర్తించి బీసీలపై తమ విధాన ప్రకటనను ప్రకటించాలని, లేని పక్షంలో బీసీ వ్యతిరేక పార్టీలను గుర్తించి వచ్చే 2019 ఎన్నికలలో వాటిని ఓడిస్తామని అన్నారు. చట్టసభల్లో బీసీలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు, జాతీయ బీసీ కమిషన్‌కు రాజ్యాంగ బద్ధత కల్పించాలనే ప్రధాన డిమాండ్‌తో ఢిల్లీలో వందలాది మంది బీసీలతో నిర్వహించిన ఉద్యమ సెగ ఢిల్లీకి తగిలిందని, కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చి వచ్చే పార్లమెంట్ సమావేశాలలో బీసీ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదిస్తామని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత మంత్రులు తహర్ చంద్ గెహ్లాద్, బండారు దత్తాత్రేయ హామీ ఇచ్చారని తెలిపారు.



పాన్‌గల్‌లో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి

ఆరు నెలల్లో రైతన్నకు 24 గంటల విద్యుత్: జూపల్లి

పాన్‌గల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రాబోవు ఆరు మాసాల్లో రైతులకు 24 గంటల విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పారు. శనివారం వనపర్తి జిల్లా పాన్‌గల్‌లో మాట్లాడుతూ 70 ఏళ్లలో జరగని అభివృద్ధిని తెలంగాణ ప్రభుత్వం మూడేళ్లలోనే చేసిందన్నారు. రైతులకు సాగు, తాగునీటితో పాటు కోతలు లేని విద్యుత్‌ను అందిస్తున్నామన్నారు.

రైతు ఆత్మహత్య

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ జిల్లా సింగారం గ్రామ శివారు బిచ్చాతండాకు చెందిన రైతు బానోత్‌రంగా(42) శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పెట్టుబడుల కోసం 6 లక్షల మేర అప్పు కావడంతో తనకున్న రెండెకరాల్లో ఎకరం పొలాన్ని అమ్మేసి కొంత అప్పుతీర్చాడు. ఉన్న ఎకరంలో వ్యవసాయం చేయడానికి పెట్టుబడులకు అప్పుల కోసం వెళ్లగా ఎవ్వరూ ఇవ్వలేదు. దీంతో పురుగుల మందుతాగాడు.

అమరవీరుల స్ఫూర్తియాత్ర నేపథ్యంలో నిజామాబాద్‌లో 144, 151 సెక్షన్లు

- అఖిలపక్షం ఆధ్వర్యంలో ధర్నా
- కామారెడ్డి బంద్ విజయవంతం

నిజామాబాద్/కామారెడ్డి: జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం సభ సందర్భంగా శనివారం నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 144, 151 సెక్షన్లను విధించారు. సభలు, సమావేశాలకు అనుమతులు నిరాకరించారు. నగరంలో అమరుల స్ఫూర్తి యాత్రను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కోదండరాంను తూప్రాన్ వద్ద అరెస్టు చేయడంతో జిల్లా వ్యాప్తంగా నిరసనలు వ్యక్తమయ్యాయి. అఖిలపక్షాల ఆధ్వర్యంలో ర్యాలీలు, ధర్నాలు నిర్వహించారు. ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. వర్నిలో సుమారు 200 మంది జేఏసీ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రుద్రూరు, బోధన్‌లో కూడా జేఏసీ నాయకులు తమ నిరసనను వ్యక్తపరిచారు. ఆర్మూర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. శాంతియుతంగా నిర్వహించతలపెట్టిన యాత్రకు అనుమతినివ్వకపోవడాన్ని, కోదండరాం అరెస్టును జేఏసీ నేతలు ఖండించారు. నిరసన తెలిపే హక్కును కూడా ప్రభుత్వం హరించివేస్తోందని వారు ఆరోపించారు. పోలీసులు మాత్రం భారీ బందోబస్తును ఏర్పాటు చేరు. జేఏసీ చైర్మన్ కోదండరాం చేపట్టిన అమరవీరుల స్ఫూర్తియాత్రను అడ్డుకొని జేఏసీ, విద్యార్థి సంఘాల నాయకుల పై టీఆర్ఎస్ నాయకులు దాడులు చేసినందుకు నిరసనగా కామారెడ్డి జిల్లా బంద్‌కు జేఏసీ ఇచ్చిన పిలుపు శనివారం విజయవంతమైంది. బంద్‌లో పాల్గొన్న ప్రజాసంఘాల, జేఏసీ, కాంగ్రెస్ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు.





నిజామాబాద్ జిల్లా కేంద్రంలో అఖిలపక్ష నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

పాలనా వ్యవహారాల్లో.. తెలుగు ప్రాధాన్యం పెరగాలి

- రవ్వా శ్రీహరిది సామాన్యులకు చేరువయ్యే సాహిత్యం
- కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయ
- తెలంగాణ పదాలతో నిఘంటువు రావాలి
- ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె. శ్రీనివాస్
- లక్ష తెలంగాణ పదాలతో నిఘంటువు
- తెలుగు యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ఎస్‌వీ సత్యనారాయణ



ఆచార్య రవ్వా శ్రీహరిని సన్మానిస్తున్న కేంద్రమంత్రి దత్తాత్రేయ

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో తెలుగుభాషకు ప్రాధాన్యమివ్వాలని, పాలనా వ్యవహారాల్లో తెలుగు భాష వాడకం పెరగాలని కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయ అన్నారు. ఆచార్య రవ్వా శ్రీహరి పంచసప్తమి మహోత్సవం సందర్భంగా ఆయన సమగ్ర రచనలపై అభినందన సమితి ఆధ్వర్యంలో సమాలోచనల కార్యక్రమాన్ని తెలుగు యూనివర్సిటీలో శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ సామాన్యులకు చేరువయ్యే సాహిత్యాన్ని రవ్వా సృష్టించారని తెలిపారు. ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె. శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణలోని అన్ని పదాలు డిక్షనరీలో ఉండాలని, మనం వాడుతున్న పదం నిఘంటువులో దొరక్కపోతే ఆ పదానికి అర్థం లేదన్నారు. తెలంగాణ పదాలేవో తేల్చాలని, భాషకు సంబంధించి మౌలిక వ్యవస్థను నిర్మాణం చేయాల్సిన అవసరముందన్నారు. శ్రీహరి సంప్రదాయాన్ని అభిమానించడంతో పాటు జాతీయవాది కూడా అన్నారు. రవ్వా శ్రీహరి భాషపై శాస్త్రీయ దృక్పథం కలిగిన వారని ఇలాంటి వారు .. ఇప్పటికాలానికి అవసరమన్నారు. తెలుగు యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ఎస్‌వీ సత్యనారాయణ మాట్లాడుతూ లక్ష తెలంగాణ పదాలతో నిఘంటువు తీసుకురానున్నామని, అందులో రవ్వా శ్రీహరి పాత్ర కీలకంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు కోవెల సుప్రసన్నాచార్యులు, ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఆచార్య కె.యాదగిరి పాల్గొన్నారు.



చిన్నారిని కిటికీలోంచి బస్సులోకి ఎక్కిస్తున్న దృశ్యం

సెలవుల కష్టాలు

- జనం ఊరి బాట.. పెద్ద సంఖ్యలో పెళ్లిళ్లు
- బస్సులు, రైళ్లు కిటకిట
- శ్రీవారి దర్శనానికి 24 గంటలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

వరుసగా నాలుగు రోజులు సెలవులు.. ఆపై తెలుగు రాష్ట్రాల్లో వేల సంఖ్యలో వివాహాలు! నగరవాసులు సొంత ఊళ్లకు, వివాహ వేడుకలకు, పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రదేశాలకు పెద్ద సంఖ్యలో పయనమయ్యారు. దీంతో శనివారం తెల్లవారుజాము నుంచి బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు కిక్కిరిసిపోయాయి. బస్సులో.. రైలులో సీటు కోసం నానాపాట్లు పడ్డారు. ప్రైవేటు వాహనాలూ పెద్ద సంఖ్యలో నగరం నుంచి వెళ్లాయి. ఇదే అవకాశంగా ప్రైవేటు బస్సుల ఆపరేటర్లు చార్జీలు పెంచేశారు. ఆర్టీసీ సైతం అదనంగా నడుపుతున్న బస్సుల చార్జీలను 50 శాతం పెంచింది. తెలంగాణ జిల్లాలకు శుక్రవారం అర్ధరాత్రి నుంచి అదనంగా 200 బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఎంజీబీఎస్ నుంచి వెళ్లే ప్రయాణికుల సంఖ్య లక్ష దాటిందని వారు చెప్పారు. నల్లగొండ జిల్లా కొర్లపహాడ్ శివారులోని జీఎంఆర్ టోల్ ప్లాజా వద్ద 12 కౌంటర్లు ఉండగా, ఏడింటిని విజయవాడవైపు, అయిదింటిని హైదరాబాద్‌వైపు వెళ్లే వాహనాల కోసం కేటాయించారు. ఇక తిరుమల భక్తజన సంద్రమైంది. ఒక్క రోజే దాదాపు రెండు లక్షల మంది కొండ ఎక్కారు. శనివారం సాయంత్రానికి దాదాపు 85 వేల మంది శ్రీవారిని దర్శించుకున్నారు. మరో లక్ష మందికిపైగా స్వామి దర్శనం కోసం నిరీక్షిస్తున్నారు. సర్వదర్శనానికి 24 గంటలు పడుతోందని టీటీడీ అధికారులు ప్రకటించడంతో కొందరు భక్తులు స్వామి దర్శనం చేసుకోకుండానే వెనుదిరిగారు. కాగా కంచికచర్ల మండలం కీసర టోల్ ప్లాజా వద్ద రోజూ 5 వేల కార్లు వస్తాయి. శనివారం ఆ సంఖ్య 10 వేలు దాటడం విశేషం.



జూబ్లీ బస్ స్టేషన్ వద్ద బస్సులో సీటు దొరక్క ప్రయాణికుల కష్టాలు

నేడు, రేపు భారీ వర్ష సూచన

విశాఖపట్నం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రుతుపవనాల్లో కదలిక వచ్చింది. మూడు వారాల తర్వాత తెలుగు రాష్ట్రాల్లో మళ్లీ వర్షాలు జోరందుకున్నాయి. ఖరీఫ్‌పై ఆశలు వదులుకున్న తరుణంలో మూడు రోజుల నుంచి పలుచోట్ల కురుస్తున్న వర్షాలు పంటలకు జీవం పోశాయి. కోస్తా నుంచి రాయలసీమ, తమిళనాడు మీదుగా గల్ఫ్ ఆఫ్ మన్నార్ వరకు ద్రోణి కొనసాగుతోంది. దీంతో రాయలసీమలో రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావంతో రానున్న రెండ్రోజుల పాటు రెండు తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. కోస్తా, రాయలసీమలో ఎక్కువచోట్ల, తెలంగాణలో పలుచోట్ల వర్షాలు కురుస్తాయి. కోస్తాలో అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయి. కాగా, వారం రోజుల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని ఇస్రో అంచనా వేసింది. దీంతో వచ్చే వారంలో వర్షాలు మరింత జోరందుకోనున్నాయని తెలిపింది.

అంతర్రాష్ట్ర బెట్టింగ్ రాయుళ్ల అరెస్ట్

- తెలంగాణ గేమింగ్ యాక్ట్‌లో తొలి కేసు

గద్వాల క్రైం: తెలంగాణ గేమింగ్ యాక్ట్ అమల్లోకి వచ్చిన తర్వాత తొలి కేసు నమోదయ్యింది. గద్వాల జిల్లాలో అంతర్రాష్ట్ర క్రికెట్ బెట్టింగ్ రాయుళ్లను పోలీసులు చేశారు. వారి నుంచి నగదు, సెల్‌ఫోన్లు, సిమ్‌కార్డులు, ఇన్నోవా కారును స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ బాలకోటి శనివారం మీడియాకు చెప్పారు. పట్టణంలోని ఒక అపార్ట్‌మెంట్‌లో శుక్రవారం అయిజకు చెందిన రాఘవాచారి, శ్రీనివాసచారితోపాటు ప్రొద్దుటూరుకు చెందిన రఫీ, శేఖ్‌నూర్ మహమ్మద్‌లు కలిసి గద్వాల జగదీష్ ఇంట్లో క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. దాడులు నిర్వహించి నలుగురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. రూ.11వేలు, 26 సెల్‌ఫోన్లు, 50 సిమ్‌కార్డులను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. దీని ద్వారా రూ.2 కోట్లు ఆన్‌లైన్‌లో ఆడినట్లు వారి అకౌంటు ద్వారా తెలిసిందన్నారు. ఇందులో అయిజకు చెందిన రాఘవాచారి అయిజ మండలం ఉప్పలలో 18 ఎకరాల పొలాన్ని రూ. 1.40 కోట్లకు కొనుగోలు చేశాడని ఆ పొలాన్ని కూడా స్వాధీనం చేసుకుంటున్నట్లు తెలిపారు. వీరికి గద్వాలలో 9 మంది, కర్నూలులో ఇద్దరు, రాయిచూర్‌లో ముగ్గురు, అయిజలో ఐదుగురు, వనపర్తిలో ముగ్గురు, కడపలో ముగ్గురు ఏజెంట్లు ఉన్నారన్నారు. వారిలో కూడా కొందరిని అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నామని తెలిపారు.

| ర్టీసీలో కొత్తగా టీజేఎంయూ ఏర్పాటు

హైదరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): టీఎస్‌ఆర్టీసీలో మరో కార్మిక యూనియన్ ఏర్పాటైంది. సంస్థలోని కొంత మంది నేతలు కలిసి 'తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్(టీజేఎంయూ)' పేరిట దీనిని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం సంస్థలో గుర్తింపు పొందిన తెలంగాణ మజ్దూర్ యూనియన్(టీఎంయూ) నుంచి బయటకు వచ్చిన నేతలే దీనిని ఏర్పాటు చేయడం గమనార్హం. ఈమేరకు రాష్ట్ర స్థాయి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. టీజేఎంయూ రాష్ట్ర అధ్యక్షుడిగా టి.సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా కె.హన్మంతు ముదిరాజ్, సలహాదారులుగా స్వామి, సురేందర్, ప్రభాకర్, కె.కృష్ణ, ఉపాధ్యక్షులుగా డీవీకే రావు, ఎంఆర్‌కే రెడ్డి, అలంకార్, కోశాధికారిగా పీఎస్ఎస్ రావు, పబ్లిసిటీ సెక్రటరీగా ఎండీ నసీర్ అహ్మద్, మరో ఐదుగురు జాయింట్ సెక్రటరీలు, ఏడుగురు అసిస్టెంట్ సెక్రటరీలు, 13 మంది ఆర్గనైజింగ్ సెక్రటరీలను ఎన్నుకున్నారు. హైదరాబాద్ జోనల్ కమిటీతో పాటు హైదరాబాద్, వరంగల్, ఆదిలాబాద్, నల్లగొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డిల రీజినల్ కమిటీలను కూడా ఎన్నుకున్నారు. మిగతా రీజినల్ కమిటీలకు తాత్కాలిక ప్రాతిపదికన ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని 96 ఆర్టీసీ డిపోలలో తాత్కాలిక డిపో కమిటీలను కూడా ఏర్పాటు చేసినట్లు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తెలిపారు.

'హరిత మిత్ర' అవార్డుల ప్రకటన

- రాష్ట్ర స్థాయిలో ఐదు... జిల్లా స్థాయిలో 50

హైదరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణకు హరిత హారం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం తరపున అందజేసే హరిత మిత్ర అవార్డులను ప్రకటించారు. పచ్చదనం కోసం పాటుపడినందుకు గాను అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, ప్రభుత్వ-ప్రైవేటు సంస్థల వారికి తెలంగాణ అటవీ శాఖ ఈ అవార్డులను ప్రకటించింది. ఐదుగురికి రాష్ట్ర స్థాయి అవార్డులు ఇవ్వగా, 50 మందికి జిల్లా స్థాయి అవార్డులు ప్రకటించారు. రాష్ట్ర స్థాయి అవార్డు గ్రహీతల్లో అధికారుల కేటగిరి నుంచి వై.శేఖర్‌రెడ్డి(వరంగల్ రూరల్), ప్రజాప్రతినిధుల కేటగిరి నుంచి పెద్ది సుదర్శన్‌రెడ్డి(వరంగల్ రూరల్), అటవీ అధికారుల విభాగంలో డీఎఫ్ఓ సి.శ్రీధర్ రావు(సిద్దిపేట), ప్రభుత్వ విభాగంలో జగిత్యాల జిల్లా మురపల్లి మండల ప్రజా పరిషత్ పాఠశాల, సంస్థల విభాగంలో పెద్దపల్లి జిల్లాలోని రామగుండం-1 అటవీ విభాగంను ఎంపిక చేశారు. అలాగే, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, కల్యాణలక్ష్మి-షాదీ ముబారక్, ఆరోగ్యలక్ష్మి పథకాల అమలులో ప్రతిభ చాటిన వారికి ఎక్సలెన్స్ అవార్డులను ప్రకటిస్తూ శనివారం రాత్రి జీవో నంబర్ 1746ను ప్రభుత్వం విడుదల చేసింది. వీరందరికీ స్వాతంత్ర దినోత్సవం రోజున ఈ అవార్డులను అందించనున్నారు.

లాయర్లకు | రోగ్య బీమా: సంక్షేమ ట్రస్ట్

హైదరాబాద్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): న్యాయవాదుల సంక్షేమం కోసం తెలంగాణ అడ్వొకేట్స్ ట్రస్ట్ అనేక తీర్మానాలు చేసినట్లు రాష్ట్ర న్యాయశాఖ సంయుక్త కార్యదర్శి రామాంజనేయులు శనివారం తెలిపారు. కొత్తగా న్యాయవాద వృత్తిలోకి వస్తున్న వారిలో వృత్తినైపుణ్యాన్ని పెంచేందుకు ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించాలని, అలాగే జూనియర్ న్యాయవాదులకు వారి ఆర్థిక పరిస్థితిని బట్టి స్టయిపెండ్ ఇచ్చి ఆర్థికంగా ఆదుకోవాలని, ఆరోగ్య, ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించాలని నిర్ణయించామని అన్నారు. అన్ని కోర్టుల్లో లైబ్రరీఏర్పాటుకు నిధులు కేటాయించాలని, సచివాలయంలో ట్రస్ట్‌కు కార్యాలయం కోసం గదిని కేటాయించాలని, ట్రస్ట్‌కు మరో రూ.100 కోట్లు అదనంగా కేటాయించాలని నిర్ణయించామని చెప్పారు.

ఏం ఒరగబెట్టారని..?

- టీఎస్‌పీఎస్సీ సభ్యుల వేతనం పెంపుపై రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): టీఎస్‌పీఎస్సీ సభ్యులు ఏం ఒరగబెట్టారని వారి వేతనాలను భారీగా పెంచారని ప్రభుత్వాన్ని టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్ రెడ్డి నిలదీశారు. వరుస వైఫల్యాలతో రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠను దిగజారుస్తున్న టీఎస్‌పీఎస్సీ సభ్యుల వేతనాలను మూడు రెట్లు పెంచడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. "మూడేళ్లలో టీఎస్‌పీఎస్సీ అవగాహన రాహిత్యంతో జారీ చేసిన నోటిఫికేషన్లు, నియామకాలు వివాదాస్పదమయ్యాయి. గ్రూప్-2 పరీక్షలో వైట్నర్ వాడిన వివాదంతో పాటు కొన్ని ప్రశ్నలు తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కానిస్టేబుల్ ఉద్యోగాల్లో అవకతవకలు జరిగాయి. ఎస్ఐ పరీక్ష ఫలితాలు 19 నెలలు గడచినా ప్రకటించ లేదు. గురుకుల నోటిఫికేషన్‌లోనూ వివాదం తలెత్తింది." అని రేవంత్ ఆరోపించారు. టీఎస్‌పీఎస్సీ సభ్యుల వేతనాలు పెంచినట్లే హోంగార్డులు, అటవీ ఉద్యోగులు, ఇతర కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు పెంచి జనవరి 1 నుంచే అమల్లోకి వచ్చేలా ఉత్తర్వులు జారీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాగా, టీఆర్ఎస్ నేతలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు-వాటి అమలుపై శ్వేతపత్రం విడుదల చేయాలని టీడీపీ-టీఎస్ నేతలు అమర్‌నాథ్‌బాబు, సాయిబాబా డిమాండ్ చేశారు. టీజేఏసీ చైర్మన్ కోదండరాం అరెస్టును ఖండిస్తున్నామని, అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని పేర్కొన్నారు. కాగా, దళితులు తమ కష్టాలు చెప్పుకునేందుకు ప్రభుత్వం వెంటనే ఎస్సీ కమిషన్ ఏర్పాటు చేయాలంటూ సీఎం కేసీఆర్‌కు టీడీపీ-టీఎస్ నేతలు మేడిపల్లి సత్యం బహిరంగ లేఖ రాశారు.



ఎంచక్కా.. మొక్క మొక్కకూ నీటి చుక్క!

ఆదిలాబాద్ జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్నప్పటికీ.. మొక్కలు ఎండిపోకుండా వాటిని కాపాడడానికి నానా రకాలుగా ప్రయత్నిస్తున్నారు. మనసుంటే మార్గం ఉండకపోదన్నట్టుగా.. జిల్లా కేంద్రంలోని జడ్పీ చైర్‌పర్సన్ క్యాంప్ కార్యాలయం ఆవరణలో నాటిన మొక్కలను బతికించుకోవడానికి సిబ్బంది వినూత్నంగా ఆలోచించి ఆచరణలో పెడుతున్నారు. ఒక్కో మొక్క దగ్గర.. ఒక్కో నీళ్ల బాటిల్‌ను పెట్టి.. నీటిని అందిస్తున్నారు. రోజూ ఉదయం బాటిళ్లలో నీటిని నింపితే రాత్రి వరకు మొక్కలకు సరిపడ అందుతున్నాయని చెబుతున్నారు.

-| దిలాబాద్, | ంధ్రజ్యోతి

తిండిపై | ంక్షలు ప్రకృతి విరుద్ధం

- భావ విప్లవం రావాలి: గద్దర్
- అక్బరుద్దీన్ ఓవైసీతో భేటీ

హైదరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : 'ప్రతి జీవి ఆకలి తీర్చే తిండిపై ఆంక్షలు విధించడం ప్రకృతి విరుద్ధమ'ని ప్రజాగాయకుడు, మహాజన సమాజం గౌరవాధ్యక్షుడు గద్దర్ అన్నారు. భాష, తిండి, దుస్తులు, ఆచారవ్యవహారాలు, తదితర జీవన సంబంధ విషయాల్లో ఇతరుల ప్రమేయం, ఒత్తిడి పెరిగిపోతున్నాయన్నారు. తెలంగాణలో ఫ్యూడల్ విధానాలు కొనసాగుతున్నాయని, భావవిప్లవం రావాల్సిన అవసరం ఉందన్నారు. శనివారం దారుస్సలాంలోని



ఎంఐఎం ప్రధాన కార్యాలయంలో ఆ పార్టీ కీలక నేత, ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీతో గద్దర్ భేటీ అయ్యారు. భావవిప్లవ వ్యాప్తి కోసం తాను చేపట్టిన 'పల్లెపల్లెకు పాట.. పార్లమెంటుకు బాట'లో భాగంగా తాను ఎంఐఎం నేతలతో చర్చించేందుకు అక్కడికి వెళ్లానని 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు.

| ధార్‌తో | టకట్టు!

- నేరాలను నియంత్రించేందుకు పోలీసుల చర్యలు
- నిందితుల వివరాలు | ధార్‌తో అనుసంధానం
- ఎఫ్ఐ| ర్ నుంచి రిమాండ్ దాకా | ధార్ నెంబరు
- | ధార్‌లేని వారికి జైల్లోనే ఇప్పిస్తున్న అధికారులు
- విడుదలైతే.. నిఘా నుంచి తప్పించుకోకుండా చెక్



హైదరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రతి వ్యక్తికీ ప్రభుత్వం తప్పనిసరి చేసిన ఆధార్‌తో పోలీసులు నేరాలను నియంత్రించేందుకు, నేరగాళ్ల ఆట కట్టించేందుకు సిద్ధమయ్యారు. నేరగాళ్లెవరైనా ఇకపై ఒక్కసారి తమ చేతికి చిక్కారంటే.. కేసు క్లోజ్ అయ్యేంతవరకు తప్పించుకునే అవకాశం లేకుండా ఆధార్‌తో ఫిక్స్ చేయనున్నారు. ఫిర్యాదు అందిన వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు నుంచి నిందితుణ్ని జైలుకు పంపే సమయంలో రిమాండ్ రిపోర్టు దాకా ప్రతి దశలో ఆధార్ నంబర్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇలా చేయడం వల్ల.. నిందితులెవరైనా బెయిల్‌పై విడుదలైతే.. తర్వాత వారు తమ నిఘా నుంచి తప్పించుకునేందుకు వీలుండదని పోలీసుల ఆలోచన. ఆధార్‌లో ఎప్పటికీ చెరిగిపోని ఐరిష్, చేతుల వేలిముద్రలతోపాటు శాశ్వత చిరునామా ఉంటుంది. దీంతో ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తి స్థానికంగా ఏదైనా కేసులో అభియోగాలు ఎదుర్కొంటే బెయిల్‌పై విడుదలైన తర్వాత పోలీసుల నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించినా.. ఆధార్‌లో ఉన్న శాశ్వత చిరునామా ద్వారా అక్కడికి వెళ్లి పట్టుకునేందుకు అవకాశం ఉటుంది. నిందితుడు అక్కడ కూడా లేకుండా మరెక్కడికైనా పారిపోయినా ఎక్కడో ఒకచోట, ఏదో ఒక అవసరానికి ఆధార్ ఉపయోగించక తప్పని పరిస్థితి ఉంటుంది. దీంతో నిందితుడు ఎక్కడ ఉన్నాడనే విషయం పోలీసులకు ఇట్టే తెలిసిపోతుంది. కేసు పెట్టే సమయంలో ఆధార్ నంబర్ తప్పనిసరిగా నమోదు చేయాలని అన్ని పోలీస్ స్టేషన్లకు ఉన్నతాధికారుల నుంచి ఇదివరకే ఆదేశాలు జారీ అయ్యాయి. ఇక పాత కేసులకు సంబంధించి కూడా నిందితుల ఆధార్ నెంబరును జత చేస్తున్నారు. ఒకవేళ నిందితుడు ఇప్పటివరకు ఆధార్ తీసుకోపోతే జైల్లో అధికారులే ఆధార్ నమోదు చేయించే కార్యక్రమం చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జైళ్లల్లో ఆధార్‌లేని నిందితులు, ఖైదీలకు ప్రతినెలా ప్రత్యేకంగా క్యాంపు నిర్వహించి ఆధార్ ఇప్పిస్తున్నారు.

| ధార్‌కు వేలిముద్రల అనుసంధానం..

కీలక కేసుల్లో నిందితులు, రిపీటెడ్ అఫెండర్స్ వేలిముద్రల్ని కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు సేకరిస్తుంటారు. వీటిని ప్రత్యేక టెక్నాలజీ ద్వారా ఆధార్‌కు అనుసంధానం చేస్తారు. కొన్ని సందర్భాల్లో ఏదైనా ఘటన జరిగితే అక్కడ సేకరించే వేలిముద్రల నమూనాల్ని ఆధార్‌కు జతచేయడం వల్ల నిందితుడు ఎవరనేది పోలీసులకు వెంటనే తెలిసిపోతుంది. ఒక్కసారి పోలీసులకు చిక్కితే ఇక ఎప్పటికీ వారి ఫైల్‌లోనే ఉండాల్సి వస్తుందనే భయంతో కూడా తప్పు చేసేందుకు భయపడే పరిస్థితిని కల్పించనున్నారు. కాగా, "జైలుకు వచ్చే నిందితుల ఆధార్ నమోదు తప్పనిసరి చేశాం. ఎవరికైనా ఆధార్ లేకపోతే ప్రత్యేకంగా నిర్వహిస్తున్న క్యాంపులో ఇప్పిస్తున్నాం. ములాఖత్‌కు వచ్చే వారి నుంచి కూడా ఆధార్ వివరాలు తీసుకుంటున్నాం. ఆధార్ తీసుకోకపోతే వారివద్ద ఇతర ప్రభుత్వ గుర్తింపు కార్డు వివరాల్ని నమోదు చేసుకుంటున్నాం." అని చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్ సైదయ్య తెలిపారు.



బీజేపీ | ధ్వర్యంలో తిరంగా యాత్ర

ఖైరతాబాద్/హైదరాబాద్: గ్రేటర్ బీజేపీ ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్ పీపుల్స్‌ప్లాజా పార్కింగ్ స్థలం నుంచి ఐమాక్స్ వరకు, తిరిగి పీపుల్స్‌ప్లాజా వరకు శనివారం తిరంగా యాత్ర నిర్వహించారు. కార్యక్రమానికి కేంద్రమంత్రి బండారు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్, బీజేఎల్పీ నేత కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు చింతల, బాబూమోహన్ (సినీనటులు), ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, బీజేపీ సీనియర్ నేత బద్దం బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోదండరాం మళ్లీ అరెస్టు

- నిజామాబాద్‌కు వెళ్తుండగా తూప్రాన్‌లో అదుపులోకి
- కోదండరాం వాహనం ఢీకొని డీఎస్పీకి గాయాలు
- టెర్రరిస్టుల్ని చూసినట్లు చూస్తున్నారు: కోదండ



తూప్రాన్/హైదరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): టీజేఏసీ చైర్మన్ కోదండరాంను పోలీసులు మళ్లీ అరెస్టు చేశారు. శనివారం నిజామాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన అమరుల స్ఫూర్తి యాత్ర సమావేశానికి వెళ్తుండగా మెదక్ జిల్లా తూప్రాన్ మండలం అల్లాపూర్ శివారులోని టోల్ ప్లాజా వద్ద ఆయనను అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం కామారెడ్డిలో ఘర్షణ చోటుచేసుకోవడం, శనివారం కోదండరాం నిజామాబాద్ పర్యటన నేపథ్యంలో తూప్రాన్‌లో శుక్రవారం అర్ధరాత్రి నుంచే 144 సెక్షన్‌ను విధించారు. హైవే 44పై ఏర్పాటు చేసిన టోల్‌ప్లాజా వద్ద జిల్లా ఏఎస్పీ రాంచంద్రారెడ్డి ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే మెదక్ జిల్లాతోపాటు, కామారెడ్డి, నిజామాబాద్ పోలీసులను తూప్రాన్‌లో భారీగా మోహరించారు. కోదండరాం అక్కడికి చేరుకోగానే ఆయన వాహనాన్ని భారీగా పోలీసులు చుట్టుముట్టారు. దీంతో ఆయన వెంట ఉన్న టీజేఏసీ నాయకులు ఆందోళనకు దిగగా.. వారిని అరెస్టు చేసి బలవంతంగా వాహనాల్లోకి ఎక్కించారు. కోదండరాంను అరెస్టు చేసి నర్సాపూర్ మీదుగా కౌడిపల్లి పోలీసుస్టేషన్‌కు తరలించారు. రెండు గంటలపాటు స్టేషన్‌లో ఉంచి సాయంత్రం 4.15 గంటలకు హైదరాబాద్‌కు తరలించారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున కోదండ రాం తో పాటు మరో 29 మంది టీజేఏసీ నాయకులపై 151 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. కాగా టోల్‌ప్లాజా వద్ద కోదండరాం ప్రయాణిస్తున్న వాహనం ఢీకొని మెదక్ డీఎస్పీ నాగరాజు గాయపడ్డారు. దీంతో వాహన డ్రైవర్ రతన్‌రావుపైనా కేసు నమోదు చేశారు. కాగా తమ యాత్రను అడ్డుకునేందుకు టెర్రరిస్టుల కోసం కూడా మోహరించనంత బలగాలను మోహరించారని కోదండరాం ఆరోపించారు. తూప్రాన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. నిజామాబాద్‌లో సభకు అనుమతి రద్దు చేయడంతో హాల్ మీటింగ్ పెట్టుకుంటామని చెప్పినా వినలేదని తెలిపారు. అమరుల ఆకాంక్షలను సాధించేందుకు టీజేఏసీ పనిచేస్తోందని, వాచ్‌డాగ్‌లా ఉంటోందని స్ఫూర్తియాత్రకు బయలుదేరే ముందు కోదండరాం హైదరాబాద్‌లో అన్నారు. ఆయన వెంట జేఏసీ నేతలు భైరి రమేశ్, రతన్‌రావు, రఘు, రమేశ్ ముదిరాజ్, ధర్మార్జున్, కరుణాకర్‌రెడ్డి, జయవీర్ తదితరులు ఉన్నారు.


కేంద్రంపై టీఆర్ఎస్ గోబెల్స్ ప్రచారం

- జీఎస్టీపై సీఎం కేసీ| ర్ | రోపణలు అర్ధరహితం
- కేంద్రం ప్రాజెక్టులిచ్చినా స్థలం ఇవ్వని రాష్ట్రం: లక్ష్మణ్
- సెప్టెంబర్ 17న సభకు కేంద్ర హోంమంత్రి హాజరు

హైదరాబాద్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రాభివృద్ధికి కేంద్రం ఎన్ని ప్రాజెక్టులు కేటాయిస్తున్నా ఏం ఇవ్వడం లేదంటూ టీఆర్ఎస్ ప్రభుత్వ పెద్దలు గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ విమర్శించారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. జీఎస్టీతో రాష్ట్రంపై రూ.19 వేల కోట్ల భారం పడుతుందన్న సీఎం కేసీఆర్ ఆరోపణలు అర్ధరహితమన్నారు. కాకిలెక్కలు చెప్పి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. కేంద్రం మంజూరు చేసిన ప్రాజెక్టుల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం స్థలం కేటాయించడం లేదని ఆరోపించారు. కాజీపేట రైల్వే వర్క్‌షాప్ ఏర్పాటుకు దేవాదాయ శాఖ భూమిని కేటాయించారని, అది కూడా కోర్టులో కేసు ఉన్న స్థలం అన్నారు. రాష్ట్ర బీజేపీ నేతల ఢిల్లీ పర్యటన సందర్భంగా తెలంగాణ ప్రాజెక్టులు, అవసరాలను కేంద్రమంత్రులకు వివరించామన్నారు. దేశవ్యాప్తంగా రైతులకు మేలు జరుగుతున్న ప్రధాని ఫసల్ బీమా యోజనను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర పథకాలను నీరుగారుస్తూ కేంద్రంపైనే ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఎంఎంటీఎస్ రెండో దశ, సికింద్రాబాద్ స్టేషన్ అభివృద్ధి, చర్లపల్లి, పటాన్‌చెరులో టెర్మినల్స్ నిర్మాణానికి కేంద్రం నిధులు మంజూరు చేసినా రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులు జమ చేయడం లేదన్నారు. ఎంఎంటీఎస్ రెండో దశ రాయగిరి వరకు రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.400 కోట్లు జమచేయాల్సి ఉండగా రూ.56 కోట్లు మాత్రమే జమ చేసిందన్నారు. హైదరాబాద్‌లో కనీసం గతుకులు లేని రోడ్లు నిర్మించాలని సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లకు హితవు చెప్పారు. సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినంగా నిర్వహించాలన్న డిమాండ్‌తో హైదరాబాద్‌లో బీజేపీ నిర్వహించే బహిరంగ సభకు కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, సహాయ మంత్రి హన్స్‌రాజ్ అహిర్ హాజరవుతారన్నారు. ఎస్సై మెయిన్స్ పరీక్ష ఫలితాలు వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు.

కోదండను అడ్డుకుంటే వాస్తవం దాగదు

- ఇసుక మాఫియాలో కేసీ| ర్ కుటుంబం: జీవన్‌రెడ్డి
- నాడు పట్టించుకోలేదు.. నేడు అంతా తనేనంటున్నాడు: మర్రి
- విద్యార్థులపై టీ| ర్ఎస్ దాడులా?: షబ్బీర్, మల్లు రవి



జగిత్యాల/హైదరాబాద్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): కోదండరాం చేపట్టిన అమరుల స్ఫూర్తి యాత్రను ప్రభుత్వం అడ్డుకోవడం సరి కాదని సీఎల్పీ ఉపనేత టీ జీవన్‌రెడ్డి అన్నారు. జగిత్యాలలో శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. కోదండరాంను అడ్డుకున్నా వాస్తవాలు కనుమరుగు కావన్నారు. పోలీసుల దమనకాండతో బడుగు, బలహీన వర్గాలు, దళితులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిరిసిల్ల, జిల్లెళ్ల మధ్య జరుగుతున్న పోలీసుల దమనకాండకు, ఇసుక అక్రమ రవాణాకు బాధ్యులెవరని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబ సభ్యుల పర్యవేక్షణలో ఇసుక అక్రమ రవాణా జరుగుతోందని, భాగస్వాములు ఎవరో డాక్యుమెంట్లే చెబుతున్నాయన్నారు. ఓవర్ లోడ్‌తో ఒకే నంబర్‌పై 6 ఇసుక లారీలు నడపడాన్ని మాఫియా కాక ఇంకేమంటారని ప్రశ్నించారు. జిల్లెళ్ల ఘటనలో ఎస్పీపై చర్యలు తీసుకోవాలన్నారు. కాగా, సాగునీటి ప్రాజెక్టులపై దివంగత రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ టి.హనుమంతరావు జాగ్రత్తలు చెప్పినా పట్టించుకోని సీఎం కేసీఆర్ శ్రీరాంసాగర్ పునరుద్ధరణ తన ఆలోచనే అనడం సిగ్గు చేటని మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి హైదరాబాద్‌లో అన్నారు. శ్రీరాంసాగర్‌కు నీటిని లిఫ్ట్ చేసేందుకు ఎంత కాలం పడుతుందో చెప్పాలని, ఎన్ని టీఎంసీల నీరు వస్తుందో తెలపాలన్నారు. కాగా, కామారెడ్డిలో కోదండరాం అన్ని అనుమతులు తీసుకొని సభ నిర్వహించాలనుకుంటే టీఆర్ఎస్ వాళ్లు అడ్డుకోవడాన్ని ఖండిస్తున్నామని మండలిలో విపక్షనేత షబ్బీర్ అలీ అన్నారు. ఇంటర్ విద్యార్థులపైనా దాడి చేయడం దారుణమన్నారు. ఉద్యమకాలంలో కోదండరాం టీఆర్ఎస్‌తోనే కలిసి పనిచేసిన విషయాన్ని మర్చిపోయారా? అని టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి ప్రశ్నించారు.

19, 20 తేదీల్లో భజరంగ్‌దళ్ జాతీయ కార్యవర్గ సమావేశాలు



రామరాజు

పంజాగుట్ట/హైదరాబాద్ : కాచిగూడలోని ఘన్‌శ్యామ్ భవన్ (గుజరాతీ ప్రగతి భవన్)లో ఈ నెల 19, 20వ తేదీల్లో అఖిల భారతీయ భజరంగ్‌దళ్ జాతీయ కార్యవర్గ సమావేశాలు నిర్వహించనున్నట్లు విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) రాష్ట్ర అధ్యక్షుడు రామరాజు, భజరంగ్‌దళ్ రాష్ట్ర అధ్యక్షుడు భాను ప్రకాష్ తెలిపారు. సోమాజిగూడలోని హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్యవర్గ సమావేశానికి విశ్వహిందూ పరిషత్ అంతర్జాతీయ కార్య నిర్వహాక అధ్యక్షుడు ప్రవీణ్ తొగాడియా, వీహెచ్‌పీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, సంయుక్త కార్యదర్శి సురేంద్ర జైన్, భజరంగ్‌దళ్ జాతీయ కన్వీనర్ మనోజ్ వర్మ, కో కన్వీనర్ సోనాల్ జీతో పాటు వివిధ రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొంటారని వివరించారు. 20వ తేదీ సాయంత్రం కాచిగూడలోని మున్నూరు కాపు భవన్‌లో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో భజరంగ్‌దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుభాష్ చందర్, వీహెచ్‌పీ రాష్ట్ర సహ ప్రచార ప్రముఖ్ పి.బాలస్వామి పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
navya@andhrajyothy.com



పద్దెనిమిదేళ్లలో ఆయన తీసింది ఎనిమిది సినిమాలే. సినిమా తీశామా, విడుదల చేశామా?.. అనేది ఆయనకు ముఖ్యం కాదు. సినిమా అంటే ఆయనకు జీవితం. సినిమా అంటే ఒక ప్రసవ వేదన, ఒక తపన. అందుకే ఒక్కో సినిమాకు రెండేళ్లో, అంతకంటే ఎక్కువో.. సమయం తీసుకుంటూ వచ్చారు శేఖర్ కమ్ముల. ఇవాళ తెలుగు రాష్ట్రాల్లోని వాళ్లే కాదు, అమెరికాలోని తెలుగువాళ్లు సైతం ఆయన సినిమాకు 'ఫిదా' అయిపోయారు. ఇంతటి ఆనందకర క్షణాల్లోనూ తనదైన నిరాండబర ధోరణిలో.. హైదరాబాద్‌లోని ఒక కాఫీ హోటల్‌లో కూర్చొని 'నవ్య'తో ప్రత్యేకంగా సంభాషించారు శేఖర్. ఆ విశేషాలు...

నేను చూసే ప్రపంచం వేరు!

'శేఖర్ కమ్ముల ఈజ్ బ్యాక్' అంటుంటే ఎలా అనిపిస్తోంది?

మన సినిమాను ఎక్కువ మంది చూస్తున్నారంటే, ఆదరిస్తున్నారంటే ఆనందంగా అనిపిస్తుంది. ఇది ఒక యుఫోరియా (ఉల్లాస స్థితి). హిట్టవడం మామూలే. కానీ ప్రేక్షకులు మళ్లీ మళ్లీ చూడటమనేది అరుదు. 'టాక్ ఆఫ్ ద టౌన్'లా ప్రేక్షకులు మళ్లీ మళ్లీ 'ఫిదా'ను చూస్తున్నారు. స్పాంటేనియస్ హిట్ అంటారే.. అది ఈ సినిమాకు జరిగింది. నాకు తెలిసినంత వరకు 'ఫిదా'ను రెండోసారి చూడని వాళ్లు లేరు. అందుకే సినిమా వేరే రేంజ్‌కు వెళ్లింది.

ఏ ఉద్దేశంతో ఈ కథ రాశారు?

బేసిగ్గా అమెరికాను చూపిద్దామనుకున్నా. అక్కడి వాతావరణాన్ని మన సినిమాల్లో సరిగ్గా చూపించలేదనే ఉద్దేశంతో కథ మొదలుపెట్టా. తర్వాత ఒక పల్లెటూరును చూపిద్దామని తెలంగాణ పల్లెను ఎంచుకున్నా. కథలో ఎప్పుడూ రాజకుమారుడు వచ్చి అమ్మాయిని తీసుకొని తనతో తీసుకోవడమే కనిపిస్తుంది కానీ, ఆ రాజకుమారుడు అమ్మాయితోనే ఎందుకు ఉండిపోడని తండ్రికి భానుమతి వేసే ప్రశ్న ఈ సినిమాకు ట్రిగ్గర్ పాయింట్. దాన్ని డ్రమటిక్‌గా కాకుండా అందరికీ నచ్చేలా చెప్పాం. అమెరికా అబ్బాయి క్లైమాక్స్‌లో ఇక్కడే ఉండిపోవాలని నిర్ణయించుకోవడానికి ప్రేక్షకుల అంగీకారం లభించింది. పల్లె నుంచి హైదరాబాద్‌కో, అమెరికాకో వెళ్లాల్సిన అవసరం లేదు, మన ఊళ్లోనే జీవనాధారాన్ని నిర్మించుకోవచ్చునని చెప్పాను.

'ఫిదా' విడుదలయ్యాక వచ్చిన స్పందన ఎలా అనిపించింది?

తెలంగాణ ప్రాంత నేపథ్యం, అక్కడి భాషతో సినిమా తీశాను కాబట్టి తెలంగాణలో మంచి స్పందన వస్తుందని ఊహించాను కానీ ఆంధ్ర, రాయలసీమ ప్రాంతంలోనూ ఈ రకమైన స్పందన వస్తుందని అనుకోలేదు. తెలంగాణ యాసను పెట్టడం వల్ల ఎలా ఉంటుందోననే భయం వేయలేదు కానీ ఇక్కడ బాగా చూస్తారు.. అక్కడ మామూలుగా చూస్తారనుకున్నా. భావోద్వేగాలనేవి ఎక్కడైనా ఒకటే కదా! నేననుకోవడం.. కథ అక్కడ కూడా బాగా ఎక్కేసింది. అప్పగింతల సన్నివేశాల్లో ఏడ్చామని చాలా మంది అమ్మాయిలు చెప్పారు. తొలిసారి వేరే వేరే పెట్టెలు సర్దుకుంటున్నామని అక్కాచెల్లెళ్లు మాట్లాడుకొనే సన్నివేశానికి దేశంలోని ఏ రాష్ట్రంలోని వాళ్లైనా కనెక్టయిపోతారు. అలాగే తండ్రికి కూతురు టాబ్లెట్ ఇచ్చే సన్నివేశం కూడా! బేసిగ్గా నా రాతలో పంచ్ ఉంటుంది. తెలంగాణ యాసలో రాస్తున్నప్పుడు నాకే తెలిసిపోయింది.. అది వర్కవుట్ అవుతుందని.

సాయిపల్లవిని తెలంగాణ అమ్మాయి భానుమతిగా ఎలా మార్చగలిగారు?

వాయిస్ బాగుంటే డబ్బింగ్ చెప్పించడం మామూలుగా జరిగేదే. డబ్బింగ్ విషయం పక్కన పెడితే యాక్టింగ్‌లో ఆమె పెర్‌ఫెక్ట్. భానుమతి ఎలా ప్రవర్తిస్తుందో అర్థం చేసుకొని అలా చేసేసింది. పొల్లు పోకుండా డబ్బింగ్ చెప్పి, ఆ పాత్రకు వన్నె తెచ్చింది. స్క్రిప్టును చదువుకొని, పాత్రను పరిపూర్ణంగా అర్థం చేసుకొని కెమెరా ముందు నటిస్తుంది. మనకు మలయాళంలో ఒక లైన్ ఇస్తే.. దాని తలా తోకా తెలీదు. దాన్ని ఎలా పలకాలో తెలీదు. అలాంటిది తనకు తెలీని భాషలో ఒక డైలాగ్ ఇస్తే, దాన్ని చదువుకొని, ఎక్స్‌ప్రెషన్ పెడుతూ సరిగ్గా చెప్పడం మామూలు విషయం కాదు. పెద్ద లైన్‌లు ఉన్నప్పుడు మాత్రం రిహార్సల్స్ కోసం ఒక రోజు ముందు చెప్పమనేది. చెంగుచెంగున దూకే చలాకీ పాత్రను పక్కాగా చేసింది. స్ప్రింగులా డాన్స్ చేసింది. వరుణ్‌తేజ్ చూస్తే.. అతని పాత్రలో హీరోయిజం ఉండదు. ప్రేమ కోసం బాధపడుతూ ఉంటాడు. ఫస్టాఫ్ భానుమతి పాయింట్ ఆఫ్ వ్యూలో ఉంటే, సెకండాఫ్ వరుణ్ పాయింట్ ఆఫ్ వ్యూలో ఉంటుంది. నిజాయితీగా చాలా బాగా చేశాడు. ఇద్దరూ ఇద్దరే.

సెట్‌లో కాకుండా, అసలైన లొకేషన్‌లలోనే తీయడానికి ప్రాధాన్యం ఇస్తారెందుకు?

సెట్‌లో కాకుండా నిజమైన లొకేషన్‌లో సినిమా తీయడం అనేది నాకు ఒక లెర్నింగ్ ప్రాసెస్ అనిపిస్తుంది. నిజామాబాద్ దగ్గర బాన్సువాడలో తీయడం వల్లే 'ఫిదా'కు ఇలాంటి మళ్లీ మళ్లీ చూడాలనిపించే రిజల్ట్ వచ్చిందేమో! కథ రాసినప్పుడు తెలంగాణ నేపథ్యం పల్లె అనుకున్నా కానీ బాన్సువాడ గురించి కథ రాసేప్పుడు నాకు తెలీదు. పల్లెలో నాకు కావాల్సిన ఇంటి కోసం రంగారెడ్డి, వరంగల్, నిజామాబాద్‌లో వెతికే క్రమంలో బాన్సువాడలోని ఇల్లు కనిపించింది. మనకు పల్లెటూరి ఇల్లంటే పొలాల మధ్యలో ఉన్నట్లు చూపిస్తుంటారు. మన సినిమాల్లో ఊరు అనేది ఒక 'మిత్'(కల్పన)లా తయారైంది. ఊరంటే గొబ్బెమ్మలు పెట్టడంగానే కనిపిస్తుంటుంది. నిజానికి వ్యవసాయం చేసేవాళ్లెవరూ పొలాల మధ్య ఉండరు. ఊళ్లో ఉంటారు. పొలాలు ఊరి చివరే ఉంటాయి. ఇందులో అగ్రికల్చర్ బీఎస్సీ చదవడానికి ఊరి నుంచే స్కూటీ వేసుకొని టౌన్‌కు వెళ్తుంటుంది భానుమతి. అందుకే ఆమె చేత ఒక సందర్భంలో 'పల్లెటూరమ్మాయంటే పొద్దున్నే లేచి అన్ని పనులు చేస్తానని అనుకోవద్దు. బాగా పడుకుంటాను" అంటుంది. అదే నిజమనుకుంటాను. నా సినిమాలో ఇల్లు కూడా ఒక క్యారెక్టర్ కాబట్టి, దాన్ని వెతికి పట్టుకోవడం ముఖ్యమైంది. విఠల్‌రెడ్డిగారనే ఒక రైస్ మిల్ ఓనర్ ఇల్లు నచ్చింది. ఆయన హైదరాబాద్‌లోనే ఉంటారు. అక్కడ బాగా పేరున్న వ్యక్తి. రాజకీయాల్లోకి రాలేదు కానీ ఊళ్లో వాళ్లందరికీ చాలా ఇష్టమైన వ్యక్తి. అప్పుడప్పుడు బాన్సువాడకు వెళ్లి వస్తుంటారు. ఆ ఇంటి పక్కనే ఆయన గెస్ట్‌హౌస్ ఉంది. యూనిట్‌ను అక్కడ ఉంచి షూటింగ్ చేయడానికి సరిగ్గా సరిపోయే వాతావరణం అనిపించింది. ఆ గెస్ట్ హౌస్‌ను పెళ్లివారికి ఇచ్చినట్లుగా చూపించాను. అలా ఇంటి కోసమే బాన్సువాడను ఎంచుకున్నా. సినిమా హిట్టయ్యాక బాన్సువాడ బాగా పాపులర్ అవడం హ్యాపీ.



బాన్సువాడలో షూటింగ్ చేసిన ఇల్లు

ఉద్దేశపూర్వకంగానే మీ కథల్లో మానవ సంబంధాలకు ప్రాధాన్యం ఇస్తుంటారా?

ఫండమెంటల్‌గా నాకు మనుషులంటే ఇష్టం. వాళ్ల మధ్య అనుబంధాలు ఇష్టం. ఏ మనిషినైనా నేను పాజిటివ్‌గానే చూస్తాను. నాది చక్కని బాల్యం. మాది హ్యాపీ ఫ్యామిలీ. డబ్బుల మీద ఎక్కువ వ్యామోహం ఉండదు. ఇప్పటికీ నేను పిల్లలతో కలిసి గల్లీ క్రికెట్ ఆడుతుంటా. నా పిల్లలకి చదువు చెబుతుంటా. ఏడాది నుంచీ మా అమ్మాయికి 'మహాప్రస్థానం' చెబుతున్నా. తను తొమ్మిదో తరగతి చదువుతోంది. తనకు అది బాగా వంటపడుతోంది. ఇంగ్లీష్ మీడియం అయినా తెలుగు బాగా చదువుతుంది. అది నాకు ఆనందం. ఫండమెంటల్లీ నేను హ్యాపీగా ఉంటాను కాబట్టి బహుశా నా కథల్లో అవి ప్రతిఫలిస్తుంటాయేమో. ఇంటెన్షనల్‌గా కథలో ఉండాలన్నట్లు వాటిని నేను పెట్టను. నాకు తెలీకుండానే నా కథల్లో అవి భాగమైపోతుంటాయనుకుంటా. అంతేకానీ, మానవ సంబంధాల్ని చూపించడంలో నేనేమీ ఎక్స్‌పర్ట్‌ను కాను. వాటిని సినిమాల్లో చాలా గొప్పగా చూపించినవాళ్లు ఉంటారు. కాకపోతే ఒకసారి వెనక్కి తిరిగి చూసుకుంటే.. నా సినిమాల్లో అవి ఒక శైలిలా రూపుదిద్దుకుంటున్నాయేమో అనిపిస్తోంది. ఇప్పటి సినిమాల్లో ఆ మానవ సంబంధాలు తక్కువైపోతున్నాయి. ఆ గ్యాప్‌ను భర్తీ చేసే సినిమాలను ప్రేక్షకులు మళ్లీ మళ్లీ చూస్తుంటారు.. 'ఫిదా'కు మల్లే. తెలీని ఒక కొత్త ప్రపంచాన్ని సృష్టించి, ప్రేక్షకుల్ని అందులో కూర్చోబెట్టానేమో అనిపిస్తోంది. అదంతా నా ఘనత అని గర్వపడట్లేదు. ఒక్కోసారి అన్నీ అలా కుదురుతాయి. ఇదివరకు 'ఆనంద్'కూ, 'హ్యాపీడేస్'కూ అలా అయితే, ఇప్పుడు 'ఫిదా'కు అయింది. అంటే నా సినిమాల్లో కొద్దో గొప్పో తెలీని ఏదో విలువ ఉందేమోననిపిస్తోంది.



సాయిపల్లవి, వరుణ్‌కు సన్నివేశాన్ని వివరిస్తూ..



'ఫిదా' చూసి మీ భార్యాపిల్లలు ఎలా ఫీల్ అయ్యారు?

మా అమ్మాయికీ, అబ్బాయికీ (ఆరో తరగతి చదువుతున్నాడు) సినిమా బాగా నచ్చింది. పాపయితే తన క్లాస్‌మేట్స్‌కు టిక్కెట్లిచ్చి వాళ్లను సినిమాకు తీసుకెళ్లింది. ఒక యుఫోరియా ఉంటుంది కదా. 'హ్యాపీడేస్' అప్పుడు తను చాలా చిన్నది. వాళ్లకు ఊహ వచ్చాక నా నుంచి వాళ్లు చూసిన పెద్ద సక్సెస్ ఇదే. నన్ను వాళ్లు గొప్పగా ఊహించుకోవాలని అనుకోను. ఒక మామూలు తండ్రిగానే చూడాలనుకుంటాను. 'ఫిదా' ఇంత పెద్ద హిట్టయ్యేసరికి వాళ్లూ గర్వంగా ఫీలై, తమ టీచర్లకు, ఫ్రెండ్స్‌కు టిక్కెట్లిచ్చుకున్నారు. పాపకు భానుమతి కేరక్టర్‌లో సాయిపల్లవి బాగా నచ్చేసింది. ఆమెకు ఫ్రెండ్ అయిపోయింది కూడా. 'మెల్లా మెల్లగ వచ్చిండే' పాట తీసేప్పుడు సెట్స్‌కు వచ్చింది. ఇక మా ఆవిడకు స్క్రిప్ట్ స్టేజ్‌లోనే బాగా నచ్చింది. బేసిగ్గా నేను కథను మా ఇంట్లోవాళ్లతో షేర్ చేసుకుంటా. విని.. తన అభిప్రాయాలు చెబుతుంటుంది. తనకంటే మిగతా వాళ్లకు నచ్చిందా, లేదా.. అనే దానిపైనే ఆమె దృష్టి. సినిమా అందరికీ నచ్చడంతో ఆవిడ చాలా హ్యాపీ.

> నా టీమ్‌లో ఎవరూ భయంతో పనిచేయరు. సెట్స్‌పై ఎన్ని ఆర్గ్యుమెంట్లు అవుతాయో! భానుమతి, వరుణ్ ఎలా ప్రవర్తిస్తారనే విషయంలో ఆ నటులే కాకుండా మా అసిస్టెంట్ డైరెక్టర్లు కూడా నాతో వాదిస్తుంటారు. ఇదంతా నాతో ప్రేమతోనే! ఎవరైనా నన్ను ప్రశ్నించగలుగుతారు, తమ అభిప్రాయాన్ని చెప్పగలుగుతారు. అంత ప్రజాస్వామిక వాతావరణం నా సినిమా సెట్స్‌పై ఉంటుంది.

> 'ఆనంద్'ను పవన్‌కల్యాణ్‌తో చేయాలని ఆయనకు చెప్పాను. అది సాధ్యపడలేదు. స్క్రిప్ట్ మొత్తం చెప్పలేదు కానీ.. 'ఫిదా' లైన్ మహేశ్‌కు చెప్పాను. కథ చెప్పడంలో నేను కొంచెం వీక్. బ్రేక్ పాయింట్, ఇంటర్వెల్ బ్యాంగ్, క్లైమాక్స్.. ఈ తరహాలో నేను కథ వినిపించలేను. కొన్ని సన్నివేశాల్ని నేను విజువల్‌గా తప్ప.. నోటితో చెప్పి ఒప్పించలేను. బేసిగ్గా నాతో ఇలాంటి సమస్య ఉంటుంది.

మీ కుటుంబంలో ఎవరితో మీకెక్కువ అనుబంధం?

చిన్నప్పట్నించీ నా హీరో ఎవరంటే మా నాన్నే. ఆయన్ని చూస్తూ, ఆయన పాటించే విలువలను గమనిస్తూ పెరిగాను. అమ్మన్నా, అక్కలన్నా అంతే ఇష్టం. ఒక్కోసారి భయమేస్తుంటుంది.. నేనక్కడ ఆగిపోయానేమోనని! నేను అమెరికా వెళ్లినా ఆ అనుబంధాల్ని వదల్లేదు. ఇంజనీరింగ్ నుంచి నేను సినిమాల్లోకి ఎందుకు ఎంటర్ అవుతున్నాననేది హార్వర్డ్ యూనివర్శిటీలో ఫిల్మ్ కోర్స్ చదువుకోవడానికి వెళ్లినప్పుడు ఇచ్చిన 'స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్' ఉంది. "అందరికీ డబ్బులు, అమెరికా సిటిజన్‌షిప్, గ్రీన్‌కార్డ్ వంటి వాటిపై దృష్టి ఉంటుంది. కానీ నేను చూసే, నేను కలలుకనే ప్రపంచం వేరు. ఆ ప్రపంచం చూపించాలంటే విజువల్ మీడియాకు రావాలని అప్లై చేస్తున్నా" అని అందులో రాశాను. అలా రాయడానికి వెనకున్నది మా ఇంటి వాతావరణం, మా వాళ్లతో నా అనుబంధం. ఆ ఫిల్మ్ స్కూల్ నుంచి నేను వెనక్కి తిరిగి చూడలేదు. నాలో స్పెషల్ టాలెంట్ ఉందని నా ప్రొఫెసర్లు గుర్తించారు. హాలీవుడ్‌లో నాకు ఇంటర్న్‌షిప్ చేయడానికి అవకాశం వచ్చినప్పుడు కూడా, అక్కడి కథల్ని నేను చెప్పలేనని ఇక్కడకు వచ్చేశా. ఫిల్మ్ స్కూల్ నుంచి బయటకు వచ్చాక 'డాలర్ డ్రీమ్స్' నుంచి నేననుకున్నదే తీస్తూ వచ్చా. 'ఆనంద్' చూస్తే.. ఒక కొత్తదనం గుబాళిస్తుంటుంది. నా సినిమాలకు హాంటింగ్ ఫీల్ ఉంటుందనేది అర్థం చేసుకున్నా. నా సినిమాలు ఒక హ్యాపీనెస్‌ను ఇస్తాయి. ఎంటర్‌టైన్‌మెంట్ వేరు, హ్యాపీనెస్ వేరు. వినోదాన్ని ఆ క్షణంలో మాత్రమే పొందుతాం. కానీ ఆనందం అనేది కొంత కాలం పాటు మనల్ని అంటి పెట్టుకొని ఉంటుంది. అలాంటి ప్రపంచాన్ని క్రియేట్ చేశాననుకుంటాను. పెళ్లయి, పిల్లలు పుట్టాక మనుషులతో నా అనుబంధం మరింత విస్తృతమైంది.

సమాజంపై సినిమా ప్రభావం ఉంటుందనుకుంటారా?

ఎవరైనా సినిమా ప్రభావం ఉండదని అంటే అంతకుమించిన బాధ్యతారహిత ప్రకటన మరొకటి ఉండదు. సమాజం నుంచే సినిమా పుడుతుందనీ, సినిమా నుంచి ఎవరూ ఏమీ నేర్చుకోరనీ అనేది సహించాల్సిన స్టేట్‌మెంట్ కాదు. ఎవరైనా అలా అంటే వెంటనే ఖండించాలి. నేనైతే తిడతాను.


రామ్‌గోపాల్‌వర్మ లాంటి డైరెక్టర్రే సినిమా నుంచి ఎవరూ ఏమీ నేర్చుకోరని చాలా సార్లు చెప్పారు కదా!

ఎంతటి జీనియస్ అయినా, ఎంతటి గొప్పోడైనా కావచ్చు.. అలాంటి స్టేట్‌మెంట్ ఇవ్వడం చాలా తప్పు. సినిమా అనేది చాలా బాధ్యతాయుతమైన మాధ్యమం. వాళ్లకు గొప్పతనం అన్వయించే చెబుతున్నా. వాళ్లు ఆ స్థాయిలో ఉన్నారు కాబట్టే జనం వాళ్లను చూస్తున్నారు, వింటున్నారు. వాళ్ల సినిమాలకు ప్రేక్షకులు ఉన్నారు. ఏదో ఒక సందర్భంలో వాటికి ప్రభావితమవుతారు. అదే పెద్ద హీరో చెబితే ఇంకా కరెక్టనుకుంటారు. తెలుగులో స్టార్స్‌ని ఆరాధించడం మరీ ఎక్కువ. ఒకవేళ ప్రభావితం కారనుకున్నా, వాళ్లయితే చెడు చెప్పకూడదు కదా! డైరెక్టర్ అనేవాడికి బేసిగ్గా ఒక డైరెక్షన్ ఉండాలి కదా! ఏ సినిమానైనా ఏదో ఒక పాయింట్‌తో చెబుతారు. కనీసం ఆ పాయింట్ అన్నా పాజిటివ్‌గా ఉండాలి కానీ తప్పు చెప్పకూడదంటాను. డాక్టర్ అయిన వాడు తన ఇష్టం వచ్చినట్లు మెడిసిన్ ఇస్తానంటే కుదరదు. సినిమా ప్రొఫెషన్ కూడా అంతే. పక్కాగా జనం దీనితో ఇన్‌ఫ్లుయెన్స్ అవుతారు. ఇవాళ రజనీకాంత్ అనే పెద్ద సూపర్‌స్టార్ సిగరెట్ తాగనని ఎందుకంటారు! గతంలో ఆయన సిగరెట్ తాగే స్టయిల్‌ను కోట్లాది మంది ఆరాధించారు. ఆ లుక్‌కే టిక్కెట్లు తెగిపోయేవి. అలాంటిది.. తాను సిగరెట్లు తాగనని, చూయింగ్‌గమ్ నములుతాననీ ఎందుకన్నారంటే.. తనను చూసి పిల్లలు ప్రభావితం అవుతున్నారని!

పెద్ద హీరోతో ఇప్పటి వరకూ సినిమా చేయలేకపోయాననే బాధ ఏమైనా మీలో ఉందా?

ఫలానా హీరోను ఊహించుకొని కథ రాయడం నాకు కష్టం. ఒక కథ ఫలానా హీరోకు పక్కాగా సెట్ అవుతుందనుకుంటే వెళ్లి చెప్పగలుగుతా. మహేశ్‌తో చేయాలని చాలా కాలంగా అనుకుంటున్నా. రెండు మూడు సార్లు కలిశాను. ఆయనది సామాన్యమైన ఇమేజ్ కాదు. ఏదో రోజు ఆయనతో తీస్తాను. ఇప్పటివరకూ వాళ్లతో చేయలేకపోయాననే బాధ లేదు. నేను ఒక సినిమా మొదలుపెడితే.. అందులో యాక్టర్లు ఎవరైనా.. నా శాయశక్తులా పూర్తి ఏకాగ్రతతో బాగా తీయడానికి కృషి చేస్తా. సినిమా ద్వారా ఒక స్టేట్‌మెంట్ ఇవ్వాలనుకున్నప్పుడు.. పెద్ద స్టార్‌తో తీస్తే దాని ప్రభావం ఎక్కువుంటుంది.

• బుద్ధి యజ్ఞమూర్తి
ఫొటో: ఎం.గోపీకృష్ణ



'ఫిదా'లో సాయిపల్లవి

గుడ్ మార్నింగ్



మంచి కోసం చేసే పోరాటంలో.. ఓడిపోయినా అది గెలుపే అవుతుంది

తెలుసా!

గులాబి సరస్సు



గోదావరి నదిలో నీళ్ల కాస్త గోధుమ రంగులో ఉంటాయని చెబుతారు. కృష్ణా నదిలో నీళ్ల కాస్త కృష్ణ వర్ణంలో ఉంటాయంటారు. ఆయా నదుల పరీవాహక ప్రాంతాన్ని బట్టి నదుల రంగుల్లో తేడాలు ఉంటాయి. చెరువులు, తటాకాలు, సరస్సుల్లో నీటికి కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది. ఆస్ట్రేలియాలోని హిల్లీయర్ సరస్సులోని నీళ్ల మాత్రం గులాబి రంగులో ఉంటాయి. అక్కడి నేలలో ఏ గుణం ఉందో తెలియదు కానీ.. గులాల్ కలిపిన నీళ్లలా ఉంటాయవి. దక్షిణ ఆస్ట్రేలియాలోని ఓ ద్వీపంలో ఉందీ సరస్సు. రెండు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉండే ఈ సరస్సును 18వ శతాబ్దంలో కనుగొన్నారు. ఆనాటి నుంచి 'ఇందులోని నీళ్ల గులాబి రంగులో ఎందుకున్నాయో!' పరిశోధనలు చేస్తూనే ఉన్నారు. ఈ సరస్సు చుట్టుపక్కల ఇసుక దిబ్బలు ఉన్నాయి. అలాగే యూకలిప్టస్, పేపర్‌బార్క్ చెట్లు విస్తారంగా ఉన్నాయి. ఈ చెట్ల కారణంగానే హిల్లీయర్ నీళ్ల గులాబి రంగులోకి మారాయని విశ్లేషించారు పరిశోధకులు. అయితే ఈ సరస్సుకు కూతవేటు దూరంలోనే అంటార్కిటిక్ సముద్ర తీరం ఉంటుంది. ఆ సముద్ర జలాలు మాత్రం నీలిరంగులోనే ఉండటం విశేషం.

మీకు మీరే డాక్టర్

ఇంగువతో లాభాలెన్నో

- పొంగించిన ఇంగువకు సమానంగా నల్ల ఉప్పు కలిపి చూర్ణం చేసుకోవాలి. తేనెలో పెసర గింజంత పరిమాణంలో ఈ చూర్ణం కలిపి నాకిస్తే, పిల్లల్లోని కడుపు ఉబ్బరం సమస్యలు తగ్గిపోతాయి.
- ఇంగువను కొంచెం వేడి చేసి, పుప్పి పంటిలో ఉంచితే బాధ ఉపశమిస్తుంది.
- పొంగించిన అరగ్రాము ఇంగువను ఆవునెయ్యితో కలిపి ప్రతి రోజూ మూడు పూటలా సేవిస్తే దగ్గు తగ్గిపోతుంది.
- 10 గ్రాముల హారతి కర్పూరంలో, 10 గ్రాముల పొంగించిన ఇంగువ కలిపి నూరి, కందిగింజ సైజు మాత్రలు చేసుకుని పూటకు ఒక మాత్ర చొప్పున మూడు పూటలా వేడినీటితో వేసుకుంటే ఉబ్బసం నుంచి ఉపశమనం లభిస్తుంది.
- పెసర గింజంత ఇంగువను నీళ్లల్లో కరిగించి నొప్పి ఉన్న వైపు ముక్కులో 3 చుక్కలు వేసుకుని నస్యంగా పీలిస్తే పార్శ్వపు నొప్పి తగ్గుతుంది.
- ఇంగువ, సైందవ లవణం, శొంఠి ఒక్కొక్కటి 20 గ్రాముల చొప్పున తీసుకుని 30 గ్రాముల ఆవనూనెలో కలిపి నూనె మాత్రమే మిగిలేలా వేడి చేయాలి. ఆ నూనె 4 చుక్కలు చెవిలో వేసుకుంటే చెవిపోటు తగ్గిపోతుంది.
- పొంగించిన ఇంగువను మంచినీళ్లలో అరగదీసి, ఆ గంధాన్ని కాలిన చోట లేపనంగా వేస్తే కాలిన గాయాలు, బొబ్బలు మానిపోతాయి.
- అరగ్రాము ఇంగువను అరకప్పు నీటిలో కలిపి తాగిస్తే, లో బి.పి సమస్య తొలగిపోతుంది.



దృశ్యం

ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి, రొటీన్ నుంచి వెరైటీకి చేరాలనుకునే ప్రతి ఒక్కరూ కోరుకునేది మార్పు. ఇప్పుడు ఆ మార్పును కథానాయకులు కూడా ఆశిస్తున్నారు. పాత తరం హీరో అర్జున్ నుంచి నిన్నటి శ్రీకాంత్ దాకా చాలా మంది ఇప్పుడు 'ప్రతి'నాయకుడి పాత్రల వైపు మొగ్గుచూపుతున్నారు. అందుకే మన సినిమాలోనూ ఆ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. విలనిజానికి విల్లింగ్ అంటున్న హీరోల మీద 'దృశ్యం' ఫోకస్ లైట్..

ప్రతి నాయకుడు

నయా విలన్స్



అర్జున్



బంతిని దృఢమైన గోడకు కొట్టినప్పుడు అది మరింత ఫోర్స్‌గా తిరిగి దూసుకొస్తుంది. అదే శూన్యంలోకి విసిరితే ఫలితం శూన్యమే. విలన్ గోడలాంటి వాడు. నాయకుడి హీరోయిజం ఎలివేట్ కావాలంటే ప్రతినాయకుడు కూడా అంతకన్నా బలమైనవాడై ఉండాలి. ఇప్పుడు దర్శకులు ఈ విషయాన్ని మరింతగా ఆకళింపు చేసుకుంటున్నారు.

హీరో, హీరోయిన్ల ఎంపికకు ఇచ్చే ప్రాముఖ్యతనే విలనీలకు కూడా ఇస్తున్నారు. పర్యవసానంగా సినిమాకొకరు ప్రతినాయకుడి పాత్రలో కనువిందు చేస్తున్నారు.

విలన్ అనగానే మందు తాగుతూ, సిగరెట్ కాలుస్తూ, దుర్భాషలాడుతూ ప్రేక్షకులకు వెగటు పుట్టించేలా ప్రవర్తించాలన్నది నిన్నటిమాట. ఇప్పుడు విలన్ పాత్రలను మలిచే విధానంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. 'లెజండ్'తో విలన్ గెటప్‌కు శ్రీకారం చుట్టిన జగపతిబాబు మాటల్లో చెప్పాలంటే "విలన్ అనేవాడు దుష్టుడే అయి ఉండవచ్చు. అంతమాత్రం చేత చూడ్డానికి అసహ్యంగా, కండలు పెంచి వికృతంగా ఉండటం ఎందుకు? ఫిజికల్‌గా ఫిట్‌గా ఉండి, మెంటల్‌గా దుష్ట ఆలోచనలు చేసేవారు ఎంత మంది ఉండరు? ఏం అలాంటి విలన్లు మన దగ్గర ఎందుకు ఉండకూడదు?" అని ప్రశ్నిస్తారాయన. జగపతిబాబు ఇప్పుడు మోస్ట్ వాంటెడ్ స్టైలిష్ సౌత్ ఇండియన్ విలన్. త్వరలో ఉత్తరాదిన కూడా ఓ సినిమా చేయనున్నారు. జగపతిబాబు బాటలో అడుగులు వేస్తున్న మరో టాలీవుడ్ హీరో శ్రీకాంత్. 'పీపుల్స్ ఎన్‌కౌంటర్' చిత్రంతో సినీ ఎంట్రీ ఇచ్చారాయన. కెరీర్ ప్రారంభంలో కొన్ని విలన్ వేషాలు వేశారు. ఆ తర్వాత కూడా అడపాదడపా మిగిలిన హీరోల సినిమాల్లో పాత్రలు పోషించారు. అయితే మనసులో ఏ మాత్రం కన్ఫ్యూజన్ ఉన్నా.. మానసిక సంతృప్తినిచ్చే గెలుపు పలకరించకపోయినా.. మొదటి నుంచి మొదలుపెట్టాలన్నది గొప్ప మేనేజ్‌మెంట్ సూత్రం. ఇప్పుడు శ్రీకాంత్ మూలాలను పలకరించే పనిలో ఉన్నారు. ఫలితంగా విలన్ పాత్రలను పలవరిస్తున్నారు. ఆ పర్యవసానమే నాగచైతన్య నటిస్తున్న 'యుద్ధం శరణం'లో శ్రీకాంత్ విలన్. ఇటీవలే మొదలైన మరో భారీ చిత్రంలోనూ విలన్‌గా శ్రీకాంత్ పేరే వినిపిస్తోంది. తమిళ్‌లోనూ ఓ సినిమాకు ఆయన సంతకం చేసినట్టు వినికిడి.

యువతరం ప్రతినిధి


ఏం చేయాలన్నా తెగువను ప్రదర్శించే లక్షణం రానా సొంతం. 'బాహుబలి'లో భల్లాలదేవగా కండలు తిరిగిన శరీరంతో మెప్పించారు రానా. ఆయన్ని చూసి చాలా మంది యువ కథానాయకులు విలనీ పాత్రలను టేకప్ చేసుకోవడానికి ముందుకొచ్చారు. వారిలో తనీశ్ ఒకరు. డ్రగ్ అడిక్ట్‌గా ఆయన 'నక్షత్రం'లో మెప్పించారు. నవదీప్ కూడా గతంలో నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రను చేయడం గమనార్హం.



సుమంత్

సినిమాలో హీరో, విలనూ - రెండు పాత్రల్లోనూ ఒకరే నటిస్తే... ఈ పంథా ఈ మధ్య దక్షిణాది చిత్రాల్లో కాస్త జోరుగానే కనిపిస్తోంది. 'రోబో'లో సైంటిస్ట్‌గానూ, దుష్ట ఆలోచనలు నిండిన రోబోగానూ రెండు పాత్రల్లో మెప్పించారు రజనీకాంత్. అలాగే '24'లోనూ ఓ పాత్ర ద్వారా క్రూరత్వాన్ని ప్రదర్శించాడు సూర్య. ఇటీవల విడుదలైన 'గౌతమ్‌నంద'లోనూ గోపీచంద్ ఓ పాత్రలో విలన్‌గానే చేశారు. కెరీర్ ప్రారంభంలో విలన్‌గా నటించి బ్లాక్‌బస్టర్ హిట్లను సొంతం చేసుకున్న ఘనత గోపీచంద్‌ది. తాజాగా ఈ కోవలో ఎన్టీఆర్ ప్రయత్నాలు సాగిస్తున్నారు. నందమూరి తారకరామారావు ఆర్ట్స్ పతాకంపై నందమూరి కల్యాణ్‌రామ్ నిర్మిస్తున్న 'జై లవ కుశ'లో 'జై' పాత్రలో నెగటివ్ షేడ్స్ ఉంటాయని వినికిడి. కోర మీసాలతో, చేతులకు సంకెళ్లతో విడుదలైన 'జై'లుక్‌కి ఇప్పటికే మంచి స్పందన వస్తోంది.

ప్రస్తుత స్టార్ హీరోల్లో తొలిసారి నెగటివ్ షేడ్స్‌లో ఎన్టీఆర్ కనిపించనున్నారు.



'జై లవకుశ'లో జూనియర్ ఎన్టీఆర్



జగపతిబాబు



సూర్య

కన్నడ అవరు!

తెలుగు హీరోలు పొరుగు భాషల్లో విలన్ పాత్రలు వేస్తుంటే అక్కడివారు కూడా ఇక్కడి సినిమాలకు సంతకం చేస్తున్నారు. 'ఈగ'లో సమంత మీద మనసు లగ్నం చేసి, ఆమెను దక్కించుకోవడానికి నానిని చంపే విలన్ పాత్రలో సుదీప్ నటించారు. తమిళనాడులో స్థిరపడిన తెలుగు వ్యక్తిగా, తన భార్య ముందు తన దుష్ప్రవర్తన బయటపడని భర్తగా ఉపేంద్ర పాత్ర ఇప్పటికీ తెలుగువారి మనస్సుల్లో పదిలంగా ఉంది. తాజాగా 'లై'లో అర్జున్ చేసిన విలన్ పాత్రకు ప్రేక్షకుల్లో మంచి పేరు వస్తోంది. ఈ చిత్రాన్ని ఒప్పుకున్న వైనాన్ని గుర్తుచేసుకుంటూ.. ""లై'ని ఒప్పుకున్న సమయంలో నాకు పలు కన్నడ, తెలుగు, తమిళ సినిమాల అవకాశాలు వచ్చాయి. కానీ వాటన్నిటిలోనూ మూస ధోరణి ప్రస్ఫుటంగా కనిపించింది. వాటిని మించి ఇంకేదో చేయాలనే తపన నన్ను వెంటాడింది. సరిగ్గా ఆ సమయంలోనే హను రాఘవపూడి 'లై' కథ చెప్పాడు. వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశాను. ఇంటలిజెంట్, సోఫిస్టికేటెడ్, క్రూక్‌డ్‌నెస్ ఉన్న ఫెలోగా నేను నటించిన పాత్రకు జనాల్లో మంచి ఆదరణ వస్తోంటే ఆనందంగా ఉంది" అని చెప్పారు అర్జున్.


వయా కోలీవుడ్..

తమిళనాడులో హీరోలుగా చలామణి అవుతూ ఈ మధ్య ఇటు తెలుగు, అటు తమిళంలోనూ బ్యాడీస్‌గా చేస్తున్న వారూ లేకపోలేదు. ప్రముఖ దర్శకుడు రవిరాజా పినిశెట్టి తనయుడు ఆది పినిశెట్టి ఈ కోవలోకే వస్తారు. 'సరైనోడు'లో విలన్ పాత్రకు ఆది పినిశెట్టి పక్కాగా సరిపోతాడని బోయపాటి అన్నప్పుడు 'తను తమిళ్‌లో హీరోగా చేస్తున్నాడు. ఇక్కడ విలన్‌గా చేయమని ఎలా అడగను?' అని అల్లు అరవింద్ సైతం తటపటాయించారన్నది వాస్తవం. అయితే ఆ కథ, బోయపాటి విలన్‌ని ఎలివేట్ చేసే తీరును అర్థం చేసుకున్న ఆది మాత్రం ఛాన్స్‌ను మిస్ చేసుకోలేదు. ""సరైనోడు'లో నాది చాలా మంది కేరక్టర్. బన్నికి కూడా చాలా ఇష్టమైన పాత్ర. ఒకవేళ వేరే లాంగ్వేజ్‌లో సినిమా చేస్తే నా పాత్రను చేయాలనుకుంటున్నట్టు ఒకసారి బన్నీ కూడా అన్నారు.. హీరోకి కూడా నచ్చిన విలన్ పాత్ర చేయడం ఆనందంగా ఉంది" అని చెప్పారు ఆది పినిశెట్టి. ఇప్పుడు ఆది వెంటే తెలుగులోకి వచ్చిన విలన్ ప్రసన్న. హీరోయిన్ స్నేహ భర్తగా ప్రసన్న తెలుగువారికి సుపరిచితుడే. బీవీయస్ రవి దర్శకత్వంలో సాయిధరమ్‌తేజ్ హీరోగా నటిస్తున్న 'జవాన్' చిత్రంలో విలన్‌గా నటించారు. "హీరోగా అవకాశాలు సన్నగిల్లుతూ, మార్కెట్ కూడా తగ్గుతున్న సమయంలో విలన్ కావాలన్నది నేను కావాలనే తీసుకున్న నిర్ణయం. సినిమాలకు కాసింత గ్యాప్ ఇచ్చి కండలు పెంచాను. నా ఫిజిక్‌ను ఫొటోల్లో చూసిన రవిగారు నన్ను అప్రోచ్ కావడం ఆనందంగా ఉంది" అని చెప్పారు ప్రసన్న. 'రోజా' చిత్రంతో లేడీ ఫ్యాన్ ఫాలోయింగ్‌ను పెంచుకున్న అరవింద్ స్వామి 'తని ఒరువన్'లో విలనీ చేశారు. తెలుగులో రామ్‌చరణ్ నటించిన 'ధ్రువ'లోనూ ఆయనే విలన్.

అసలెందుకు?

హీరోలు విలన్‌గా ఎందుకు చేయాలి అనే ప్రశ్న ఉదయిస్తే 'మార్పు'కోసం అనేది తొలి సమాధానం. హీరోలుగా అవకాశాలు సన్నగిల్లినప్పుడు, మార్కెట్ క్షీణిస్తోందన్న విషయం అర్థం కాసాగినప్పుడు ఎదురుగా ఊరిస్తున్న విలన్ పాత్రల్లోకి పరకాయ ప్రవేశం చేసిన వారు కూడా లేకపోలేదు. సినిమాల సంఖ్యాపరంగా కూడా హీరోతో పోలిస్తే విలన్‌గా ఎక్కువ చిత్రాలు చేయొచ్చు. డిమాండ్‌కు తగ్గట్టు పారితోషికం కూడా గట్టిగానే అందుతుంది. హీరోగా ఓ ఇమేజ్ ఉన్న సొంత పరిశ్రమలో కాకపోయినా, పొరుగు పరిశ్రమల్లో అడపాదడపా అలాంటి పాత్రలను చేయడం వల్ల మార్కెట్‌ను కూడా పెంచుకోవచ్చున్నది మరికొందరి అభిప్రాయం.

● డా. చల్లా భాగ్యలక్ష్మి



శ్రీకాంత్



ప్రసన్న

'రోబో'లో ఇప్పటికే విలన్‌గా అలరించిన రజనీకాంత్ '2.0'తో మరోసారి మ్యాజిక్ చేయడానికి సిద్ధమవుతున్నారు.

నటి స్నేహ భర్తగా తెలిసిన ప్రసన్న తొలిసారి తెలుగులో విలన్ పాత్రలో కనిపించనున్నారు.


మొదట్లో ప్రతినాయక పాత్రల్లో రాణించి, హీరోగా మారి ప్రేక్షకాభిమానం పొందిన శ్రీకాంత్ తిరిగి ప్రతినాయకుడిగా అవతారమెత్తుతున్నారు.



'రోబో'లో రజనీకాంత్

అక్షయ్.. రోబో!

దక్షిణాది నాయకులతో పోటీపడుతూ అక్షయ్‌కుమార్ నెగటివ్ రోల్ చేస్తున్నారు. 'రోబో 2.0'లో ఆయన చేస్తున్న తీరు చూసి అందరూ ఫిదా అవుతున్నారట. ఈ సైన్స్ ఫిక్షన్‌లో అక్షయ్‌కుమార్ వేషధారణను మలచడానికి దాదాపు ఆరు గంటల సమయం పట్టేదట. అన్ని గంటలూ ఓపిగ్గా కూర్చుని మేకప్ వేయించుకునేవారట అక్షయ్. 'పనిచేసే ప్రతిక్షణం నాకు ఎగ్జయిటింగ్‌గానే ఉంది. శంకర్, రజనీగారితో పనిచేయడం మర్చిపోలేని అనుభూతి. పాత్ర గురించి ఇప్పుడప్పుడే చెప్పను. తెరపై చూసి వండర్ కావాల్సిందే' అని ఇప్పటికే అక్కీ చెప్పారు.



'రోబో 2.0'లో అక్షయ్‌కుమార్

కృష్ణుడంటే ఎన్టీఆరే!

ఆయన పేరు నందమూరి తారక రామారావు. అయినా శ్రీకృష్ణుని పాత్రకు పెట్టింది పేరుగా నిలిచి వెండితెర వేల్పుగా తెలుగువారి హృదయాల్లో శాశ్వత స్థానం ఏర్పరచుకొన్నారు. మూడున్నర దశాబ్దాలకు పైగా ఉన్న తన నటజీవితంలో ఎన్టీఆర్ నటించిన చిత్రాల్లో సాంఘికాల సంఖ్యే అధికమైనప్పటికీ , ఆయనకు అపారమైన పేరు ప్రతిష్ఠలు తెచ్చి పెట్టినవి మాత్రం పౌరాణిక పాత్రలే. ముఖ్యంగా శ్రీకృష్ణుని పాత్రను అనితరసాధ్యమైన రీతిలో పోషించిన ఎన్టీఆర్ తెలుగు ప్రేక్షకులకు ఆరాధ్యదైవం అయ్యారు. పాతికేళ్లలో 18 చిత్రాల్లో శ్రీకృష్ణుని పాత్రను పూర్తి స్థాయిలో పోషించడమే కాకుండా ఒకే ఆహార్యం, ఒకే వయసుని ప్రతిబింబిస్తూ నటించడం ఆయనకు మాత్రమే సాధ్యమైంది. ఆ పరంగా ఆయన ప్రపంచ రికార్డ్ నెలకొల్పారనే చెప్పాలి. ఎన్టీఆర్‌కు ముందు, ఆ తర్వాత కూడా కొంతమంది నటులు శ్రీకృష్ణుని పాత్ర పోషించినప్పటికీ ప్రేక్షకులు వారిలో దైవత్వం చూడలేకపోయారు. ఆ పాత్రలో ఎన్టీఆర్‌ని ఆరాధించినట్లుగా, అభిమానించినట్లుగా ఇతరులను ఆదరించలేకపోయారు. ఇప్పటికీ కృష్ణుని గెటప్‌లో ఉన్న ఎన్టీఆర్ బొమ్మకు అగరువత్తులు వెలిగించి, హారతులు ఇచ్చి పూజలు చేసే వారున్నారంటే అతిశయోక్తి కాదు. అందుకే ఎన్టీఆర్ కారణజన్ముడిగా నిలిచారు. సినిమాల్లోని అంతర్నాటకాలతో కలిపి మొత్తం 33 సార్లు కృష్ణునిగా నటించారు ఎన్టీఆర్. అన్ని సార్లు ఆ పాత్రని పోషించడం, ప్రతిసారీ ప్రేక్షకుల్ని మెప్పించడమన్నది అందరికీ సాధ్యమయ్యే విషయం కాదు. ఆయన సమకాలికులైన కొందరు నటులకు కృష్ణుని పాత్రని పోషించే అవకాశం వచ్చినా, ప్రతిసారీ వారిని ఎన్టీఆర్‌తో పోల్చుకొనేవారు ప్రేక్షకులు. అందుకే శ్రీకృష్ణుని పాత్ర పోషించాలనే కోరిక మనసులో ఉన్నా , ధైర్యం చేయలేక 'అమ్మో..' అనే వారు చాలా మంది. ఎన్టీఆర్ స్వయంగా నచ్చజెప్పి కొంతమంది నటులతో ఆ పాత్ర పోషింపజేసిన సందర్భాలూ ఉన్నాయి.

(రేపు కృష్ణాష్టమి)



విడాకులు వద్దనుకుంటున్నారు!

హాలీవుడ్ అగ్ర తారలు ఏంజెలీనా జోలీ, బ్రాడ్ పిట్ విడాకులు తీసుకుంటున్నారనే వార్త బయటకు వచ్చినప్పుడు వారి అభిమానులు దిగ్భ్రాంతికి లోనయ్యారు. ఏకంగా పన్నెండు సంవత్సరాల పాటు సహ జీవనం చేసిన వాళ్లు, పెళ్లాడిన రెండేళ్ల తర్వాత 2016 సెప్టెంబర్ నుంచి విడివిడిగా జీవిస్తున్నారు. బ్రాడ్‌తో తీవ్ర అభిప్రాయ భేదాల కారణంగానే విడాకులు కోరుకుంటున్నట్లు గత ఏడాది ఏంజెలీనా తెలిపింది. అయితే తాజాగా తమ అనుబంధానికి రెండో అవకాశం ఇవ్వాలని ఆ జోడీ భావిస్తున్నట్లు సమాచారం! పునరాలోచించుకొని విడాకుల వ్యవహారం ముందుకు కదలకుండా ఆపాలని వారు నిర్ణయించుకున్నారని హాలీవుడ్ వర్గాలు అంటున్నాయి. విడాకులనేవి చిన్న వ్యవహారం కాదనీ, దాని వల్ల పిల్లలపై వ్యతిరేక ప్రభావం పడకూడదనీ ఏంజెలీనా భావిస్తోంది. దత్తత తీసుకున్న వాళ్ల సహా బ్రాడ్, జోలీ జంటకు ఆరుగురు పిల్లలు. వాళ్లతో బ్రాడ్ కఠినంగా వ్యవహరిస్తూ, తరచూ చేయి చేసుకోవడం నచ్చనందువల్లే అతనికి దూరంగా ఉండాలని అప్పట్లో ఏంజెలీనా నిర్ణయించుకుంది. ప్రస్తుతం తన ప్రవర్తన మార్చుకోవడానికి బ్రాడ్ అంగీకరించాడనీ, అందువల్లే ఏంజెలీనా విడాకుల వ్యవహారంలో రెండో ఆలోచన చేస్తోందనీ చెప్పుకుంటున్నారు.



బ్రాడ్ పిట్, ఏంజెలీనా జోలీ

డైలీ సుడోకు - 152

			2	3				
	6	8	1					2
2	4				9			
6				5			2	7
3								1
1	2			8				5
			5				1	9
5					2	7	4	
				9	7			

ఎలా పూరించాలి?

ప్రతి బాక్సులోనూ 9 గళ్లు ఉంటాయి. నిలువుగానూ, అడ్డంగానూ ప్రతి లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి. ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

నిన్నటి సుడోకు- 151 సమాధానం

దేవుడికి కృతజ్ఞతలు

నివేదన



నయా హవా

వారెవ్వా ఏమి ఫేసు!



హెల్దీ వెయిట్

తగ్గాలంటే...

బరువు పెరగడం, తగ్గడం కన్నా బరువు నియంత్రణలో ఉంచుకోవడం చాలా కష్టం. ఆరోగ్యకరమైన బరువు ఉండటానికి ప్రయత్నాలు చేస్తుంటే కనుక ఈ కింది వాటిని ప్రయత్నించండి. శరీర బరువును నియంత్రణలో ఉంచుకోవడానికి ఈ సూచనలు బాగా ఉపయోగపడతాయి.

తగినంత కార్బోహైడ్రేట్లు : బరువు నియంత్రణలో ఉండాలంటే రోజూ తగినన్ని కార్బోహైడ్రేట్లు చాలా అవసరం. బరువు పెరుగుతున్నామని కార్బోహైడ్రేట్లు తీసుకోకుండా ఉండటం సరియైనది కాదు.

పండ్లు : ఆపిల్స్, పీర్స్, బెర్రీలు వంటివి తీసుకోవాలి. ఈ పండ్లలో ఫ్లేవనాయిడ్స్ అధిక మొత్తంలో ఉంటాయి. ఇవి మంచి యాంటీ ఆక్సిడెంట్లుగా ఉపయోగపతాయి. వీటిలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలుంటాయి.

పీచుపదార్థాలు అధికంగా: ఆకుకూరలు, పండ్లు, తృణధాన్యాలు రోజువారి మెనూలో ఉండేలా చూసుకోవాలి. లీన్‌ప్రొటీన్ లభించే ఆహారం తీసుకోవడం వల్ల ఎక్కువ సమయం పొట్ట నిండుగా ఉన్న ఫీలింగ్ ఉంటుంది. ఫలితంగా మధ్య మధ్యలో ఆకలి వేయడం, చిరుతిళ్లు తినడం తగ్గుతుంది.

క్యాలరీలు లెక్కించండి : బరువు నియంత్రణలో ఉండాలంటే రోజు తీసుకునే క్యాలరీలపైన దృష్టి పెట్టాలి. దానికనుగుణంగా రోజువారి మెనూ ప్లాన్ చేసుకోవాలి. వీక్లీ మెనూ ప్లాన్ చేసుకోవడం వల్ల అధికంగా తినడం తగ్గించుకోవచ్చు.

పంచదారకు ప్రత్యామ్నాయం : పంచదారను నేరుగా వాడకుండా తేనె వంటి ప్రత్యామ్నాయ పదార్థాలను వాడటంపై దృష్టి పెట్టాలి. బరువు పెరగడానికి పంచదార ముఖ్య కారణం.

బ్రేక్‌ఫాస్ట్ మరువద్దు : బ్రేక్‌ఫాస్ట్ చేయకుండా ఉండకూడదు. రోజూ పోషకాలతో కూడిన బ్రేక్‌ఫాస్ట్ తీసుకోవడం వల్ల జీవక్రియల పనితీరు బాగుండి అధికంగా కొవ్వు పేరుకుపోవడం జరగదు.

అరగంట వ్యాయామం : ప్రతిరోజు అరగంట సమయం వ్యాయామంకు కేటాయించండి. క్యాలరీలు ఖర్చు కావడానికి వ్యాయామం ఉపకరిస్తుంది. జీవక్రియల రేటు మెరుగుపడుతుంది.








బాలకృష్ణ

ఆడియోకి పైసా వసూల్!

సినిమా ప్రారంభోత్సవం రోజున విడుదల తేదీని ప్రకటించడం చిత్రపరిశ్రమలో జరుగుతున్న విషయమే. అయితే ముందు ప్రకటించిన విడుదల తేదీ కంటే ఓ నెల రోజుల ముందే రాబోతున్నది మాత్రం 'పైసా వసూల్' చిత్రమే. బాలకృష్ణ హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో భవ్య క్రియేషన్స్ అధినేత వి.ఆనందప్రసాద్ నిర్మించిన సినిమా 'పైసా వసూల్' సెప్టెంబర్ ఒకటిన విడుదల కానుంది. ఈ నెల 17న ఖమ్మంలో అభిమానుల సమక్షంలో ఈ చిత్రం ఆడియో వేడుక జరగనుంది. ఈ వేడుకలో పాల్గొనడానికి బాలకృష్ణ, పూరి జగన్నాథ్, ఆనందప్రసాద్, హెలికాప్టర్‌లో వెళ్లనున్నారు.

ఆడియో వేదికపైనే సినిమా ట్రైలర్‌ను కూడా రిలీజ్ చేస్తారు. ఈ విషయాన్ని నిర్మాత ఆనందప్రసాద్ వెల్లడిస్తూ 'ప్రస్తుతం రీరికార్డింగ్ జరుగుతోంది. అందరి అంచనాలు అందుకొనే విధంగా సినిమా రూపుదిద్దుకుంటోంది. అనూప్ రూబెన్స్ స్వరపరిచిన పాటలను ఈ నెల 17న ఖమ్మంలో విడుదల చేస్తాం' అని చెప్పారు.


రవితేజ

రాజా ఎందులో గొప్ప?

రవితేజ కథానాయకుడిగా దిల్ రాజు నిర్మిస్తోన్న చిత్రం 'రాజా ది గ్రేట్'. ఇదివరకు 'పటాస్', 'సుప్రీమ్' సినిమా ల దర్శకుడు అనిల్ రావిపూడి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. 'కృష్ణగాడి వీరప్రేమ గాథ' ఫేమ్ మెహరీన్ నాయిక. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్ పరిసరాల్లో జరుగుతోంది. ఆగస్ట్ 15న స్వాతంత్ర్యదినాన్ని పురస్కరించుకొని టీజర్‌ను ఆవిష్కరించనున్నారు. 'వెల్ కమ్ టు మై వరల్డ్' అంటోన్న రవితేజ ఈ చిత్రంలో అంధుడిగా కనిపించనుండటం గమనార్హం.

మంచి భవిష్యత్తు ఉందన్నారు

- మిర్యాల రవీందర్ రెడ్డి



"కథ మీద మేం పెట్టిన నమ్మకం నిజమైంది. విడుదలైన అన్ని చోట్ల నుంచీ పాజిటివ్ రెస్పాన్స్ వస్తోంది. అల్లు అరవింద్‌గారు ఫోన్ చేసి 'సినిమా మీదున్న పాషన్‌తో మంచి సినిమా తీశావ్! నిర్మాతగా మంచి భవిష్యత్తు ఉంది" అనడం ఆనందంగా ఉంది" అని మిర్యాల రవీందర్ రెడ్డి అన్నారు. ఆయన నిర్మాతగా బెల్లంకొండ శ్రీనివాస్, రకుల్, ప్రగ్యాజైస్వాల్ నటీనటులుగా బోయపాటి శ్రీను దర్శకత్వం వహించిన 'జయ జానకి నాయక' చిత్రం ఇటీవల ప్రేక్షకుల ముందుకొచ్చింది. సినిమాకు వస్తోన్న స్పందన గురించి నిర్మాత విలేకర్లతో మాట్లాడుతూ "బెల్లంకొండ శ్రీనివాస్ కెరీర్‌లో గుర్తుండిపోయే సినిమా అవుతుందనీ బలంగా నమ్మాడు. అదే నిజమైంది. బోయపాటి యాక్షన్ సీన్స్ బాగా తెరకెక్కించారు. దేవిశ్రీ సంగీతం సినిమాను మరోస్థాయికి తీసుకెళ్లింది. ప్రతి పాత్రకు మంచి స్పందన వస్తోంది. భవిష్యత్తులో కూడా కథను నమ్మి సినిమాలు తీస్తా. బోయపాటితో ఇంకో సినిమా చేసే అవకాశం ఉంది. రెండు కథలు చర్చల దశలో ఉన్నాయి. ఆ వివరాలు త్వరలో తెలియజేస్తా" అని అన్నారు.



దానికీ సమయం రావాలి

-అలియా

ప్రతిభావంతురాలైన తారగా బాలీవుడ్‌లో అలియా భట్ అచిర కాలంలోనే మంచి పేరు తెచ్చుకుంది. ఆమెతో సినిమాలు చేయడానికి నిర్మాతలు, దర్శకులు ఉత్సాహం చూపిస్తున్నారు. తాజాగా అలియా, సిద్ధార్థ్ మల్హోత్రా జోడీగా 'ఆషిఖి 3' రానున్నదనీ, ఆ చిత్రాన్ని అలియా తండ్రి మహేశ్‌భట్ నిర్మిస్తారనీ వార్తలు వచ్చాయి. అయితే ఆ సినిమా చేయాలని అలియా భావించట్లేదంటూ ఇంటర్నెట్‌లో విరివిగా ప్రచారమైంది. దీనిపై ఎట్టకేలకు స్పందించింది అలియా. "నేనెప్పుడూ ఎక్కడా 'ఆషిఖీ 3' చేయాలని లేదని చెప్పలేదు. ఈ ప్రచారం ఎక్కడ్నించి వచ్చిందో తెలీదు. 'ఆషిఖి' అనేది ప్రత్యేకమైన బ్రాండ్. మా నాన్నతో తొలిసారి కలిసి పనిచేసే అవకాశం రావడం అంతే ప్రత్యేకం. ప్రతి దానికీ ఒక సమయం వస్తుంది. ఈ సినిమాకి కూడా" అని ట్వీట్ చేసింది.





గ్రామ రెవెన్యూ వ్యవస్థకు చెల్లుచీటీ?

(మొదటి పేజీ తరువాయి)

అధికార కేంద్రంగా తీర్చిదిద్దాలని యోచిస్తున్న ముఖ్యమంత్రి.. తొలి దశలో గ్రామ రెవెన్యూ సహాయకు(వీఆర్‌ఏ)లను, మలి దశలో గ్రామ రెవెన్యూ అధికారు(వీఆర్‌ఓ)లను వ్యవసాయ శాఖలో విలీనం చేయనున్నారు. అప్పుడు వీరంతా గ్రామ స్థాయిలో సమాఖ్య అ ధ్యక్షుడి కింద పని చేయాల్సి ఉంటుంది. సమాఖ్యలో వీరిని సభ్య కార్యదర్శిగా పరిగణనలోకి తీసుకునే అవకాశాలున్నాయి. గ్రామాల్లో కొనసాగిన పటేల్, పట్వారీ వ్యవస్థను ఎన్టీఆర్ ముఖ్యమంత్రి కాగానే రద్దు చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు సీఎం కేసీఆర్ కూడా వీఆర్‌ఏ, వీఆర్‌వో వ్యవస్థకు చరమగీతం పాడనున్నారు.

ఏడాది చివరికల్లా..

వచ్చే ఏడాది రైతులకు ఎకరానికి రూ.4 వేల చొప్పున రెండు పంటలకు రూ.8 వేల పంట సాయం అందించాలని నిర్ణయించిన ముఖ్యమంత్రి కేసీఆర్.. 90 రోజులపాటు భూముల స్పెషల్ డ్రైవ్ చేయించనున్నారు. ఇందులో భాగంగా ప్రయోగాత్మకంగా రెండు జిల్లాల్లోని మూడు గ్రామాల్లో శనివారం నుంచి భూముల రీ-సర్వే చేస్తున్నారు. దీని ఫలితాలు రాగానే రాష్ట్ర వ్యాప్తంగా రికార్డుల అప్‌డేషన్/ప్యూరిఫికేషన్‌పై వారం రోజుల్లో సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకోనున్నారు. గ్రామ స్థాయిలో రికార్డుల వడపోత పూర్తవుతుందని, ఆ తర్వాత రికార్డులను గ్రామ రైతు సమాఖ్య చేతిలోనే పెట్టాలని విధాన నిర్ణయం కూడా తీసుకున్నారు. ఎప్పటికప్పుడు భూముల లావాదేవీలు పరిశీలించడమే కాకుండా.. రికార్డుల నవీకరణలో సమాఖ్య పాత్రను విస్తృతం చేసే అవకాశాలున్నాయి.

ఆ డ్యూటీలెవరికి!?

కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలతోపాటు వృద్ధాప్య, వితంతు, వికలాంగ పింఛన్లు, కుల, ఆదాయ, స్థానిక ధ్రువీకరణ పత్రాల దరఖాస్తుల పరిశీలన, జమాబందీ, తైబందీ, భూముల రక్షణ వంటి కీలక పనులను వంటి అన్ని రకాల విధులను గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్‌ఏ) చేపడుతుంటారు. గ్రామ రెవెన్యూ వ్యవస్థను రద్దు చేస్తే ఇప్పటిదాకా వారు నిర్వర్తిస్తున్న బాధ్యతలను ఎవరు చేపడతారనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, ప్రభుత్వ నిర్ణయంపై రెవెన్యూ సంఘాలు మండిపడుతున్నాయి.

వీఆర్‌ఏలకు పదోన్నతి కల్పించాలి

హైదరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నియమితులైన గ్రామ రెవెన్యూ సహాయకుల(వీఆర్‌ఏ)కు పదోన్నతి కల్పించాలని టీఎస్ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ వీఆర్‌ఏల సంఘం కోరింది. ఈ మేరకు ఉపముఖ్యమంత్రి మహమూద్‌అలీని సంఘం నాయకులు ఈశ్వర్, కరుణాకర్ తదితరులు శనివారం కలిసి వినతిపత్రం అందించారు.



కేసీఆర్.. ఓ సామాజిక ఇంజనీర్: కర్నె

హైదరాబాద్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): సాగునీటి ప్రాజెక్టులను నిండుకుండల్లా మార్చేందుకు సీఎం కేసీఆర్ ఇంజనీర్‌లానే పనిచేస్తున్నారని, ఆయన్ను ఇంజనీర్ అన్నందుకు టీ.కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ భట్టి విక్రమార్కకు టీఆర్ఎస్ఎల్పీ పక్షాన ధన్యవాదాలు చెబుతున్నామని ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ అన్నారు. ప్రజలు కొన్నేళ్లుగా కేసీఆర్‌ను సామాజిక ఇంజనీర్‌గా భావిస్తున్నారని, దాన్ని ఇప్పుడు కాంగ్రెస్ నేతలు కూడా అంగీకరించారంటూ సంతోషం వ్యక్తం చేశారు. శ్రీరాంసాగర్ సాగర్ పునరుజ్జీవ సభకు హాజరైన జనసందోహాన్ని చూసి కాంగ్రెస్ నేతలకు మతిభ్రమించిందని ఎద్దేవా చేశారు. ఆయన శనివారం నాడిక్కడ విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమానికి శ్రీరాంసాగర్‌కు విడదీయరాని సంబంధం ఉందని సీఎం కేసీఆర్ గుర్తించారన్నారు. రైతుల సమస్యలు తెలిసిన నేత అయినందునే శ్రీరాంసాగర్‌ను రివర్స్ పంపింగ్ జలాలతో నింపుతున్నారని కొనియాడారు. ఓట్ల కోసం కాంగ్రెస్ వాళ్లు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేస్తే.. నీళ్లతో ప్రాజెక్టులు నింపకుంటే ఓట్లు వేయొద్దంటున్న పాలన టీఆర్ఎస్‌ది అన్నారు.

జనంపై రోగాల ముప్పేట దాడి



హైదరాబాద్‌లోని రెయిన్‌బో ఆస్పత్రిలో మృతిచెందిన రిషి

ఒక వైపు స్వైన్ ఫ్లూ.. మరో వైపు డెంగీ.. ఆస్పత్రులకు రోగుల తాకిడి

- గాంధీలో స్వైన్‌ఫ్లూ ప్రత్యేక వార్డు
- ఫీవర్ ఆస్పత్రికి మొదలైన డెంగీ కేసులు
- గ్రేటర్‌లో ఈ ఏడాది 980 స్వైన్ ఫ్లూ, 38 డెంగీ కేసులు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

స్వైన్ ఫ్లూ విజృంభిస్తోంది. డెంగీ దండెత్తుతోంది. గ్రేటర్‌లో ఏ ఆస్పత్రిలో చూసినా ఈ వ్యాధులతో వచ్చే రోగులే కనబడుతున్నారు. పది రోజులుగా ఈ కేసులు మరింత పెరుగుతున్నాయి. వర్షాలు ఎక్కువై, నగరంలో అపరిశుభ్ర వాతావరణం ఏర్పడడంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో డెంగీ కేసులు ఎక్కువవుతున్నాయి. మరో వైపు వర్షాలతో తేమ వాతావరణం ఏర్పడి ముసుగు కప్పుకుని ఉన్న వైరస్ జడలు విచ్చుకుంది. స్వైన్‌ఫ్లూ కారకమైన హెచ్1ఎన్1 తేమ వాతావరణంలో శక్తిని పుంజుకుని ప్రజలపై దాడి చేస్తోంది. స్వైన్‌ఫ్లూతో ఈ ఏడాది ఆరుగురు చనిపోగా, డెంగీతోనూ మరణాలు సంభవిస్తున్నాయి. గ్రేటర్ పరిధిలో అధికారిక లెక్కల ప్రకారం ఈ ఏడాదిలో డెంగీ కేసులు కేవలం 38 మాత్రమే నమోదయ్యాయి. కానీ ప్రైవేట్ ఆస్పత్రుల్లో రోజుకు నలుగురైదుగురు డెంగీ లక్షణాలతో చేరుతున్నట్లు సమాచారం. అయితే ఈ లెక్కలు అధికారుల దృష్టికి వెళ్లడం లేదు. ఇక ఈ ఏడాదిలో ఇప్పటి దాకా 980 స్వైన్ ఫ్లూ కేసులు నమోదయ్యాయి. గాంధీ ఆస్పత్రిలో పది రోజులుగా స్వైన్ ఫ్లూ కేసులు మరీ ఎక్కువయ్యాయి. ఇప్పటిదాకా ఆస్పత్రిలో పది మంది స్వైన్‌ఫ్లూతో చికిత్స పొందగా, ప్రస్తుతం ముగ్గురు చికిత్స పొందుతున్నారు.

ఇవీ స్వైన్ ఫ్లూ లక్షణాలు

జ్వరం, దగ్గు, జలుబు, ముక్కు నీటి నుంచి నీటిధార నిరంతరంగా రావడం, గొంతు గరగర, ఒల్లు నొప్పులు, అలసట, నీరసం, వాంతులు, విరేచనాలు, ఆకలి లేకపోవడం తదితర సమస్యలు ఉంటే స్వైన్ ఫ్లూగా అనుమానించాలి.

డెంగీతో జర భద్రం

అర్బన్ మస్కిటో వల్ల డెంగీ వ్యాపిస్తుంది. డెంగీ రోగిని కుట్టిన దోమ ఆరోగ్యవంతమైన వ్యక్తిని కుడితే అతడికి డెంగీ వచ్చే ప్రమాదముంది. ప్రస్తుతం ఈ రకం దోమల సంఖ్య భారీగా పెరిగింది. ఈ దోమకు మనిషి రక్తమే ఆహారం. డెంగీ దోమ పగటి పూట మాత్రమే కుడుతుంది. డెంగీ వచ్చిన రోగిలో ఒక్కసారిగా బీపీ తగ్గిపోతుంది. విష జ్వరం తీవ్రంగా మారి ప్లేట్‌లెట్స్ తగ్గిపోయే ప్రమాదం ఉంది.

ఇలా చేయాలి..

ఇంటి మొత్తాన్ని మస్కిటో స్క్రీన్‌తో కవర్ అయ్యే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలి. రాత్రి పూట పడుకునే ముందు దోమ తెరను కచ్చితంగా ఏర్పాటు చేసుకోవాలి. మస్కిటో రిఫిలెంట్స్ తప్పని సరిగ్గా వినియోగించాలి. బయటకు వెళ్లేటప్పుడు ఫుల్ సైజ్ దుస్తులు వేసుకోవాలి. ఇంటిపై ఉండే ట్యాంకులకు మూతలు పెట్టాలి. ఫ్లవర్ వాజ్, కూలర్ నీళ్ళను నిత్యం మార్చాలి. కాలనీ, ఇళ్లలో నిల్వ ఉండే గుంతలను పూడ్చాలి.

జాగ్రత్తలు ఇలా..

- రద్దీ ప్రాంతాల్లో ఎక్కువ సేపు ఉండొద్దు.
- ప్రయాణం చేస్తున్న సమయంలో మాస్కులు ధరించాలి.
- ఆవలింత, తమ్ములు, దగ్గు వచ్చినపుడు నోటికి, ముక్కుకు చేతులను అడ్డంగా పెట్టుకోవద్దు. చేతి రుమాలు వాడాలి.
- జ్వరం, దగ్గు, జలుబు ఉంటే బయట తిరగొద్దు. రెండు మూడు రోజులకు జ్వరం తగ్గకపోతే పరీక్షలు చేయించుకోవాలి.
- దగ్గు, జలుబు, ఇతర జబ్బులున్న వారికి దూరంగా ఉండాలి
- వ్యాధిగ్రస్తులు వాడిన దుస్తులు, వస్తువులను వాడొద్దు.
- స్వైన్‌ఫ్లూ బాధితులకు తగిన చికిత్స అందించాలి. ప్రత్యేక గది కేటాయించాలి. వైద్యుల సలహా ప్రకారమే మందులు వాడాలి.

స్వైన్‌ఫ్లూతో బాలుడు, డెంగీతో మహిళ మృతి

వరంగల్ రూరల్ జిల్లా నల్లబెల్లి మండలం గొల్లపల్లెకు చెందిన బోయిన రిషి(4) అనే బాలుడు స్వైన్ ఫ్లూ సోకి హైదరాబాద్‌లోని రెయిన్‌బో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. నాగర్ కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం నందివడ్డేమాన్‌కు చెందిన కసరి కురుమయ్య(60)కు స్వైన్‌ఫ్లూ సోకింది. దీంతో ఆ గ్రామంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటుచేసి పరీక్షలు చేస్తున్నారు. మరోవైపు, డెంగీ జ్వరంతో ఖమ్మం జిల్లా గొల్లపాడుకు చెందిన జమ్మి మణెమ్మ(38) హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది.



డెంగీతో అప్రమత్తంగా ఉండాలి

సాధారణ జ్వరం వస్తే రెండు, మూడు రోజుల్లో తగ్గిపోతుంది. డెంగీ జ్వరం వస్తే శరీరంపై దద్దుర్లు వస్తాయి. డెంగీ రోగిలో 103 ఫారన్‌హీట్ మించి జ్వరం ఉంటుంది. అనుమానం ఉంటే వెంటనే వైద్యుణ్ని సంప్రదించాలి.

– డాక్టర్ శంకర్, సూపరింటెండెంట్, ఫీవర్ ఆస్పత్రి

2019 వరకు ఇదే టీమ్



కుంతియా, ఉత్తమ్‌లను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

(మొదటి పేజీ తరువాయి)

సీఎల్పీ పదవుల్లో మార్పు చేర్పులు జరుగుతాయని వస్తున్న వార్తలన్నీ ఊహాగానాలేనన్నారు. తామంతా ఇప్పుడు ఎన్నికల్లో విజయాన్ని దృష్టిలో పెట్టుకొని పని చేస్తున్నామని, ఇందుకు పార్టీని బలోపేతం చేసే పనిలో ఉన్నామని తెలిపారు. కాంగ్రెస్ అటు కేంద్రం, ఇటు రాష్ట్రంలో అధికారంలో లేనందున తమ నేతలకు స్వేచ్ఛ ఎక్కువయిందని, త్వరలోనే దానిని అదుపులో పెడతామని అన్నారు. తెలంగాణకు తాను కొత్త కాదని, 2014 నుంచి ఇక్కడ పరిశీలకుడిగా ఉన్నానని తెలిపారు. అందరితో మాట్లాడి బేధాభిప్రాయాలను పరిష్కరించుకుంటామని, కాంగ్రెస్ గెలుపు కోసం కలిసికట్టుగా పని చేస్తామని అన్నారు. రాష్ట్ర నేతలకు ఆదేశాలివ్వడానికి రాలేదని, పార్టీ కోసం ఓ కార్యకర్తగా పని చేసేందుకు వచ్చానని తెలిపారు.

అధికారమే లక్ష్యంగా కార్యాచరణ..

కాంగ్రెస్ 2019లో అధికారంలోకి వచ్చేలా చేయడమే అధిష్ఠానం తనకిచ్చిన ఆదేశమని కుంతియా తెలిపారు. తన కార్యాచరణ కూడా అదే రీతిలో ఉంటుందన్నారు. తాను తాత్కాలిక ఇన్‌చార్జిని కాదని, తనను రాహుల్‌గాంధీ పూర్తి బాధ్యతలతో రాష్ట్రానికి పంపారని స్పష్టం చేశారు. పార్టీలో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వడంలేదనే విషయంపై కుంతియా స్పందిస్తూ.. తమ పార్టీ సంస్థాగత నిర్మాణం చూస్తే అర్థమైపోతుందని, తాము అన్ని సామాజికవర్గాలకు తగిన ప్రాతినిధ్యం కల్పిస్తున్నామని అన్నారు. అయితే కులమతాలకతీతంగా యువత ఎక్కువగా రాజకీయాల్లోకి రావాలని రాహుల్‌గాంధీ కోరుకుంటున్నారని తెలిపారు. టికెట్లు కూడా వారికే ఎక్కువ ఇవ్వాలన్నది ఆయన ఉద్దేశమన్నారు. ఇక తెలంగాణ వల్ల లాభపడింది కేవలం టీఆర్ఎస్ పార్టీ మాత్రమేనని కుంతియా అన్నారు. ప్రజలు ఏం ఆశించి తెలంగాణ కోరుకున్నారో అందులో ఒక్కటి కూడా నెరవేరడం లేదన్నారు. టీఆర్ఎస్‌కు అసలు సిద్ధాంతమే లేదని, ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని ఆరోపించారు. కేసీఆర్, ఆయన కుటుంబం, కొందరు మంత్రులు మాత్రమే తెలంగాణతో లబ్ధి పొందారని అన్నారు.

కిరణ్‌కుమార్‌రెడ్డిని ముందే తప్పించాల్సింది..

తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రాకపోవడానికి కొన్ని కారణాలున్నాయని కుంతియా అన్నారు. వైఎస్ఆర్, కిరణ్‌కుమార్‌రెడ్డి లాంటి ఆంధ్రా నేతల వల్లే తెలంగాణకు అన్యాయం జరుగుతుదని ప్రజలు భావించారని తెలిపారు. తెలంగాణ ఏర్పాటుకు అనుకూలంగా సీడబ్ల్యూసీ నిర్ణయం తీసుకోగానే కిరణ్‌కుమార్‌రెడ్డిని ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పించి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయమని, రాష్ట్రంలో కాంగ్రెస్ తప్ప వేరే ప్రత్యామ్నాయమే లేదని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు బలం లేదంటున్న సీఎం కేసీఆర్‌కు.. నిజంగా ఆయన మాటలపై నమ్మకముంటే రాజీనామాలు చేసి ఎన్నికలకు రావాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి అభ్యర్థిని ఎన్నికలకు ముందు ప్రకటించే సంప్రదాయం కాంగ్రెస్‌లో లేదన్నారు. అధిష్ఠానం దూతగా వారు చెప్పిన విషయాల్ని రాష్ట్ర నాయకత్వానికి, ఇక్కడి పనితీరును అధిష్ఠానానికి వివరించడమే తన పని అని చెప్పారు. ప్రస్తుతం టీపీసీసీ బాగా పని చేస్తోందని, ఏఐసీసీ, రాహుల్ సంతృప్తిగా ఉన్నారని తెలిపారు. ఇక పార్టీని వీడిన వారిని తిరిగి తీసుకునే విషయంలో వ్యక్తులను బట్టి నిర్ణయాలు ఉంటాయన్నారు. కుంతియాకు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ నేతృత్వంలో ఆ పార్టీ నేతలు ఘనస్వాగతం పలికారు. షబ్బీర్ అలీ, క్యామ మల్లేశ్ తదితరులు హాజరయ్యారు.



చిన్నగుండవెల్లిలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

గోదారి నీళ్లొస్తేనే గోస తీరుతుంది

- సంవత్సరం వరకు కాలువల ద్వారా సాగునీరిస్తాం
- భారీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట రూరల్: సకాలంలో వర్షాలు కురవకపోవటం వల్ల చెరువుల్లోకి నీళ్లు రాలేదని భారీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. శనివారం సిద్దిపేట జిల్లాలోని చిన్నగుండవెల్లి గ్రామంలో ఆయన పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఆనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. మరో సంవత్సరంలో సిద్దిపేట ప్రాంతానికి కాళేశ్వరం, మేడిగడ్డల నుంచి నీటిని తెచ్చి కాల్వల ద్వారా పంటల సాగుకు నీరు అందిస్తామన్నారు. గోదావరి నీళ్ల వస్తేనే శాశ్వతంగా నీళ్ల గోస తీరుతుందని అన్నారు. బోర్లు, బావుల్లో నీటి మట్టం తగ్గి పంటలు ఎండిపోయాయన్నారు. వర్షాల కోసం మొక్కలు నాటి సంరక్షించవలసిన బాధ్యత అందరిపైనా ఉందని చెప్పారు. ప్రాణహిత, చేవేళ్ల ప్రాజెక్టుల ద్వారా సాగునీటి సరఫరా చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నానని రు. ప్రస్తుతం జరుగుతున్న ప్రాజెక్టు టన్నెల్ (సొరంగ మార్గం) నిర్మాణ పనులు పూర్తికావడానికి, సుమారు ఐదారు సంవత్సరాలు పడుతుందని, కానీ రెండున్నర సంవత్సరాలలోనే పూర్తి చేయబోతున్నామని తెలిపారు.

ప్రాజెక్టులను అడ్డుకుంటే రైతులు ఊర్కోరు

- కోదండరాం ఈ విషయాన్ని గుర్తించాలి: పోచారం



హైదరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సాగునీటి ప్రాజెక్టులపై కేసులు వేస్తూ అడ్డుకుంటుంటే రైతులు ఊరుకోరని వ్యవసాయశాఖామంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జేఏసీ చైర్మన్ కోదండరాం యాత్రను అడ్డుకుంటోంది రైతులేనని, ఇందులో టీఆర్ఎస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదన్నారు. కాంగ్రెస్ ఆలోచనలు, కోదండరాం ఆలోచనలు ఒకటే విధంగా ఉన్నాయని విమర్శించారు. శనివారం టీఆర్ఎస్ఎల్పీలో విలేకరులతో ఆయన మాట్లాడారు.ప్రాజెక్టుల నిర్మాణంలో ప్రభుత్వానికి సహకరించాలే కాని... రైతులను రెచ్చగొట్టొదని కోరారు. పాత ప్రాజెక్టుల ఆధునీకరణ, చెరువుల పునరుద్ధరణ, కొత్త ప్రాజెక్టుల నిర్మాణం.. మూడంచెల వ్యూహంతో ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నారని సీఎం కేసీఆర్‌ను కొనియాడారు. రైతు బాగుపడటం ఓర్వలేకనే కాంగ్రెస్ నేతలు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు .ప్రాజెక్టుల రీడిజైనింగ్‌కు కావాల్సింది ఇంజనీరింగ్ పట్టా కాదని.. రైతు సంక్షేమం పట్ల నిబద్ధత అని మిషన్‌భగీరథ వైస్ చైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి మాట్లాడుతూ అధికారంలో ఉన్నపుడు రివర్స్ పంపింగ్ ఆలోచన ఎందుకు చేయలేదని కాంగ్రెస్‌ను ప్రశ్నించారు.

బాబా.. బాబా.. పతంజలి!

రాందేవ్ ఉత్పత్తుల్లో నాణ్యతా లోపం.. శివలింగ విత్తనాల్లో ఇతర పదార్థాలు

- క్షార గుణం తక్కువైన ఆమ్ల జ్యూస్
- నిర్ధారించిన హరిద్వార్ ఆయుర్వేద, యునానీ కార్యాలయం
- ఆమ్ల జ్యూస్ నిషేధించిన సీఎస్‌డీ క్యాంటీన్లు



హైదరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పతంజలి! ఇప్పుడో బ్రాండ్! యోగా గురు రాందేవ్ బాబా స్వదేశీ మంత్ర! పక్కా వ్యాపారానికి దేశభక్తిని జోడించి వేల కోట్ల వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించారు! దేశభక్తి ఉన్న ప్రతి ఒక్కరూ పతంజలి ఉత్పత్తులను కొనాలని ప్రచారం చేస్తున్నారు. కార్పొరేట్ కంపెనీల గుండెల్లో గుబులు పుట్టించడమే కాదు.. ఇప్పుడు వాటికి దీటుగా పేపర్లు, టీవీలు, ఇంటర్నెట్‌లో విస్తృత ప్రచారమూ చేస్తున్నారు. మరి, పతంజలి ఉత్పత్తుల్లో నాణ్యత లేదా!? వాళ్లు చెబుతున్న పదార్థాలు వాళ్లు అమ్మే ఉత్పత్తుల్లో లేవా!? ఇచ్చే ప్రకటనకు; అమ్మే ఉత్పత్తికి పొంతన లేదా!? దంత కాంతిలో కాంతి లేదా!? చూర్ణం తింటే జీర్ణం కాదా!? ఆమ్ల జ్యూస్ ప్రకటనంతా గ్యాసేనా!? ఈ ప్రశ్నలన్నిటికీ 'ఔను' అన్న జవాబే వస్తోంది. పతంజలి ఉత్పత్తుల్లో సరైన ప్రమాణాలు లేవని సమాచార హక్కు చట్టం కింద వెల్లడైంది. 2013 నుంచి 2016 మధ్య కాలంలో పతంజలి ఉత్పత్తి చేసిన 82 రకాల ఉత్పత్తుల శాంపిల్స్‌ను హరిద్వార్‌లోని ఆయుర్వేద, యునానీ కార్యాలయం సేకరించింది. వాటికి నాణ్యతా పరీక్షలు నిర్వహించింది. 40 శాతం పతంజలి ఉత్పత్తుల్లో నాణ్యత కొరవడిందని పరీక్షల్లో తేలింది. పతంజలి నుంచి సేకరించిన 82 శాంపిల్స్‌లో 32 ఉత్పత్తులు నాసిరకమైనవేనని తేలింది. దివ్య ఆమ్ల జ్యూస్‌లో ఉండాల్సిన దానికంటే క్షారగుణం తక్కువ ఉంది. దీనిని తాగితే ఎసిడిటీ ఎక్కువ కావడమే కాదు. ఇతర అనారోగ్య సమస్యలూ వస్తాయని ఉత్తరాఖండ్ ప్రభుత్వ ల్యాబ్ రిపోర్టు వెల్లడించింది. శివలింగ బీజాల్లో 31.68 శాతం అన్య పదార్థాలు కలిసిపోయాయి. అద్భుతంగా పని చేస్తుందని దంత కాంతి విషయంలో పతంజలి ప్రచారం చేసింది కానీ, నిరూపించలేకపోయిందని అడ్వర్టైజింగ్ స్టాండర్డ్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తేల్చి చెప్పింది. ఈ ప్రచారం మోసం కిందకు వస్తుందని స్పష్టం చేసింది. వంటకు ఉపయోగించే, తలకు వాడే నూనెల విషయంలోనూ పతంజలి తప్పుడు ప్రకటనలు ఇచ్చిందని వివరించింది. లేని పదార్థాలు ఆయా ఉత్పత్తుల్లో ఉన్నట్లు తప్పుడు ప్రకటనలు ఇచ్చి వినియోగదారులను తప్పుదారి పట్టించిందని తప్పుబట్టింది. మరో విశేషం ఏమిటంటే, ఇటీవల పతంజలి సంస్థ నూడుల్స్‌ను మార్కెట్లోకి తెచ్చింది. కానీ, వాటిలో నాణ్యత లేదని విమర్శలు వచ్చాయి. అసలు ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే ఉత్పత్తులను అది మార్కెట్లోకి విడుదల చేస్తోందని ఆరోపణలున్నాయి. తమ ఉత్పత్తులు వాడితే మగపిల్లలు పుడతారంటూ కొద్ది రోజుల కిందట రాందేవ్ బాబా చేసిన ప్రచారం తీవ్ర వివాదాస్పదమైంది కూడా.

జీతాలు ఇవ్వరు

సేవా భావంతో పని చేయాలంటూ పతంజలి సంస్థల్లో ఉద్యోగులకు నూరిపోస్తారు. సరిగా జీతాలు కూడా ఇవ్వరు. అదేమంటే దేశభక్తితో పని చేయాలంటారు. వాళ్లు మాత్రం పక్కా వ్యాపారం చేస్తారు. రాందేవ్ మాటలు-చేతలకు పొంతన ఉండదు. పతంజలి ఆయుర్వేద, పతంజలి ఫుడ్‌పార్క్‌లో విధులు నిర్వర్తించాను. ఉద్యోగులకు సరైన అర్హతలే ఉండవు.

– పతంజలి మాజీ సీఈవో ఎస్కే పాత్రో

ప్రచారంలో తప్పుడు ప్రకటనలు

తన ఉత్పత్తులకు సంబంధించిన ప్రచారాల్లో పతంజలి తప్పుడు ప్రకటనలు ఇస్తోందని అడ్వర్టైజింగ్ స్టాండర్డ్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఏఎస్‌సీఐ) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. వంటకు వాడే, తలకు రాసే నూనెల విషయంలో తప్పుడు ప్రకటనలు ఇచ్చిందని మండిపడింది. అయితే, పతంజలిపై ఆరోపణలు ఇప్పుడే కొత్త కాదు. ప్రజలను తప్పుదోవ పట్టించేలా ప్రకటనలు రూపొందించినందుకు హరిద్వార్ కోర్టు రూ.11 లక్షల జరిమానా కూడా విధించింది.నిజానికి, పతంజలి అనగానే బాబా రాందేవ్ గుర్తుకు వస్తారు. కానీ, ఆ సంస్థను స్థాపించింది నేపాల్‌కు చెందిన బాలకృష్ణ. పదేళ్ల కిందట 60 కోట్లతో పతంజలిని స్థాపించారు. ఇప్పుడు దాని విలువ రూ.25.6 వేల కోట్లు. గతంలో ఆయనపై చీటింగ్, ఫోర్జరీ, మనీ లాండరింగ్ కేసులు నమోదయ్యాయి. యూపీఏ హయాంలో 2011లో ఆయన అరెస్టయ్యారు కూడా. ఆ తర్వాత అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఆయన భారత పౌరసత్వం కూడా అనుమానమే నంటూ సీబీఐ కేసు కూడా పెట్టింది. కాగా, బీజేపీ ప్రభుత్వ ఏర్పాటుతో దేశవ్యాప్తంగా పతంజలికి భూకేటాయింపులు జరిగాయి.

పతంజలి ప్రతిష్ఠ దెబ్బతీసేందుకే: బాలకృష్ణ

ఉత్తరాఖండ్, పశ్చిమబెంగాల్ ప్రభుత్వ ల్యాబ్ రిపోర్టులను పతంజలి ఎండీ బాలకృష్ణ తప్పుబట్టారు. శివలింగ విత్తనాల్లో ఇతర పదార్థాలను కలిపి కల్తీ చేయాల్సిన అవసరం తమకు లేదన్నారు. పతంజలి ప్రతిష్ఠను దెబ్బతీసేందుకే నాణ్యతా పరీక్ష బృందాలు తప్పుడు నివేదికలను అందించాయని ఆరోపించారు.

పతంజలి ఉత్పత్తులపై నిషేధాలు

సైనిక బలగాలకు రక్షణ శాఖ నిర్వహించే సీఎస్‌డీ క్యాంటీన్లలో పతంజలి ఆమ్ల జ్యూస్‌ను ఏప్రిల్ నుంచి నిషేధించారు. అంతేనా, పతంజలికే చెందిన ఆరు ఉత్పత్తులను నేపాల్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ నిషేధించింది. ఉత్తరాఖండ్‌కు చెందిన దివ్య ఫార్మసీ ద్వారా అమ్మకాలు జరుపుతున్న ఆరు పతంజలి ఉత్పత్తుల్లో నాణ్యత లోపించిందని నేపాల్ ఏకంగా బహిరంగ ప్రకటన విడుదల చేసింది. పతంజలికే చెందిన ఆమ్ల చూర్ణ, దివ్య గషార్ చుర్ణ, బహుచీ చూర్ణ, త్రిఫల చూర్ణ, అశ్వగంధ, అద్విలియ, అవిపట్టికర, తలిసద్య, పశ్యనాగ, లవణ భాస్కర వంటి చూర్ణాలు నాణ్యతా పరీక్షల్లో విఫలమయ్యాయని నేపాల్ ప్రకటించింది.

కార్పొరేటర్.. డర్టీ పిక్చర్!

- జీహెచ్ఎంసీ కార్పొరేటర్ల గ్రూపులో పోర్న్ వీడియో

బంజారాహిల్స్/హైదరాబాద్, ఆగస్టు 12: "కార్పొరేటర్‌గా డివిజన్‌లో సమస్యలు పరిష్కరించడం చేతగాదు గానీ.. ఇలాంటి పాడు పనులు మాత్రం బాగా అబ్బినట్టున్నాయి"... "ఓ ప్రజాప్రతినిధికి మరీ ఇంత దిగజారుడు తనమా?".. ఇవన్నీ హైదరాబాద్‌లోని వెంగళరావునగర్ డివిజన్‌కు చెందిన అధికార టీఆర్ఎస్ కార్పొరేటర్ కిలారి మనోహర్‌పై సామాజిక మాధ్యమాల్లో వెల్లువెత్తుతున్న ఛీత్కారాలు.. ఆగ్రహావేశాలు! ఇంతకీ ఆయన చేసిన తప్పేంటంటారా? ఉద్దేశపూర్వకంగానో.. పొరపాటుగానో కానీ ఆయన ఓ వాట్సప్ గ్రూప్‌లో ఈనెల 1న పోర్న్ వీడియోను షేర్ చేశాడు. అది కూడా 'జీహెచ్ఎంసీ కార్పొరేటర్ల' గ్రూప్‌లో! ఆ గ్రూప్‌లో 99మంది టీఆర్ఎస్ కార్పొరేటర్లు, జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు సహా మంత్రి కేటీఆర్, ఎంపీ కవిత సభ్యులుగా ఉన్నారు. ఈ అశ్లీల వీడియో పోస్ట్ చేసిన 15నిమిషాల తర్వాత గానీ మనోహర్ పొరపాటు గుర్తించలేదు. తర్వాత నాలుక్కరుచుకొని "రాంగ్ పోస్ట్" అంటూ గ్రూప్‌లో ఓ మెసేజ్ పెట్టారు. కానీ అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. కొందరు కార్పొరేటర్లు ఏదో వీడియో అనుకొని డౌన్‌లోడ్ చేసుకొని చూసి కంగుతిన్నారు. ఒకరిద్దరైతే ఫోన్‌చేసి చెడామడా వాయించేశారు. విషయం మంత్రి కేటీఆర్, ఎంపీ కవిత దృష్టికి వెళ్లడంతో వారు మనోహర్‌కు ఫోన్‌కు చేసి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. అన్నివైపుల నుంచీ విమర్శలు రావడంతో మనోహర్ నష్ట నివారణ చర్యలకు దిగారు. "అశ్లీల వీడియోను నేను పోస్టు చేయలేదు. నా మీద కక్షతో మా డ్రైవర్ చేసిన పని ఇది" అంటూ గ్రూప్ సభ్యులకు సంజాయిషీ ఇచ్చుకున్నారు. అయినా.. ఫోన్లు కూడా వస్తుండటంతో విధిలేక స్విచ్ ఆఫ్ చేసుకున్నట్టు సమాచారం. గ్రూప్‌లోని మహిళా సభ్యులైతే మనోహర్ తీరును తీవ్రంగా అసహ్యించుకుంటున్నారు. వీడియో చూసి రోజంతా అన్యమనస్కంగా అనిపించిందని ఓ మహిళా కార్పొరేటర్ వాపోయారు. జీహెచ్ఎంసీ కౌన్సిల్ హాల్‌లో కనిపించినప్పుడు మనోహర్ చాలా మర్యాదగా మాట్లాడేవారని, అలాంటిది ఆయనకు ఇదేం పోయేకాలం అని ఈసడించుకున్నారు. మరో మహిళా కార్పొరేటర్ మాత్రం సదరు కార్పొరేటర్ చాలా మంచి వారని ఎక్కడో తప్పు జరిగి ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఓ మహిళా కార్పొరేటర్ భర్త.. "అన్నా....మేము చూసినం కాబట్టి సరిపోయింది. ఇంట్లో ఆడోళ్లు చూసి ఉంటే ఇబ్బంది కరంగా ఉండేదన్నా. అయినా గిసుంటి వేషాలేందన్నా" అని వాపోయారు.

మహిళా సంఘాలు పోలీసులకు ఫిర్యాదు

కార్పొరేటర్ మనోహర్ వాట్సప్ గ్రూప్‌లో పోస్ట్ చేసిన పోర్న్ వీడియో వివాదాస్పదంగా మారుతోంది. దీనిపై న్యాయ పోరాటం చేసేందుకు మహిళా సంఘాలు, ప్రజా సంఘాలు సిద్ధమవుతున్నాయి. న్యాయ వాదుల సంఘం సుమోటో కింద కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అలాగే మనోహర్‌పై పోలీసులకు పిర్యాదు చేసేందుకు రెడీ అవుతున్నారు.

పేరుకుపోయిన పారిశ్రామిక ప్రోత్సాహకాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి) పారిశ్రామిక ప్రోత్సహకాల విడుదలపై తెలంగాణ ప్రభుత్వం తాత్సారం చేస్తోంది. ఒక వైపు బ్యాంకులు బకాయిలు చెల్లించాలని నోటీసులపై నోటీసులు జారీ చేస్తుండగా పావలా వడ్డీ, పవర్ సబ్సిడీ, పెట్టుబడి రాయితీ, రిజిస్ట్రేషన్ ఫీజుల మినహాయింపు వంటి ప్రోత్సహకాల కింద విడుదల చేయాల్సిన నిధుల విషయంలో ప్రభుత్వం విపరీతమైన జాప్యం చేస్తోందనిచిన్న, మధ్య తరహా పారిశ్రామికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యాపార, వాణిజ్య రంగంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు పలు సంస్కరణలు ప్రవేశపెట్టి సింగిల్ విండో విధానంలో అన్నిరకాల అనుమతులను మూడు నుంచి నాలుగు వారాల్లో ఆన్‌లైన్‌లోనే జారీ చేస్తున్నట్టు ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వం పారిశ్రామిక ప్రోత్సహకాల విడుదలలో మాత్రం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని పారిశ్రామికవేత్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రోత్సాహకాల కింద పేరుకుపోయిన బకాయిల మొత్తం 1,175 కోట్ల రూపాయలుగా ఉంది.



జోయాలుక్కాస్.. బాలీవుడ్ నటి కాజోల్ దేవగన్‌ను ప్రచారకర్తగా నియమించుకుంది. ఈమె ప్రచారంతో సంస్థ ప్రతిష్ఠ మరింత పెరుగుతుందని జోయాలుక్కాస్ ఛైర్మన్ జోయ్ అలుక్కాస్ అన్నారు. చిత్రంలో కాజోల్‌తో జోయాలుక్కాస్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జాన్ పాల్ అలుక్కాస్, డైరెక్టర్ సోనియా అలుక్కాస్.

ఆర్‌కామ్ నష్టం రూ.1,210 కోట్లు

న్యూఢిల్లీ: రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో 1,210 కోట్ల రూపాయల కన్సాలిడేటెడ్ నష్టాలను మూటగట్టుకుంది. రుణ సంక్షోభంలో కూరుకుపోయిన ఆర్‌కామ్ నష్టాలను ప్రకటించటం వరుసగా ఇది మూడోసారి. గత ఏడాది ఇదే కాలంలో కంపెనీ నికర లాభం 90 కోట్ల రూపాయలుగా ఉంది. రిలయన్స్ జియో ప్రవేశంతో టారిఫ్ యుద్ధానికి తెరలేచిందని దీంతో సంస్థపై తీవ్ర ఒత్తిడి పడిందని ఆర్‌కామ్ తెలిపింది. ప్రస్తుతం నెలకొన్న గట్టిపోటీతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో టెలికాం రంగంపై గణనీయమైన ప్రభావం చూపించనుందని పేర్కొంది. కాగా త్రైమాసిక సమీక్షాకాలంలో కంపెనీ కన్సాలిడేటెడ్ రాబడులు కూడా 33 శాతం క్షీణించి 5,361 కోట్ల రూపాయల నుంచి 3,591 కోట్ల రూపాయలకు పడిపోయాయి. ఇరవై ఏళ్ల తర్వాత టెలికాం రంగంలోని కంపెనీల రాబడులు భారీగా తగ్గాయని తెలిపింది. జూన్ త్రైమాసికం ముగిసే నాటికి కంపెనీ రుణ భారంఎంతనేది వెల్లడించలేదు. అయితే గత ఏడాది డిసెంబరు నాటికి కంపెనీ రుణ భారం 45 వేల కోట్ల రూపాయలుగా ఉంది. కాగా, ఎయిర్‌సెల్ వ్యాపారం విలీనమైతే రుణ భారం 14 వేల కోట్ల రూపాయలు తగ్గుతుందని భావిస్తోంది. అలాగే టవర్ల వ్యాపార విక్రయంతో కూడా రుణ భారం 11 వేల కోట్ల రూపాయలు తగ్గొచ్చని ఆర్‌కామ్ అంచనా వేస్తోంది.

మూడేళ్లు.. 8 కొత్త మోడళ్లు



దేశీయ మార్కెట్‌పై హ్యుండయ్ భారీ అంచనాలు
రూ.5,000 కోట్ల ఇన్వెస్ట్‌మెంట్‌కు కొరియా దిగ్గజం సన్నాహాలు
ఆగస్టు 22న మార్కెట్లోకి నెక్స్ట్‌జెన్ వెర్నా
దీపావళినాటికి 12,000 వాహనాల విక్రయ లక్ష్యం
కంపెనీ మార్కెటింగ్ డైరెక్టర్ రాకేష్ శ్రీవాస్తవ వెల్లడి



ఇంటర్వ్యూ

కొరియా దిగ్గజ సంస్థ హ్యుండయ్ భారత మార్కెట్లో వృద్ధి అవకాశాలపై భారీ అంచనాలతో ఉంది. ప్రస్తుతం మారుతి సుజుకీ తర్వాత దేశీయ మార్కెట్లో రెండో అతిపెద్ద సంస్థగా రాణిస్తున్న హ్యుండయ్ కొత్త మోడల్స్‌తో మార్కెట్ వాటా విస్తరించుకునే సన్నాహాల్లో ఉంది. వచ్చే మూడేళ్లలో అంటే 2020నాటికి భారత్ మార్కెట్లో 8 కొత్త మోడల్స్‌ను ప్రవేశపెట్టనున్నట్టు సంస్థ సేల్స్ అండ్ మార్కెటింగ్ డైరెక్టర్ రాకేష్ శ్రీవాస్తవ చెప్పారు. 2020నాటికి దేశీయ మార్కెట్లో 5,000 కోట్ల రూపాయల మేర ఇన్వెస్ట్ చేయనున్నట్టు ఆయన చెప్పారు.

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, పూర్తిగా కొత్త హంగులతో తీర్చిదిద్దిన నెక్స్ట్ జనరేషన్ వెర్నాను ఈ నెల 22న మార్కెట్లోకి ప్రవేశపెడుతున్న సందర్భంలో ఆయన **'ఆంధ్రజ్యోతి బిజినెస్'**తో మాట్లాడారు.. ఆయన ఏం చెప్పారంటే...

రెండు నెలల్లో 12 వేల యూనిట్లు

ప్రస్తుతం మార్కెట్లోకి తెస్తున్న ఆల్ న్యూ వెర్నా ఐదోతరం వాహనం. దీన్ని డెవలప్ చేసేందుకు గత నాలుగేళ్లలో పరిశోధనా, అభివృద్ధి (ఆర్ అండ్ డి)పై 1,040 కోట్ల రూపాయలను హ్యుండయ్ ఇన్వెస్ట్ చేసింది. ఆధునికీకరించిన ఇంజిన్‌తోపాటు 50 శాతం అడ్వాన్స్‌డ్ హై స్ట్రెంగ్త్ స్టీల్‌తో నిర్మించిన సూపర్‌బాడీ స్ట్రక్చర్, కె2 ప్లాట్‌ఫామ్‌పై నిర్మించిన ఈ వాహనం ప్రత్యేకతలు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన అన్ని హంగులనూ కొత్త వెర్నాకు సమకూర్చాం.

ఆగస్టు 22న ఈ వాహనాన్ని దేశీయ మార్కెట్లోకి లాంఛనంగా ఆవిష్కరించబోతున్నాం. వచ్చే దీపావళినాటికి కనీసం 12 వేల కార్లను విక్రయించాలన్నది మా లక్ష్యం. ఇప్పటికే ముందస్తు బుకింగ్స్ ప్రారంభమయ్యాయి. కస్టమర్ల స్పందన ప్రోత్సాహకరంగా ఉంది. అంతర్జాతీయంగా రష్యా, చైనా మార్కెట్లలోనూ ఈ వాహనాన్ని ఇప్పటికే ప్రవేశపెట్టాం. అక్కడ కూడా స్పందన ఆశించిన స్థాయిలో ఉంది. ఈ కారు తయారీలో గరిష్ఠ స్థాయిలో (ఎంత శాతమో చెప్పలేదు) లోకలైజేషన్‌ను సాధించాం. కొత్త వెర్నా మోడల్ డీజిల్, పెట్రోల్ వెర్షన్స్‌లో అందుబాటులో ఉంటుంది.

భారత్‌లో భారీ అవకాశాలు

ప్రపంచంలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటి. భారత్‌లో ఆటో మొబైల్ మార్కెట్ వృద్ధికి అవకాశాలు భారీగా ఉన్నాయి. హ్యుండయ్ ప్రస్తు తం భారత్‌లో 10 మోడల్స్‌లో వాహనాలను విక్రయిస్తుంది. వీటి ధరలు కూడా 3-30 లక్షల రూపాయల రేంజ్‌లో అన్ని వర్గాలకు అందుబాటులో ఉండే విధంగా ఉన్నాయి. 2020నాటికి 8 కొత్త మోడల్స్‌ను ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నాం. వచ్చే మూడేళ్లలో భారత్‌లో హ్యుండయ్ 5,000 కోట్ల రూపాయలను ఇన్వెస్ట్ చేయనుంది. భారత్‌లో దేశీయంగా గతేడాది 5 లక్షల వాహనాలను విక్రయించాం. మరో 1.5 లక్షల వాహనాలను ఎగుమతి చేశాం. తమిళనాడులోని మా ఉత్పత్తి కేంద్ర సామర్థ్యం 7 లక్షల వాహనాలు. ఈ ఏడాది 6.7 లక్షల వాహనాలను విక్రయించే అవకాశం ఉంది.

భారీ మార్కెటింగ్ వ్యూహాలు

కొత్త వెర్నాపై సంస్థ భారీ అంచనాలతో ఉంది. తన సెగ్మెంట్‌లో కొత్త వెర్నా తిరుగులేని ఆధిక్యం సంపాదిస్తుందని భావిస్తున్నాం. కొత్త వెర్నా ఆవిష్కరణ కోసం హ్యుండయ్ మార్కెటింగ్ లాబ్ పేరుతో టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశాం. ప్రింట్, టెలివిజన్, డిజిటల్, సోషల్ మీడియాతో సహా ప్రచారానికి అవకాశమున్న సమస్త మార్గాలను ఈ టీమ్ వినియోగించుకుంటున్నది.

త్వరలో ఎలక్ట్రిక్ బైక్

దక్షిణాది మార్కెట్‌పై దృష్టి.. మూడేళ్లలో రూ.300 కోట్ల పెట్టుబడులు
ఒకినవా స్కూటర్స్ మేనేజింగ్ డైరెక్టర్ జితేందర్ శర్మ

ఇంటర్వ్యూ

పర్యావరణానికి అనుకూలమైన ఎలక్ట్రిక్ వాహనాలకు భారత్‌లో రోజురోజుకు డిమాండ్ పెరుగుతోందని ఒకినవా స్కూటర్స్ మేనేజింగ్ డైరెక్టర్ జితేందర్ శర్మ అంటున్నారు. ఎలక్ట్రిక్ వాహనాలకు మరింత ప్రాచుర్యం కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం.. 'నేషనల్ ఎలక్ట్రిక్ మొబిలిటీ మిషన్ 2020'ను ప్రకటించిందని, ఇది ఈ రంగానికి అత్యంత మేలు చేకూర్చే అంశమని అంటున్నారు జితేందర్ శర్మ. ఎలక్ట్రిక్ వాహన పరిశ్రమ, ఒకినవా కంపెనీ పనితీరు, కొత్త మోడళ్లు, విస్తరణ కార్యకలాపాలపై శర్మ.. **'ఆంధ్రజ్యోతి బిజినెస్'**తో ఇష్ఠాగోష్ఠిగా మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

భారీగా డిమాండ్..

భారత్‌లో ఎలక్ట్రిక్ వాహనాలకు మంచి ఆదరణ లభిస్తోంది. అందుకు తగ్గట్టుగానే ప్రభుత్వం నేషనల్ ఎలక్ట్రిక్ మొబిలిటీ మిషన్ 2020 కింద 50 నుంచి 70 లక్షల ఎలక్ట్రిక్ వాహనాలకు డిమాండ్ ఉంటుందని అంచనా వేస్తోంది. ఇప్పటి వరకు ఎలక్ట్రిక్ స్కూటర్లపై దృష్టి సారిస్తున్న కంపెనీలు మున్ముందు బస్సులు, తేలికపాటి వాణిజ్య వాహనాలు, త్రిచక్ర వాహనాల ఉత్పత్తిలోకి అడుగుపెట్టే అవకాశం ఉంది. దేశీయంగా ఎలక్ట్రిక్ వాహనాల ఉత్పత్తి ప్రస్తుతం 24 వేల యూనిట్లుండగా సమీప భవిష్యత్‌లో ఇది రెండింతలు పెరగనుంది. ఇందుకనుగుణంగానే ఒకినవా కూడా పెద్ద ఎత్తున పెట్టుబడులు పెడుతోంది.

భిన్న విభాగాల్లో పెట్టుబడులు..

వచ్చే మూడేళ్ల కాలంలో ఒకినవా 4 కోట్ల డాలర్ల (సుమారు 300 కోట్ల రూపాయలు) పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డి), మెట్రో నగరాల్లో చార్జింగ్ సదుపాయాలు, భవిష్యత్ టెక్నాలజీని ప్రదర్శించేందుకు కొత్తతరం షోరూమ్‌లు, కొత్త ప్లాంట్ ఏర్పాటు, బ్రాండ్ ప్రమోషన్‌కు వెచ్చించనున్నాం. ఈ ఏడాది జనవరిలో ఎలక్ట్రిక్ బైక్ రిట్జ్ విడుదల చేయటం ద్వారా భారత మార్కెట్లోకి అడుగుపెట్టగా ఇప్పటి వరకు రెండు వేల వాహనాలు విక్రయించాం. గంటకు 55 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే రిట్జ్ ఒకసారి చార్జింగ్ చేస్తే 80 నుంచి 90 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది. ఈ బైక్ ధర 42,000 రూపాయలు.

వచ్చే నెలలో హైదరాబాద్ షోరూమ్

దక్షిణాది మార్కెట్లో పట్టును చేజిక్కించుకునే లక్ష్యంతో సెప్టెంబరులో హైదరాబాద్‌లో తొలి ఎలక్ట్రిక్ షోరూమ్‌ను ప్రారంభిస్తున్నాం. ఇప్పటి వరకు ఉత్తరాది మార్కెట్లో ఉన్న సంస్థను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు విస్తరిస్తున్నాం. దక్షిణాది మార్కెట్లోకి అడుగుపెట్టడం ద్వారా నెలకు 1,000 యూనిట్లను విక్రయించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 40 డీలర్‌షిప్‌లుండగా ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి 150 పెంచనున్నాం. మూడేళ్లలో వీటిని 450కి చేర్చాలని టార్గెట్‌గా పెట్టుకున్నాం.



మోటార్‌సైకిల్స్ విభాగంలోకి..

ఒకినవా స్కూటర్స్... దేశీ మార్కెట్లోకి తొలిసారిగా ఎలక్ట్రిక్ మోటార్‌సైకిల్‌ను తీసుకువస్తోంది. గంటకు వంద కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే ఈ బైక్‌ను ఒకసారి చార్జింగ్ చేస్తే 150 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది. మూడో త్రైమాసికంలో ఈ బైక్‌ను మార్కెట్లోకి విడుదల చేయనున్నాం. దీంతోపాటు ఈ ఏడాది మరో మూడు మోడళ్లను విడుదల చేసేందుకు కసరత్తు చేస్తున్నాం. ఇవి 250సిసి బైక్ తరహాలో ఉండనున్నాయి. కొత్త మోడళ్లతో అగ్రస్థానాన్ని చేజిక్కించుకోవాలన్నది ఒకినవ లక్ష్యం. ప్రస్తుతం కంపెనీకి రాజస్థాన్‌లోని భివాడీలో మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ ఉంది. ఈ ప్లాంట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 1.8 లక్షల యూనిట్లు. ఈ ప్లాంట్ సమీపంలోనే మరో లక్ష యూనిట్ల సామర్థ్యం గల ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నాం.

డిఎల్‌ఎఫ్ లాభాలకు గండి

న్యూఢిల్లీ: జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికంలో డిఎల్‌ఎఫ్ లాభాలకు భారీగా గండి పడింది. అనుబంధ కంపెనీలతో కలుపుకుని (కన్సాలిడేటెడ్)ఈ త్రైమాసికంలో కంపెనీ రూ.109.01 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదేకాలంతో పోలిస్తే లాభం 58 శాతం తక్కువ. ఇదే కాలంలో కంపెనీ ఆదాయం మాత్రం తొమ్మిది శాతం పెరిగి రూ.2,211.24 కోట్లకు చేరింది.

లాభాల్లో హింద్ కాపర్

ప్రభుత్వ రంగంలోని హిందూస్థాన్ కాపర్ కంపెనీ మళ్లీ లాభాల బాట పట్టింది. జూన్‌తో ముగిసిన ఈ ఆర్థిక సంవత్సరం తొలి మూడు నెలల కాలంలో కంపెనీ రూ.10.27 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదేకాలంలో కంపెనీ రూ.2.82 కోట్ల నష్టం చవిచూసింది. ఇదే కాలంలో కంపెనీ స్థూల ఆదాయం రూ.219.26 కోట్ల నుంచి రూ.406.08 కోట్లకు పెరిగింది.

నిరాశపరిచిన అదానీ ఎంటర్‌ప్రైజెస్


జూన్ త్రైమాసికానికి అదానీ ఎంటర్‌ప్రైజెస్ ప్రకటించిన ఆర్థిక ఫలితాలు మార్కెట్‌ను నిరాశ పరిచాయి. ఈ కాలానికి కంపెనీ 8,871.29 కోట్ల రూపాయల స్థూల ఆదాయంపై 141.15 కోట్ల రూపాయల కన్సాలిడేటెడ్ నికర లాభం ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే నికర లాభం 62 శాతం పడిపోయింది. ఆదాయమూ రూ.302.77 కోట్లు తగ్గింది. గౌతం అదానీ గ్రూపునకు చెందిన ఈ కంపెనీ పునరుత్పాదక ఇంధన వనరుల ప్రాజెక్టులు, గనుల తవ్వకం, ఆగ్రో బిజినెస్ రంగాల్లో ఉంది.


బిర్లా కార్ప్ లాభం రూ.43.21 కోట్లు

ఎంపి బిర్లా గ్రూపునకు చెందిన సిమెంట్ కంపెనీ బిర్లా కార్ప్ జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో రూ.43.21 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభం ఆర్జించింది. అంతకు ముందు సంవత్సరం ఇదే కాలంతో కంపెనీ లాభం 94.44 కోట్ల రూపాయలుగా ఉంది. టేకోవర్ చేసిన రిలయన్స్ సిమెంట్ కంపెనీ గత ఏడాది ఆగస్టు 16 నుంచి కంపెనీ అనుబంధ సంస్థగా మారింది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక ఆర్థిక ఫలితాలను గత ఏడాదితో పోల్చకూడదని తెలిపింది. ఈ మార్పులతో కంపెనీ ఖర్చులు రూ.968.99 కోట్ల నుంచి రూ.1,604.19 కోట్లకు చేరాయి.

మత సంస్థల సేవలకు జిఎస్‌టి వర్తిస్తుందా?







పివి సుబ్బా రావు

జిఎస్‌టి అమల్లోకి వచ్చి నెల రోజులు దాటి పోయింది. అయినా ఇంకా ఈ పన్ను ఎవరికి వర్తిస్తుంది? ఎవరికి వర్తించదు? అనే దానిపై చాలా సందేహాలున్నాయి. ముఖ్యంగా మత సంస్థలు భక్తులకు అందించే సేవలు, వస్తువులు జిఎస్‌టి పరిధిలోకి వస్తాయా? రావా? అనే దానిపై ఇంకా స్పష్టత లేదు. దీంతో ఏటా అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయంపై రూ.10 కోట్లు, తిరుమల వెంకన్నపై రూ.50 కోట్ల భారం పడుతుందని అంచనా. ఈ నేపథ్యంలో అసలు మత సంస్థలు, ధార్మిక సంస్థలు పన్నుల పరిధిలోకి వస్తాయా? లేదా? అనే అంశంపై వాణిజ్య పన్నుల శాఖ విశ్రాంత సంయుక్త కమిషనర్ పివి సుబ్బారావు రాసిన విశ్లేషణాత్మక వ్యాసం...

మత సంస్థలు గుళ్లు, గోపురాలకు వచ్చే యాత్రికులకు అవసరమైన వసతి, దర్శనం, భోజన ఏర్పాట్లు వంటి సేవలు అందిస్తుంటాయి. కొన్ని ఆలయ సంస్థలైతే భక్తులకు అందుబాటు ధరల్లో ఫొటోలు, డివిడిలు, క్యాలెండర్లు, పుస్తకాలు, ప్రసాదాలూ అందిస్తాయి. ఇవన్నీ తీర్థయాత్రలో భాగం. వ్యాపార దృక్పథంతోకాకుండా సేవా దృక్పథంతోనే ఆలయ సంస్థలు యాత్రికులకు ఇలాంటి సేవలు అందిస్తుంటాయి. కొన్ని ఆలయాలు నిత్యాన్న దానం రూపంలో వేల మంది భక్తులకు భోజన సదుపాయాలు కల్పిస్తున్నాయి. ఇంకా కొన్ని ధార్మిక సంస్థలు సేవా దృక్పథంతో ఉచితంగా లేదా నామమాత్రపు ఫీజులతో విద్యా సంస్థలు, ఆసుపత్రులు, అనాథ్రాశమాలు నడుపుతున్నాయి. వీటిని సేవా దృక్పథంతో చూడాలే తప్ప వ్యాపార, వాణిజ్య దృష్టితో చూసి పన్నుల భారం మోపకూడదు. గుళ్లు, గోపురాలతో సమాజానికి చేకూరే ప్రయోజనాన్ని కౌటిల్యుడు కూడా గుర్తించాడు. అందుకే ఆరాధనా స్థలాలను పరిరక్షించడం రాజు కర్తవ్యం అని తన అర్థశాస్త్ర గ్రంథంలో పేర్కొన్నాడు. ఆలయాల భూములు, గురుకులాల భూములపై ఎలాంటి పన్నులు గానీ, జరిమానాలుగానీ విధించకూడదని స్పష్టం చేశాడు. అలా చేస్తే వీటి ఆర్థిక పరిస్థితి దిగజారి వాటి ధార్మిక కార్యకలాపాలే క్షీణిస్తాయని మరీ హెచ్చరించాడు.

జిఎస్‌టి

ఈ సంవత్సరం జూలై నుంచి దేశ వ్యాప్తంగా అమలులోకి వచ్చిన జిఎస్‌టి చట్టం, ఏయే వస్తు, సేవలపై ఈ చట్టం కింద పన్ను విధించవచ్చో స్పష్టంగా పేర్కొంది. పన్ను చెల్లింపు పరిధిలోకి వచ్చే ప్రతి వ్యక్తి అంతర్ రాష్ట్ర సరఫరా కిందికి వచ్చే వస్తు, సేవలు లేదా రెండింటిని సరఫరా చేసినపుడు జిఎస్‌టి విధించాలని కేంద్ర ప్రభుత్వం అమలు చేసే సిజిఎస్‌టి చట్టంలోని సెక్షన్ 9 (1) పేర్కొంటోంది. ఎస్‌జిఎస్‌టి, ఐజిఎస్‌టి చట్టాల్లోనూ ఇదే నిర్వచనం. అలాగే సిజిఎస్‌టి చట్టంలోని సెక్షన్ 2 (83) ఔట్‌వర్డ్ (బయటికి) సరఫరా అంటే ఏమిటో నిర్వచించింది. ఈ సెక్షన్ ప్రకారం జిఎస్‌టి పరిధిలోకి వచ్చే ఒక వ్యక్తి వ్యాపారం కొనసాగింపులో భాగంగా అమ్మకం, బదిలీ, వస్తు మార్పిడి, మారకం, లైసెన్సు, రెంటల్, లీజు లేదా డిస్పోజల్ లేదా ఇతర మార్గాల్లో సరఫరా చేసే వస్తు, సేవలు లేదా రెండింటిపైనా జిఎస్‌టి భారం పడుతుంది. వ్యాపారం కోసం సరఫరా చేసే వస్తు, సేవలు లేదా రెండూ సెక్షన్ 7 (1) (ఎ) నిర్వచనం ప్రకారం 'సరఫరా' కిందికి వస్తాయి. వ్యాపార కొనసాగింపులో భాగం కాని వస్తు, సేవల సరఫరా జిఎస్‌టి పన్ను విధింపు కోసం 'సరఫరా' కిందికి రాదని గ్రహించాలి. జిఎస్‌టి చట్టంలోని సెక్షన్ 2 (17), 'వ్యాపారం' అంటే ఏమిటో కూడా స్పష్టంగా నిర్వచించింది. మార్చి, 2005 వరకు అమలులో ఉన్న ఎపి జనరల్ సేల్స్ టాక్స్ యాక్ట్, 1957 కూడా వ్యాపారానికి ఇదే నిర్వచనం ఇచ్చింది.

కోర్టుల తీర్పులు

కోర్టులు మత సంస్థలు, ధార్మిక సంస్థలు అందించే సేవలు, వస్తువులపై పన్ను విధింపుకు సంబంధించి గతంలోనే స్పష్టమైన తీర్పులు ఇచ్చాయి. శ్రీశైల భ్రమరాంభ మల్లికార్జున దేవస్థానం అమ్మే వస్తువులపై ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎపిజిఎస్‌టి చట్టం కింద గతంలో పన్ను విధించింది. ఈ కేసును విచారించిన ఎపి హైకోర్టు మత సంస్థలు, ధార్మిక సంస్థల ప్రధాన కార్యక్రమం వ్యాపారం కాకుండా ఉన్నంత వరకు, ఈ అమ్మకాలు పన్ను విధింపు పరిధిలోకి రావని స్పష్టం చేసింది.

2002లో సాయి పబ్లికేషన్ ఫండ్ వెర్సెస్ కమిషనర్ ఆఫ్ సేల్స్ టాక్స్ కేసులోనూ సుప్రీం కోర్టు ఇదే విషయం స్పష్టం చేసింది. షిరిడీ సాయి బాబా బోధనల ప్రచారం కోసమే షిరిడీ సాయి బాబా ట్రస్టు సబ్సిడీ ధరలతో సాయి బాబా బోధనల పుస్తకాలు అమ్ముతోంది తప్ప, వాణిజ్య లేదా వ్యాపార దృక్పథంతోకాదని, అందువల్ల వీటిపై పన్ను విధించడం చెల్లదని కోర్టు పేర్కొంది. 1972లో స్టేట్ ఆఫ్ మద్రాస్ వెర్సెస్ టిటిడి కేసులోనూ మద్రాసు హైకోర్టు ఇలాంటి తీర్పే ఇచ్చింది. జిఎస్‌టి కింద పన్ను విధింపు కోసం 'సరఫరా' నిర్వచనానికి సంబంధించి కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ జూలై 13న ఒక వివరణ విడుదల చేసింది. ఈ వివరణ ప్రకారం ఎవరైనా ఒక వ్యక్తి తన దగ్గర ఉన్న పాత బంగారాన్ని పన్ను చెల్లింపు పరిధిలోని వ్యక్తికి అమ్మినా, దాన్ని 'వ్యాపార కొనసాగింపు'గా పరిగణించలేం. ఎందుకంటే పాత బంగారం అమ్మకం అతడి వ్యాపారం కాదు. అందుకే ఇది 'సరఫరా' నిర్వచనం పరిధిలోకి రాదు. మతపరమైన సంస్థలకూ ఈ వివరణ వర్తిస్తుందని నా అభిప్రాయం. ఈ సంస్థలు గదులు అద్దెకు ఇవ్వడం, ఫొటోలు క్యాలెండర్లు సరఫరా చేయడం 'వ్యాపార కొనసాగింపు', 'సరఫరా' నిర్వచనం పరిధిలోకి రావని సుప్రీం కోర్టు, ఎపి హైకోర్టులు గతంలోనే స్పష్టమైన తీర్పులు ఇచ్చాయి.

కాబట్టి ఈ సంస్థలను జిఎస్‌టి నుంచి మినహాయించేందుకు ప్రభుత్వం మళ్లీ ప్రత్యేకంగా నోటిఫికేషన్ విడుదల చేయాల్సిన అవసరం లేదు.

జెకె సిమెంట్‌కు కలిసొచ్చిన రాబడి

న్యూఢిల్లీ: జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం జెకె సిమెంట్‌కు బాగానే కలిసొచ్చింది. అనుబంధ కంపెనీలను పక్కన పెడితే జూన్ త్రైమాసికానికి కంపెనీ రూ.1,208.43 కోట్ల ఆదాయంపై రూ.79.34 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఆదాయం 16.21 శాతం, నికర లాభం 30.38 శాతం పెరిగాయి. వైట్ సిమెంట్, వాల్ పుట్టీ ఉత్పత్తిలో జెకె సిమెంట్ దేశంలో రెండో అతిపెద్ద కంపెనీ.

బులియన్

బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	ప్రొద్దుటూరు	ముంబై	చెన్నై
24 క్యారెట్లు	30,050	30,000	--	29,210	--
క్రితం ముగింపు	30,080	30,000	--	29,210	--
22 క్యారెట్లు	29,450	27,900	--	29,060	27,830
క్రితం ముగింపు	29,480	28,000	--	29,060	27,840
వెండి (కిలో)	40,150	40,600	--	39,110	--
క్రితం ముగింపు	40,150	40,300	--	39,110	---

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	77.00	గోదావరి	77.00
కరీంనగర్	78.00	విజయవాడ	78.00
వరంగల్	77.00	గుంటూరు	78.00
మహబూబ్‌నగర్	77.00	ఒంగోలు	80.00
కర్నూలు	77.00	చిత్తూరు	70.00
విశాఖపట్నం	78.00	నెల్లూరు	70.00

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.05 నెక్ (100 గుడ్లు)



హైదరాబాద్	343.00	వరంగల్	345.00
విజయవాడ	352.00	చెన్నై	387.00
గోదావరి	352.00	నమక్కల్	375.00
బెంగళూరు	370.00	చిత్తూరు	380.00
విశాఖపట్నం	357.00	ముంబై	388.00

వితంతువులు సరగసీ ద్వారా పిల్లల్ని పొందొచ్చు!

- సహజీవనం చేసే వారికీ అవకాశం: పార్లమెంటరీ ప్యానల్

న్యూఢిల్లీ: వితంతువులకు, సహజీవనం చేసే దంపతులకు కూడా అద్దె గర్భం ద్వారా పిల్లల్ని పొందే అవకాశం ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి పార్లమెంటరీ ప్యానల్ సూచించింది. ఇప్పటివరకు చట్టప్రకారం దంపతులైన వారికి మాత్రమే సరగసీని ఉపయోగించుకునే వీలుండేది. ఇప్పుడు ఈ సరగసీని మరింత విస్తృతం చేసే అవకాశం కలిగింది. అయితే స్వచ్ఛంద సరగసీ పేరుతో కొన్ని సందర్భాల్లో పిల్లల్ని కనే తల్లులకు ఎటువంటి పారితోషికమూ ఇవ్వకపోవడాన్ని ప్యానల్ వ్యతిరేకించింది. సరగసీ ద్వారా పిల్లల్ని కనే తల్లులు ప్రసవ సమయంలోనూ, తర్వాత ఎన్నో కష్టనష్టాలు ఎదుర్కొంటున్నారని, చాలామంది తమ బంధువుల కోసమో, దగ్గరివారి కోసమో స్వచ్ఛందంగా సరగసీ తల్లులుగా మారుతున్నారని పేర్కొంది. సరగసీకి అంగీకరించిన తల్లులకు తప్పకుండా పారితోషికం అందేలా చూడాలని ప్రభుత్వానికి ప్యానల్ విజ్ఞప్తి చేసింది. అలాగే ఎన్నారైలకు, భారత సంతతికి చెందిన విదేశీయులకు కూడా భారత్‌లో సరగసీ ద్వారా పిల్లల్ని పొందడానికి అవకాశం కల్పించాలని సూచించింది. 2016 సరగసీ బిల్లు ప్రకారం విదేశీయులకు భారత్‌లో సరగసీ ద్వారా పిల్లల్ని పొందడానికి అవకాశం లేదు. ఇప్పుడు దాన్ని సవరించాలని కేంద్రానికి సిఫారసు చేసింది ప్యానల్.

'కంది' మనదే!

పుట్టినిల్లు మధ్యప్రదేశ్.. ఇక్రిశాట్ పరిశోధనల్లో వెల్లడి

- జన్యువుల గుట్టు కనిపెట్టిన శాస్త్రవేత్తలు
- త్వరలో పేటెంట్‌కు దరఖాస్తు!

ప్రధాని మోదీ రెండేళ్ల క్రితం ఓ సమావేశంలో మాట్లాడుతూ.. 'కందిలోని పౌష్టికాహార విలువలు అన్నీ ఇన్నీ కావు. మన దేశంలో పౌష్టికాహార లేమిని తగ్గించటానికి ఈ పంట ఎంతో ఉపయోగపడుతుంది. దీనిపై మీరు ప్రత్యేక దృష్టి పెట్టాలి' అని వ్యవసాయ శాస్త్రవేత్తలకు దిశా నిర్దేశం చేశారు. కందికి మోదీ ఇంత ప్రాధాన్యం ఇవ్వడానికి కారణం వీటిలో ఉన్న పౌష్టికాహార విలువలు మరే ఇతర పప్పుధాన్యాల్లోనూ లేకపోవడమే. అయితే కంది దిగుబడి మన దగ్గర చాలా తక్కువ. కొత్త వంగడాలు విడుదలై రెండు దశాబ్దాలు దాటింది. అందుకే వ్యవసాయ శాస్త్రవేత్తలు కందిపై చాలా కాలంగా దృష్టి సారించారు. కంది జన్యువులపై ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు జరిగిన పరిశోధనల్లో.. కంది పుట్టింది మధ్యప్రదేశ్ రాష్ట్రంలోనే అని తెలుసుకున్నారు. దీని జన్యువుల గుట్టు కూడా తెలిసింది. దీని వల్ల చీడపీడలను తట్టుకొని ఎక్కువ దిగుబడినిచ్చే కంది వంగడాలను అభివృద్ధి చేయొచ్చు. ఈ వివరాలన్నింటినీ ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.



రాజీవ్ (ఎడమ), రచిత్ (కుడి)

జన్యువులపై విశ్లేషణ..

ప్రతి మనిషికీ జన్యువులు ఉంటాయి. వాటిలో ఉండే డీఎన్ఏ.. మనుషుల ఆకారాన్ని, లక్షణాలను నిర్దేశిస్తుంది. ఈ డీఎన్ఏ క్రమాన్ని గుర్తించగలిగితే మనుషుల రూపురేఖలు, గుణగణాల నుంచి వారికి వచ్చే వ్యాధుల దాకా అనేక విషయాలు తెలుసుకోవచ్చు. ఇది మనుషులకే కాదు.. మొక్కలకు కూడా వర్తిస్తుంది. "కందిలో ప్రపంచవ్యాప్తంగా 292 రకాలు ఉన్నాయి. ఇవన్నీ చూడటానికి ఒకే విధంగా ఉంటాయి. కానీ వాటి దిగుబడిలోనూ, చీడపీడలను ఎదుర్కొనే శక్తిలోనూ తేడా ఉంటాయి. వీటికి కారణం వాటి జన్యువులే. ఈ క్రమాన్ని కనుగొంటే అనేక విషయాలు తెలుస్తాయి.." అంటారు ఇక్రిశాట్ సీనియర్ శాస్త్రవేత్త, కంది జన్యు ప్రాజెక్టు నేతృత్వం వహించిన డాక్టర్ రాజీవ్ కె వర్ష్నీ. ఆయన నేతృత్వంలో ప్రపంచ వ్యాప్తంగా 9 పరిశోధనా సంస్థలకు చెందిన 19 మంది శాస్త్రవేత్తలు కందిపై పరిశోధనలు చేశారు. మూడేళ్లు శ్రమించి 23 దేశాలకు చెందిన 292 పెసర కంది జన్యువులను విశ్లేషించారు. 'ఏదైనా మొక్క ఎక్కడ పుడుతుందో అక్కడ ఎక్కువ రకాలు దొరుకుతాయి. కంది ఈ రాష్ట్రంలో పుట్టిందని ప్రతిపాదిస్తున్నాం. దీనిని శాస్త్రీయంగా నిర్ధారించిన తర్వాత పేటెంట్ కూడా తీసుకుంటాం" అని రచిత్ సక్సేనా అనే శాస్త్రవేత్త వెల్లడించారు. కంది జన్యువుల క్రమాన్ని విశ్లేషించటం వల్ల మూడు ముఖ్యమైన ప్రయోజనాలు ఉంటాయంటున్నారు శాస్త్రవేత్తలు. మొదటిది దిగుబడి. దీంతోపాటు కందిలో ఏయే జన్యువులు నాణ్యతపై ప్రభావం చూపుతాయో శాస్త్రవేత్తలు కనిపెట్టారు. పరిశోధనలను క్షేత్రస్థాయిలో విజయవంతమైతే మన దేశంలో కంది దిగుబడి భారీగా పెరుగుతుంది.

- స్పెషల్ డెస్క్

పోష్టికాహార విలువల పుష్కలంగా ఉండే పప్పుధాన్యాల్లో ప్రధానమైన కంది పుట్టింది మన దేశంలోనే. ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో దేశాల్లో పండుతున్నా, 292 రకాలు ఉన్నా దీని మూలం మాత్రం భారత్‌లోనే ఉంది. కంది పుట్టింది మధ్యప్రదేశ్ లోనని, అక్కడి నుంచే దీని ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లినట్లు ఇక్రిశాట్ శాస్త్రవేత్తల పరిశోధనల్లో వెల్లడయింది. దీంతో ఈ విషయాన్ని శాస్త్రీయంగా నిర్ధారించి.. కందిపై పేటెంట్ పొందేందుకు వారు ప్రయత్నాలు చేస్తున్నారు.



- 2011లో తొలిసారి కంది డీఎన్ఏ సీక్వెన్సింగ్ చేశారు. దీనికి ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు నేతృత్వం వహించారు.
- కందిని ప్రపంచవ్యాప్తంగా 5 కోట్ల హెక్టార్లలో మాత్రమే సాగు చేస్తున్నారు.
- ఆసియా, ఆఫ్రికాల్లోని పేద దేశాల ప్రజలకు పోష్టికాహార లేమిని తీర్చడానికి కంది ఉపయోగపడుతుంది.



ట్రాపిస్ట్-1 మనకన్నా పెద్దోడు!

మన సౌర వ్యవస్థ వయసు కంటే రెండింతలు ఎక్కువ

వాషింగ్టన్, ఆగస్టు 12: ట్రాపిస్ట్-1.. అరుణ కుబ్జ నక్షత్రం. భూమికి 40 కాంతి సంవత్సరాల(378 లక్షల కోట్ల కిలోమీటర్లు) దూరంలో భూమిని పోలిన 7 గ్రహాలను కలిగి ఉంది. ఇప్పటి దాకా ట్రాపిస్ట్-1 50 కోట్ల ఏళ్ల నాటిదని శాస్త్రవేత్తలు అంచనా వేశారు. కానీ, అది 540 కోట్ల ఏళ్ల నుంచి నుంచి 980 కోట్ల ఏళ్ల మధ్య పుట్టిందని, అంటే మన సౌరవ్యవస్థ వయసు (450 కోట్ల సంవత్సరాలు) కంటే ఆ నక్షత్రం వయసు రెండింతలు ఎక్కువ అని అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా పరిశోధకులు తెలిపారు. ఈ సౌర వ్యవస్థపై గల 7 గ్రహాల్లో మూడింటిలో భూమిని పోలిన వాతావరణం ఉందని, అక్కడ జీవిమనుగడకు అవకాశం ఉందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు.

భారత సైన్యానికి రోబోల సహాయం!

- ఉగ్రవాదుల ఏరివేతే లక్ష్యం

న్యూఢిల్లీ: ఉగ్రవాదాన్ని ఏరివేసేందుకు భారత సైన్యం రోబోల సాయం తీసుకోనుంది. జమ్ము కశ్మీర్ రాష్ట్రంలో ఉగ్రవాద నిరోధక కార్యకలాపాలకు రోబోలను వినియోగించనుంది సైన్యం. కష్టసాధ్యమైన ప్రదేశాల్లోకి ఆయుధాలను చేరవేసేందుకు ఈ రోబోలను ఉపయోగిస్తుంది. తమకు 544 రోబోల అవసరముందని భారత రక్షణ శాఖకు ఆర్మీ ప్రతిపాదనలు పంపింది. రక్షణ శాఖ నుంచి ఆమోదం కూడా లభించింది. రక్షణ, పరిసరాల పర్యవేక్షణ, సైన్యం కూడా చొరబడలేని మారుమూల ప్రాంతాలు, అడవుల్లో సైతం ఈ రోబోలు నిరాటంకంగా పనిచేయగలవని ఆర్మీ అధికారులు తెలిపారు. కశ్మీర్‌లో సైన్యానికి అతిపెద్ద సవాలు అక్కడి ప్రతికూల వాతావారణం. అలాంటి వాతావరణంలో సైతం ఈ రోబోలు పనిచేయగలవని, తక్కువ దూరాలకు స్టెన్ గ్రెనైడ్, ఇతర ఆయుధాలను తీసుకెళ్లగలవని, ముఖ్యంగా రాష్ట్రీయ రైఫిల్స్ (ఆర్‌ఆర్) విభాగానికి ఈ రోబోల ఉపయోగం చాలా ఉందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.



ఆస్పత్రి కాదు వధశాల!

శ్మశానంలా మారిన గోరఖ్‌పూర్ ఆస్పత్రి.. తల్లిదండ్రుల కళ్లెదుటే పిట్టల్లా రాలిన బిడ్డలు

- 7 రోజుల్లో 60 మంది చిన్నారుల మృతి
- బీఆర్డీ కాలేజ్ ప్రిన్సిపాల్‌పై సస్పెన్షన్ వేటు

గోరఖ్‌పూర్(యూపీ), ఆగస్టు 12: 'అది ఆస్పత్రి కాదు. చిన్నారుల ప్రాణాలను బలిగొనే వధశాల. అప్పుడే పుట్టిన పసికందులు ఆక్సిజన్ అందక అల్లాడుతున్నా కసాయిల్లాంటి ఆస్పత్రి సిబ్బంది స్పందించ లేదు. నా నాలుగేళ్ల బిడ్డ ఊపిరాడక అల్లాడుతూ ఐదారు గంటలు మృత్యువుతో పోరాడి నా కళ్ల ముందే కన్నుమూసింది.' అంటూ శ్రీకృష్ణ గుప్తా కన్నీటిపర్యంతమయ్యారు. ఉత్తర్‌ప్రదేశ్ గోరఖ్‌పూర్‌లోని బాబా రాఘవ్ దాస్ (బీఆర్డీ) ఆస్పత్రిలో చోటుచేసుకున్న నరమేధంలో గుప్తా బిడ్డ బలైంది. యూపీలోనే రెండో అతిపెద్ద ప్రభుత్వ ఆస్పత్రి అయిన బీఆర్డీ ఆస్పత్రిలో వారంలో 60 మంది చిన్నారులు పిట్టల్లా రాలిపోయారు. గురు, శుక్రవారాల్లోనే ఆక్సిజన్ అందక 30 మంది మృత్యువాతపడ్డారు.

వారం క్రితమే ఆగిన ఆక్సిజన్

బీఆర్డీ ఆస్పత్రికి 'పుష్పాసేల్స్' అనే సంస్థ లిక్విడ్ ఆక్సిజన్‌ను సరఫరా చేస్తోంది. ఈ సంస్థకు ఆస్పత్రి యాజమాన్యం రూ.63.65 లక్షలు బకాయిపడింది. బకాయిలు చెల్లించకుంటే ఆక్సిజన్ సరఫరా నిలిపివేస్తానని ఆ సంస్థ ఆస్పత్రియాజమాన్యానికి లేఖలు రాసింది. చివరిగా ఆగస్టు 1న లేఖ రాసినా ఆస్పత్రివర్గాలు స్పందించ లేదు. దీంతో ఆగస్టు 3 నుంచి కాంట్రాక్టర్ ఆక్సిజన్ సరఫరా నిలిపివేశారు. ఉన్న నిల్వలతోనే ఆగస్టు 10 వరకు నెట్టుకొచ్చారు.

చివరి వరకు నిర్లక్ష్యమే

గురువారం రాత్రి నుంచి పరిస్థితి చేయిదాటి పోయింది. ఆక్సిజన్ నిల్వలు చాలా తక్కువగా ఉన్నాయని ఆస్పత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్‌కు ఆస్పత్రి సిబ్బంది గురువారం ఉదయం లిఖితపూర్వకంగా తెలిపారు. నిల్వలు గురువారం సాయంత్రం వరకే సరిపోతాయన్నారు. అయినా ఆస్పత్రి యాజమాన్యం మత్తు వీడలేదు. దీంతో గురువారం రాత్రి నుంచి పిల్లల వార్డుతోసహా ఎమర్జెన్సీ వార్డులన్నిటికీ ఆక్సిజన్ సరఫరా నిలిచిపోయింది. ఫలితంగా గురువారం రాత్రి నుంచి శుక్రవారం వరకు 48 గంటల్లో 30 మంది చిన్నారులు మృతి చెందారు.

నిధులు విడుదలైనా నిర్లక్ష్యమే

బీఆర్డీ ఆస్పత్రికి ఆక్సిజన్ సరఫరాకు సంబంధించిన బకాయిలు ఆగస్టు 5న విడుదల చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ఆగస్టు 7న బీఆర్డీ ఆస్పత్రి ఖాతాలో జమ అయినా కాంట్రాక్టర్‌కు ఆస్పత్రి యాజమాన్యం చెల్లించలేదు. అప్పుడే చెల్లించి ఉంటే పరిస్థితి చేయిదాటేది కాదు. తాపీగా ఆగస్టు 11న బకాయిలను గుత్తేదారుకు చెల్లించారు.



బీఆర్డీ మెడికల్ కాలేజీని సందర్శించిన గులాంనబీ ఆజాద్, తదితరులు

ఆలస్యంగా స్పందించిన సర్కార్

బీఆర్డీ ఆస్పత్రిలో చిన్నారులు పిట్టల్లా రాలిపోతుండటంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. అప్పటికే నష్టం జరిగిపోయింది. బీఆర్డీ ఆస్పత్రిలో పరిస్థితిని సమీక్షించేందుకు రాష్ట్ర ఆరోగ్య మంత్రి సిద్ధార్థనాథ్ సింగ్, మరో సీనియర్ మంత్రిని యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ గోరఖ్‌పూర్ పంపారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన బీఆర్డీ వైద్యకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజీవ్ మిశ్రాపై సస్పెన్షన్ వేటు వేశారు. ప్రధాని మోదీ గోరఖ్‌పూర్ విషాదంపై స్పందించారు. సీఎం యోగి ఆదిత్య ఆయనకు బీఆర్డీ ఆస్పత్రిలో పరిస్థితిని వివరించారు. ప్రధాని ఆదేశాల మేరకు కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా, ఆ శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ బీఆర్డీ ఆస్పత్రిలో పరిస్థితిని తెలుసుకుంటున్నారు. మరోవైపు ఆస్పత్రికి ఆక్సిజన్ సరఫరా చేసే గుత్తేదారు ఇంటిపై పోలీసులు రైడ్ చేసి పలు పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. కాగా, ఆగస్టు 9న బీఆర్డీ ఆస్పత్రిని యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ సందర్శించారు. యోగి ఆదిత్యనాథ్ గోరఖ్‌పూర్ పార్లమెంటు స్థానం నుంచి 20 ఏళ్లుగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. సీనియర్ కాంగ్రెస్ నేత గులాంనబీ ఆజాద్ శనివారం ఆస్పత్రిని సందర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యమే దీనికి కారణమని, యూపీ ఆరోగ్యశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దారుణంపై మాటలు రావడం లేదని కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ అన్నారు. యూపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఈ దారుణం జరిగిందని కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ అన్నారు. ఎస్పీ అధినేత, మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్, బీఎస్పీ చీఫ్ మాయావతి కూడా ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

మెదడువాపు మరణాలకు పెట్టింది పేరు!

గోరఖ్‌పూర్.. మెదడువాపు మరణాలకు పెట్టింది పేరు. ప్రతియేటా వర్షాకాలంలో మెదడువాపు వ్యాధితో వందలాది మంది చిన్నారులు మృత్యువాత పడుతుంటారు. ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు 8 వరకు 476 మంది మెదడువాపు వ్యాధితో బీఆర్డీ ఆస్పత్రిలో చేరారు. వీరిలో అధికశాతం చిన్నారులే. వారిలో 117 మంది చిన్నారులు మృతి చెందారు. తాజాగా ఆక్సిజన్ అందక చనిపోయినవారిలో మెదడువాపు వ్యాధి బాధిత చిన్నారులూ ఉన్నారు.

వారంలో 60 మంది మృతి: ఆగస్టు 7 నుంచి11 వరకు 60 మంది చిన్నారులు బీఆర్డీ ఆస్పత్రిలో మృతి చెందారు. వారిలో 30 మంది మెదడువాపు వ్యాధితో మృతి చెందగా మరో 30 మంది ఆక్సిజన్ అందక మృతి చెందిన వారే.

శశికళకూ ఉద్వాసన?

- 2-3 రోజుల్లో ప్రకటన!..

ఈపీఎస్ వర్గం నిర్ణయం



చెన్నై, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ఉప ప్రధాన కార్యదర్శి పదవి నుంచి వెలివేశామని చెప్పినా వినని టీటీవీ దినకరన్‌కు పార్టీతో అసలు సంబంధమే లేదని తేల్చిచెప్పిన తమిళనాడు ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి వర్గం.. శశికళనూ సాగనంపేందుకు సిద్ధమవుతోంది. ప్రధాన కార్యదర్శి పదవి నుంచే గాక.. అసలు పార్టీ నుంచే ఉద్వాసన పలికేందుకు రెండుమూడు రోజుల్లో ప్రకటన వెలువడనుందని అన్నాడీఎంకే వర్గాలు చెబుతున్నాయి. తన వర్గం విలీనం కావాలంటే దినకరన్, శశికళల్ని పార్టీ నుంచి బహిష్కరించాలని, జయలలిత మృతిపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్ సెల్వం మొదటి నుంచీ డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే దినకరన్ నియామకం చెల్లదని ఎడప్పాడి వర్గం తీర్మానం చేసింది. అంతేగాక దివంగత జయలలిత గతంలో నియమించిన కార్యవర్గమే పార్టీని నడిపిస్తుందని, దినకరన్ చేపట్టిన నియామకాలేవీ చెల్లవని స్పష్టం చేసింది. జయలలిత మృతితో తాత్కాలికంగా వీకే శశికళను ప్రధాన కార్యదర్శిగా నియమించుకున్నామని, ఆమె (అవినీతి కేసులో శిక్షపడి జైలులో ఉన్నందున) క్రియాశీలంగా లేరని, ఆమె నియామకం చెల్లదని ప్రకటించాల్సిందిగా ఎన్నికల కమిషన్‌కు ఈపీఎస్ వర్గం ఇప్పటికే అఫిడవిట్ కూడా సమర్పించింది. దీంతో ఆగ్రహించిన దినకరన్.. సీఎంతో తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే 17 మంది ఎమ్మెల్యేలను తనవైపు తిప్పుకొన్నారు. కనీసం 30 మందిని ఆకర్షించి.. ఎడప్పాడి ప్రభుత్వాన్ని కూల్చాలని ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు. ఆయన కుట్రల్ని తిప్పికొట్టేందుకు పళనిస్వామి కూడా రంగంలోకి దిగారు. పన్నీర్‌సెల్వంతో చేతులు కలిపి.. శశికళకు పార్టీ నుంచి పూర్తిగా ఉద్వాసన పలకాలని యోచిస్తున్నట్లు సమాచారం. ఒకవేళ దినకరన్, శశికళ తన ప్రభుత్వానికే ఎసరు తెచ్చేపక్షంలో 'సీబీఐ అస్త్రాన్ని' కూడా ప్రయోగించాలని భావిస్తున్నట్లు సమాచారం. కాగా, రెండు వర్గాలూ విలీనం కావాలని తాను చెబుతున్నా.. లేనిపోని కొర్రీలు వేస్తున్న ఓపీఎస్‌పై ప్రధాని మోదీ ఆగ్రహంగా ఉన్నట్లు తెలిసింది. విలీనం కావాలంటే ఉపముఖ్యమంత్రి పదవితో పాటు పార్టీ ప్రధాన కార్యదర్శి పదవి కూడా ఇవ్వాలని ఓపీఎస్ పేచీపెడుతున్న సంగతి తెలిసిందే. అందుకు ఈపీఎస్ అంగీకరించగానే.. నలుగురికి మంత్రి పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇద్దరికి మాత్రమే ఇస్తానని సీఎం చెప్పారు. ఇదే విషయాన్ని ఈపీఎస్ శుక్రవారం ప్రధానిని ఢిల్లీలో కలిసినప్పుడు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. విలీనానికి తాము సిద్ధమైనా మాజీ సీఎం వేసే కొర్రీలతో సాధ్యం కావడం లేదని తెలిపారు. దీంతో పన్నీర్‌కు శుక్రవారం ప్రధాని అపాయింట్‌మెంట్ లభించలేదు.

అరవై ఏళ్లు నిరాహారం

కాఫీ, టీ, మంచినీళ్లే ఆమె మెను.. మధ్యప్రదేశ్‌లో ఒక మహిళ జీవనం



భోపాల్, ఆగస్టు 12: ఏకంగా అరవై ఏళ్లు అన్నం ముట్టకుండా ఎవరైనా ఉండగలరా? ఇది తలుచుకుంటేనే ఆశ్చర్యం వేస్తుంది. మధ్యప్రదేశ్‌లోని ధామ్‌నోద్‌కు చెందిన 75 ఏళ్ల బామ్మగారు ఈ అరుదైన ఘనత సాధించారు. ఆవిడ పేరు సరస్వతి బాయి. అరవై ఏళ్లుగా అన్నం జోలికి వెళ్లకుండా కాఫీ, టీలతోనే కడుపు నింపుకొంటోంది. ఆమె ఇప్పటికీ మంచి ఆరోగ్యంతో ఉంది. అంతేకాదండోయ్...నిత్యం గంటల తరబడి ఆమె పొలంలో పనిచేస్తుంది కూడా! సరస్వతిబాయి, ద్వారకా ప్రసాద్ పాటిదార్‌లకు చిన్నప్పుడే పెళ్లయ్యింది. వారికి తొలిచూలు కలిగాక సరస్వతి అనారోగ్యం పాలయ్యింది. ఆమెకు ఏం తిన్నా కడుపులో ఇమడక, వాంతి చేసుకునేది. తర్వాత ఆమె ఆరోగ్యం బాగుపడినా ఆమె ఏదీ తినలేకపోయింది. భర్త కూడా వైద్యం చేయించకుండా నిర్లక్ష్యం చేయడంతో సరస్వతి ఆహారం తీసుకోవడం పూర్తిగా మానేసింది. మొదట్లో అధికంగా నీటిని, తర్వాత టీ తాగడం అలవాటు చేసుకుంది. మంచినీటితోపాటు ఉదయం, సాయంత్రం టీ. వారంలో ఒక రోజు అరటిపండు. ఇదే ఆమె మెను. సరస్వతికి ఐదుగురు సంతానం. గర్భవతిగా ఉన్నప్పుడు కూడా ఆమె ఆహారం ముట్టలేదు. ఆమె ఇప్పటికీ తన పని తానే చేసుకుంటూ గుండ్రాయిలా ఆరోగ్యంగా తిరుగుతూ ఉంటుంది.



ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడిని శనివారం ఢిల్లీలో కలుసుకుని అభినందనలు తెలుపుతున్న మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్

బాబోయ్ జీఎస్టీ!

నిత్యావసరాలు, అత్యవసరాలపై బాదుడు

- చింతపండుపై 12.. హెయిర్ బ్యాండ్‌పై 28%
- విద్య, వైద్యం మరింత భారం
- జీఎస్టీ అమల్లో వ్యాపారుల మాయాజాలం

(ఆంధ్రజ్యోతి బిజినెస్ డెస్క్)

మహిళలు విరివిగా ఉపయోగించే హెయిర్ రబ్బర్ బ్యాండ్లపై జీఎస్టీ ఎంతో తెలుసా!? అత్యధికంగా 28%! మహిళలు ఉపయోగించే లైటర్లు, నెయిల్ పాలిష్‌పైనా 28% వడ్డింపు! డయాలసిస్‌పై గతంలో పన్ను 5% ఉండేది. జీఎస్టీలో దీనిని 12%కు పెంచారు. హృద్రోగులు ఉపయోగించే పేస్ మేకర్‌పై గతంలో 5.5% పన్ను ఉండేది. జీఎస్టీలో దానిని 18 శాతానికి పెంచారు.

జీఎస్టీ అమలుతో బహుళ పన్నుల వ్యవస్థ పోయి, ఒకే పన్ను అమల్లో ఉంటుందని, దానివల్ల వినియోగదారులకు లబ్ధి చేకూరుతుందని ప్రభుత్వాలు ఊదరగొట్టాయి. పరోక్ష పన్నుల విప్లవాన్ని వినియోగదారుల ప్రయోజనాల కోసమే ముందుకు తెస్తున్నట్టు గతంలో మన్మోహన్ సింగ్ ప్రభుత్వం చెప్పుకొంది. దానినే మోదీ ప్రభుత్వం ప్రచారంలో పెట్టింది. ఆచరణలో మాత్రం వినియోగదారులపై భారం పెరిగింది. ఇంకా చెప్పాలంటే నిత్యావసరాలు, అత్యవసరాలపై పన్ను బాదేసింది. జీఎస్టీ పన్ను నిర్ధారణలో ప్రజల అవసరాన్నే పెట్టుబడిగా భావించినట్టు కనిపిస్తోంది. బెంగాలీలకు అత్యంత ప్రీతిపాత్రమైన తీపి వంటకం సందేష్. దీనిపై 5% జీఎస్టీ విధించారు. దక్షిణాది రాష్ట్రాల ప్రజలకు ఇష్టమైన ఇడ్లీ, దోశ పిండిపై 18% పన్ను, ఖర్జూర పండ్లపై 12% జీఎస్టీ బాదేశారు. వంటింట్లో ముఖ్యమైన చింతపండుపైనా 12% జీఎస్టీ వేశారు. చిన్న పిల్లలు ఇష్టంగా తినే కుల్ఫీపైనా 18%వడ్డించారు. జీర్ణ సంబంధమైన సమస్యలకు ఉత్తరాది ప్రజలు విరివిగా ఉపయోగించే ఇసాబ్‌గోల్‌పైనా 5% జీఎస్టీ ఉంది. జీఎస్టీతో ఓలా, ఉబర్ ప్రయాణ మూ భారమైంది. చివరికి, వర్షాకాలంలో ప్రతి ఒక్కరూ ఉపయోగించే ప్లాస్టిక్ రెయిన్ కోట్స్‌పైనా 28% జీఎస్టీ వడ్డించిం ది. పెంపుడు పిల్లి, కుక్కల ఆహారాన్ని కూడా వదలలేదు. దీనిపైనా 18% వడ్డించారు. గతంలో లీజ్డ్ వాహనాలపై 12.5-13% వ్యాట్ ఉండేది. జీఎస్టీతో ఇది 43 శాతానికి పె రిగింది. చాలామంది వ్యాపారులు ఇంకా కంప్యూటర్ బిల్లింగ్‌కు మారకపోవడం వినియోగదారుల పాలిట శాపంగా మారింది.

వైద్యం మరింత భారం



జీఎస్టీ దెబ్బకు డయాలసిస్, పేస్‌మేకర్ ఇంప్లాంటేషన్, ఆర్థోపెడిక్ సపోర్ట్ పరికరాలు, కేన్సర్ చికిత్స మరింత భారంగా మారాయి. ఈ విషయాన్ని కేంద్ర ఆరోగ్య శాఖే అంగీకరించింది. ఆర్థోపెడిక్స్‌లో ఉపయోగించే సపోర్ట్ పరికరాలపై పన్నును 5 నుంచి 12 శాతానికి పెంచారు. బ్లడ్ క్యాన్సర్ మినహా ఇతర రకాల కేన్సర్ పేషెంట్ల సపోర్ట్ పరికరాలపై పన్ను 5 నుంచి 12 శాతానికి పెరిగింది. రేడియాలజీ యంత్రాల్లో ఉపయోగించే కిట్స్ మినహా ఇతరవ్యాధి నిర్ధారణ కిట్స్‌పై 28% జీఎస్టీ వేశారు.

అధిక ధరలకే సరుకుల విక్రయం

జీఎస్టీ ప్రయోజనాలను వినియోగదారులకు బదిలీ చేయాలని కేంద్రం నిర్దేశించింది. జీఎస్టీ అమల్లోకి వచ్చిన జూలై 1 నుంచి పాత నిల్వలపైనా కొత్త ధరల స్టిక్కర్లు వే యాలని ఆదేశించింది. కానీ వ్యాపారులు చేతివాటం చూపిస్తున్నారు. ధరలు తగ్గిన వస్తువులను పాత ధరలకూ, ధర లు పెరిగిన వస్తువులను కొత్త ధరలకు విక్రయిస్తున్నట్టు రాష్ట్రవ్యాప్తంగా 'ఆంధ్రజ్యోతి' సేకరించిన సమాచారాన్ని బట్టి వెల్లడైంది. జీఎస్టీ తర్వాత 200 గ్రాముల సోయాసాస్ ధర రూ.50కి తగ్గింది. కానీ, రాజమండ్రిలో ఒక పెద్ద మాల్‌లో దీనిని రూ.80కి అమ్ముతున్నారు. ప్రింటింగ్ కాట్రిడ్జి పాత ధర రూ.530. జీఎస్టీ తర్వాత రూ.450 అయినా వ్యాపారులు రూ.530కే విక్రయిస్తున్నారు.



విద్యనూ విడిచి పెట్టలేదు

ఉన్నత విద్యా సంస్థలు, విశ్వవిద్యాలయాలను కూడా జీఎస్టీ వదిలిపెట్టలేదు. జీఎస్టీ కింద నమోదు చేసుకున్నారా లేదా తెలియజేయాలంటూ ఆచార్య నాగార్జున వర్సిటీ, కృష్ణా వర్సిటీలకు ఇటీవలే ఏపీ వాణిజ్య పన్నుల శాఖ నోటీసులు ఇచ్చింది. ఇప్పటి వరకూ వర్సిటీలకు సేల్స్ టాక్స్ గొడవలు గానీ, ఆదాయ పన్ను గొడవలు గానీ లేవు. ఒకవేళ వర్సిటీ సేవలపై జీఎస్టీ వర్తింపజేస్తే 18% పన్ను విధించే అవకాశం ఉంది. ఇదంతా కూడా విద్యార్థులపై పడే భారమే.

పుస్తకాలకూ సెగ

పుస్తకాల రూపంలోనూ విద్యార్థులపై భారీగా భారం పడనుంది. మెడికల్, ఇంజనీరింగ్, న్యాయ విద్య, ఆధ్యాత్మిక పుస్తకాలు మరింత ప్రియం కానున్నాయి. నవలలు, పాఠ్య గ్రంథాలు, గైడ్లు, టెస్ట్ పేపర్లు, క్వశ్చన్ బ్యాంకులు రాసినందుకు సబ్జెక్టును బట్టి ఏకమొత్తంగా, లేకపోతే పేజీకి ఇంత అని, పుస్తకం ధరపై ఇంత అని వివిధ రకాలుగా రచయితకు పబ్లిషర్లు రాయల్టీ ఇస్తుంటారు. ప్రింటింగ్, బైండింగ్, రాయల్టీలపై జీఎస్టీ 12% ఉంది. పబ్లిషర్లకు ఇన్‌పుట్ సబ్సిడీ లేకపోవడంతో ఈ భారం వినియోగదారులపైనే పడుతుంది.

దూరదర్శన్‌కు యూత్ లోగో

- ప్రజల నుంచి కొత్త డిజైన్ల ఆహ్వానం

న్యూఢిల్లీ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): దూరదర్శన్ లోగో త్వరలో మారనుంది. దూరదర్శన్ ఛానల్‌కు అద్భుతమైన లోగోని అందివ్వాలంటూ దేశ ప్రజలకు ప్రసారభారతి పిలుపునిచ్చింది. యువత అభిరుచులకు అనుగుణంగా ఉంటూనే దేశ సంస్కృతి సంప్రదాయలను దృష్టిలో ఉంచుకుని డీడీ హుందాతనం ఉట్టిపడేలా లోగో ఉండాలని కోరుతున్నారు. 1959లో ప్రారంభమైన డీడీలో ప్రస్తుతం 20 ఛానళ్లు ప్రసారమవుతున్నాయి.

కేంద్ర కేబినెట్లో జేడీయూ.. 2 బెర్తులు ఖాయం

న్యూఢిల్లీ/పట్నా, ఆగస్టు 12: బిహార్‌లో ఆర్‌జేడీ, కాంగ్రెస్‌తో తెగతెంపులు చేసుకుని అనాది మిత్రపక్షం బీజేపీతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన జేడీయూ అధినేత, సీఎం నితీశ్‌కుమార్.. ఇప్పుడు జాతీయ స్థాయిలోనూ ఎన్‌డీఏలో చేరనున్నారు. ఎన్‌డీఏ కూటమిలో చేరాలని బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా శుక్రవారం స్వయంగా ఆయన్ను ఆహ్వానించారు. దీనిని నితీశ్ ఆమోదించడం లాంఛనమేనని పార్టీ వర్గాలు తెలిపాయి. కేంద్ర మంత్రివర్గంలో జేడీయూకి రెండు స్థానాలు దక్కనున్నాయని వెల్లడించాయి. అలాగే నితీశ్‌కు కీలకమైన ఎన్‌డీఏ కన్వీనర్ బాధ్యతలు అప్పగించాలని ప్రధాని మోదీ భావిస్తున్నట్లు తెలిసింది.

కన్నడ హీరో ఉపేంద్ర కొత్తపార్టీ!

బెంగళూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ప్రముఖ కన్నడ హీరో, దర్శకుడు 46 ఏళ్ల ఉపేంద్ర రాజకీయ అరంగేట్రం చేయనున్నారు. అయితే, సొంతంగా కొత్తపార్టీని స్థాపించే యోచనలో ఉన్నట్టు ఆయన చెప్పారు. తన పార్టీ పేరును, గుర్తును ఇంకా నిర్ణయించలేదన్నారు.



వారి ఆచూకీ చెప్పండి

ఇద్దరు అల్‌కాయిదా ఉగ్రవాదుల పోస్టర్లు విడుదల

న్యూఢిల్లీ, ఆగస్టు 12: స్వాతంత్ర్య దినోత్సవం సమీపిస్తుండడంతో ఢిల్లీ పోలీసులు అప్రమత్తమవుతున్నారు. ఉగ్రదాడులు జరిగే ఆస్కారం ఉండడంతో ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. ఎక్కడికక్కడ పటిష్ఠ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నా మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదుల ఆచూకీ కోసం ఫొటోలను విడుదల చేశారు. దేశ రాజధాని వీధుల్లో ఇద్దరు అల్‌ఖైదా ఉగ్రవాదుల పోస్టర్లను అంటించింది ఢిల్లీ పోలీసు ప్రత్యేక విభాగం. వారి ఆచూకీ తెలిసిన వారు 011-24641278, 011-23016770 నంబర్లకు తెలపాలని పోలీసులు కోరారు. కాగా, స్వాతంత్ర్య దినోత్సవ నేపథ్యంలోనే శాంతి భద్రతలను పటిష్ఠ పరిచేందుకు, ఉగ్రదాడులు జరిగితే తిప్పికొట్టేందుకు 14 పరాక్రమ్ వ్యాన్లను ఎర్రకోట వద్ద ఢిల్లీ పోలీసులు శుక్రవారం నుంచే మోహరించారు.

ఫైనల్లో బోల్ట్ టీమ్

లండన్: ప్రొఫెషనల్ కెరీర్ వీడ్కోలు రేస్‌కు ముందు జరిగిన ఆఖరి పరుగును దిగ్గజ అథ్లెట్ ఉసేన్ బోల్ట్ విజయవంతంగా ముగించాడు. ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌లో శనివారం తెల్లవారుజామున జరిగిన పురుషుల 4x100 మీటర్ల రేస్‌లో జమైకా జట్టును అలవోకగా ఫైనల్‌కు చేర్చాడు. బోల్ట్ ఆధ్వర్యంలో రెండో హీట్‌లో తలపడిన డిఫెండింగ్ చాంపియన్ జమైకా 37.95 సెకన్లతో రేస్‌ను పూర్తి చేసింది. తమ సీజన్ అత్యుత్తమంతోపాటు రేస్‌లో మూడో అత్యుత్తమ సమయాన్ని జమైకా జట్టు నమోదు చేసింది. టైక్వెండొ ట్రాసె, జులియన్ ఫోర్ట్, మైకెల్ క్యాంప్‌బెల్, బోల్ట్‌లతో కూడిన జమైకా టీమ్ ఎనిమిది జట్ల రెండో హీట్‌లో రేస్ ఆరంభం నుంచి ముగింపు వరకూ ఆధిక్యం ప్రదర్శించింది. మూడో లెగ్‌లో పరుగెత్తిన బోల్ట్ తనదైన స్టైల్‌లో క్యాంప్‌బెల్ నుంచి బ్యాటన్ అందుకొని ప్రత్యర్థులెవరికీ అందకుండా ముందుకు సాగాడు. అయితే ఫైనల్ రేస్‌లో సత్తా చాటేందుకు అవసరమైన శక్తికోసం ఫినిషింగ్ లైన్ సమీపంలోకి వచ్చేసరికి వేగాన్ని ఒకింత తగ్గించాడు. మైక్ రాడ్జెర్స్, జస్టిన్ గాట్లిన్, బీ జే లీ, క్రిస్టియన్ కోల్‌మన్‌లతో కూడిన అమెరికా జట్టు 37.70 సెకన్లతో ఫైనల్‌కు చేరింది. బ్రిటన్, ఫ్రాన్స్, చైనా, జపాన్, టర్కీ, కెనడా జట్లు కూడా ఫైనల్‌కు అర్హత పొందాయి.

మహిళల్లో..: మహిళల 4x100 మీటర్ల రిలేలో అమెరికా, బ్రిటన్, జర్మనీ, జమైకా జట్లు ఫైనల్లో ప్రవేశించాయి.

షిపెర్స్‌కు 200 మీ. స్వర్ణం: వరల్డ్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్స్ మహిళల 200మీ. స్వర్ణాన్ని హాలెండ్‌కు చెందిన డాఫ్ని షిపెర్స్ గెలుచుకుంది. ఫైనల్ రేస్‌ను 22.05 సెన్లలో పూర్తి చేసిన షిపెర్స్ అగ్రస్థానంలో నిలిచింది. ఐవరీకోస్ట్‌కు చెందిన మేరీ జోస్.. షిపెర్స్‌కు తీవ్ర పోటీ ఇచ్చినా 22.08 సెకన్లతో రజతంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. షానె మిల్లర్ ఉల్బొ (బహామస్) 22.15 సెకన్లతో కాంస్యం కైవసం చేసుకుంది.

రీస్.. పసిడి జంప్: మహిళల లాంగ్‌జంప్‌లో అమెరికా అథ్లెట్ బ్రిట్నీ రీస్ మూడో ప్రయత్నంలో 7.02 మీ. దూకి పసిడి పతకం చేజిక్కించుకుంది. రష్యాకు చెందిన క్లిషీనా (7మీ) రజతం, బర్టోలిటా (అమెరికా-6.97 మీ.) కాంస్యం నెగ్గారు.

భారత మహిళల జట్టుపై అనర్హత

జిస్నా మాథ్యూ, పూవమ్మ, అనిల్డా థామస్, నిర్మలా షరోన్‌లతో కూడిన భారత మహిళల 4x400 మీ. రిలే జట్టు 3ని28.62 సెకన్లతో తొలి హీట్‌లో ఏడో స్థానంలో నిలిచింది. అయితే మొదటి లేన్‌లో పరుగెత్తిన జిస్నా.. లేన్‌ను అతిక్రమించడంతో జట్టుపై అనర్హత వేటు పడింది. కున్హు మహ్మద్, జాకబ్, అనాస్, రాజీవ్‌లతో కూడిన భారత పురుషుల జట్టు 4x400 మీ రిలేలో 3ని 02.92 సెకన్లతో మొదటి హీట్‌లో ఐదో స్థానంతో మొత్తంగా 10వ స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించలేకపోయింది.



బోల్ట్..బోల్ట్..బోల్ట్..అది ఒలింపిక్స్ అయినా వరల్డ్ చాంపియన్‌షిప్స్ అయినా కిక్కిరిసిపోయే స్టేడియాలలో వేలాదిమంది అభిమానుల నోట వెలువడే ఒకేఒక మాట..ఏ ప్రపంచ పోటీల్లో అయినా మిగతా ఈవెంట్లన్నీ ఒక ఎత్తయితే..బోల్ట్ బరిలోదిగే 'పరుగు'లు మరో ఎత్తు..హీట్స్ మొదలు ఫైనల్ వరకూ ప్రేక్షకులను ఓపిగ్గా సీట్లకు అతుక్కుపోయేలా చేసే 'పవర్' ఈ దిగ్గజ అథ్లెట్‌ది. ఒలింపిక్స్‌లో ఉస్సేన్ బోల్ట్ ఎనిమిది స్వర్ణాలతో పతకాలకే అసూయ పుట్టించాడు..!ప్రఖ్యాత వరల్డ్ అథ్లెటిక్స్‌లో అతనొక్కడే పదికిపైగా పసిడి పతకాలు కొల్లగొట్టాడు..!
ఎక్కడో జమైకా అనే చిన్న దేశంలో పుట్టి.. ఆటకే వన్నె తెచ్చిన మేరునగ ధీరుడతను..!
స్వచ్ఛమైన ఆటతో.. ఎవరికీ అందనంత ఎత్తుకు ఎదిగాడు..!
ఊహాతీత ప్రదర్శనతో.. పరుగుల చిరుతగా మారాడు.. పరుగుకే పరుగు నేర్పిన వీరుడయ్యాడు..!
దశాబ్ద కాలంగా తన వేగంతో ప్రపంచానికి వినోదాన్ని పంచుతూ.. తన పతకాలతో స్ఫూర్తి పాఠాలు నింపుతూ.. తన రికార్డులతో సగటు క్రీడాకారుడికి లక్ష్యాలు నిర్దేశిస్తూ.. సెలవు తీసుకున్నాడు..!

నీ పరుగుకు దాసోహం

> **చి**న్నప్పుడు పేదరికంలో మగ్గిన బోల్ట్.. డబ్బు సంపాదించి తన తల్లికి వాషింగ్ మిషన్‌ను కొనివ్వాలని ఉబలాటపడ్డాడు. కెరీర్‌లో ప్రైజ్‌మనీ, ఎండార్స్‌మెంట్ల రూపంలో అతను 100 నుంచి 150 మిలియన్ డాలర్లు అర్జించాడు.

> క్రికెట్‌తో పాటు చిన్నప్పటి నుంచే రేస్‌ల్లో పాల్గొనేవాడు. తన వయసు వారికంటే పెద్దగా, ఎప్పుడూ ఉత్సాహంతో కనిపించే బోల్ట్ ఎవరైనా తనను ఓడిస్తే ఏడ్చేవాడు. ఓటమి అంటే అతనికి చిన్నప్పటినుంచే ఇష్టం లేదు.

బోల్ట్ ప్రపంచ రికార్డులు

- 100 మీటర్ల పరుగు : 9.58 సెకన్లు
- 200 మీటర్ల పరుగు : 19.19 సెకన్లు
- 4 x100 రిలే: 36.84 సెకన్లు (జమైకా జట్టు తరపున)

'**నే**నిపుడు ఒక దిగ్గజాన్ని. ప్రస్తుతం జీవించి ఉన్న వారిలో అత్యుత్తమ అథ్లెట్‌ను నేనే' 2012లో వరుసగా ఏడోసారి 100 మీ, 200 మీ వరల్డ్ టైటిల్స్ నెగ్గిన తర్వాత బోల్ట్ పలికిన పలుకులివి. సాధారణంగా ఎవరైనా నేనే గొప్ప అంటే అతనికి గర్వం అనుకుంటాం. కానీ, బోల్ట్ ఈ మాట చెబితే ముక్తకంఠంతో నిజమే అన్నాం. ప్రపంచ అథ్లెటిక్స్‌పై అంతలా తన ముద్ర వేశాడు ఉస్సేన్. 3 ప్రపంచ రికార్డులు, 8 ఒలింపిక్ స్వర్ణాలు, 11 వరల్డ్ చాంపియన్‌షిప్ స్వర్ణాలతో దశాబ్దం పాటు స్ప్రింట్‌ను ఏలిన బోల్ట్ నిస్సందేహంగా గ్రేట్.. గ్రేటెస్ట్..! మరే ఆటలో అయినా.. ఒకరిని మించి మరొకరుంటారు. కానీ, ట్రాక్ అండ్ ఫీల్డ్ అంటే బోల్ట్. స్ప్రింట్ అంటే బోల్ట్. 100 మీటర్లు, 200 మీటర్లు.. 4x100 రిలే.. అంటే గుర్తొచ్చేది అతనే. ఏ పోటీ అయినా.. నేనే ముందు తర్వాతే లోకమంతా అని చాటిన అనితర సాధ్యుడు సెలవు తీసుకుంటుంటే.. అతను లేని ట్రాక్‌ను ఊహించుకోవాలంటేనే గుండె బరువెక్కుతోంది. అంతలా జనాన్ని తన మైకంలో ముంచెత్తాడు ఈ జమైకన్. గత రికార్డుల్ని బద్దలు కొడుతూ.. కొత్త చరిత్రను లిఖిస్తూ... సాగిన అతని వేగానికి లోకమంతా ఫిదా అయింది. భారీ అంచనాల నడుమ 2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో 100 మీ, 200 మీ, 4-100 రిలేలో స్వర్ణాలు గెలిచి ప్రపంచ అథ్లెటిక్స్‌ను విస్మయపరిచాడు. 2012, 2016లోనూ ట్రిపుల్ మెడల్స్‌తో రికార్డు నెలకొల్పాడు. ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో అయితే 2011 తప్ప 2009 నుంచి 2015 వరకూ వివిధ విభాగాల్లో చాంపియన్ కావడం అతని సత్తాకు నిదర్శనం. అయితే, ఉస్సేన్ ప్రయాణం పూల బాట ఏమీ కాలేదు. అంచనాలు అతడిపై ఒత్తిడి పెంచాయి. గాయాలు ఇబ్బంది పెట్టాయి. 2004 ఏథెన్స్ ఒలింపిక్స్‌లో పతకం పట్టేయాలన్న లక్ష్యంతో బరిలోకి దిగినా కాలిగాయంతో ఆరంభ రౌండ్‌లోనే ఇంటిదారి పట్టాడు. స్కోలియాసిస్ (వెన్నెముక పక్కకు వంగడం) వ్యాధితో ఒక దశలో అతను పరుగుకు స్వస్తి చెబుతాడేమో అనిపించింది. కానీ, కష్టాలకు వెరవకుండా.. గాయాలకు లొంగకుండా.. ఎదురొడ్డి పోరాడిన అతను అన్నింటినీ గెలిచాడు. అథ్లెటిక్స్ సామ్రాజ్యాన్ని దశాబ్దం పాటు ఏకచత్రాధిపత్యంతో ఏలిన బోల్ట్ పరుగు ఇక ఆగిపోతుండవచ్చు. ట్రాక్‌లో బోల్ట్‌ను మళ్లీ చూసే భాగ్యం దక్కకపోవచ్చు.. అతనికి కోసమే కిక్కిరిసిపోయే స్టేడియాలు ఖాళీగా దర్శనమిస్తుండవచ్చు.. బోల్ట్ 'టు ద వరల్డ్' ప్రత్యేక పోజులు మళ్లీ కనబడకపోవచ్చు.. కానీ, పరుగుకే పరుగు నేర్పి ట్రాక్‌పై అతను వేసిన ముద్ర మాత్రం ఎప్పటికీ చెరిగిపోదు..


మిస్టర్ క్లీన్..: చరిత్రలో నిలిచి పోయిన దిగ్గజ క్రీడాకారుల మాదిరిగా కాకుండా తన కెరీర్ కొనసాగుతుండగానే బోల్ట్ ఎనలేని ఖ్యాతినార్జించాడు. డోపింగ్ మకిలి ప్రపంచ అథ్లెటిక్స్‌ను దిగజారుస్తున్నా దశాబ్దంపాటు ఎనలేని కీర్తిని అందుకున్నాడతను. వంద మీటర్లలో 30 అత్యుత్తమ టైమింగ్స్‌లో తొమ్మిది బోల్ట్‌వే. అందులో నాలుగు అత్యుత్తమం. మిగతా 21 మంది తమ జీవితంలో ఎప్పుడో ఒకసారి డోపింగ్‌లో పట్టుబడిన వారే. దాన్ని బట్టి ఉసేస్ నిజాయితీ చెప్పొచ్చు. తన పొడవాటి కాళ్లతో కేవలం 41 అంగల్లోనే వంద మీటర్ల రేసును ముగించేస్తాడు. మిగతావారికి 50 అంగలు అవసరం అవుతాయి.

పుట్టుకే ఆలస్యం.. జీవితం వేగమే..: అసలు బోల్ట్ పుట్టుకే ఆలస్యం. ఒకటిన్నర వారం ఆలస్యంగా పుట్టాడతను. కానీ, జీవితంలో అతనెప్పుడూ ముందే..! బోల్ట్ పూర్తి పేరు ఉస్సేన్ సెయింట్ లీ బోల్ట్. 1986 ఆగస్టు 21న జమైకాలోని మారుమూల ప్రాంతమైన షెర్వూడ్ కంటెంట్‌లో జెన్నిఫర్, వెలెస్లీకి జన్మించాడు. వెలెస్లీకి అంతకుముందే పెళ్లయి ఇద్దరు పిల్లలున్నారు. ఎక్కువ మంది పిల్లలు ఉంటే పోషణ భారం అవుతుందని తల్లి జెన్నిఫర్ బోల్ట్ ఒక్కడే చాలనుకుంది. బోల్ట్‌కు బలవర్ధకమైన ఆహారం ఇస్తూ ప్రపంచాన్ని జయించే వీరుడిని తయారు చేసింది. కొండ ప్రాంతంలో సరైన రోడ్లు, నీటి సౌకర్యంలేని ఆ గ్రామంలో వెలెస్లీ నడిపే కిరాణా కొట్టే కుటుంబానికి జీవనాధారం. బోల్ట్ సమ్‌థింగ్ స్పెషల్ అని పుట్టినప్పుడే గ్రహించాడు అతడి తాత. అదే విషయాన్ని జెన్నిఫర్‌కు చెప్పాడు. తన శక్తి తెలిసినా.. బోల్ట్ ఎప్పుడూ అతిగా ఆలోచించే వాడు కాదు. తండ్రికి మాత్రం ఉస్సేన్‌పై అంతగా అంచనాలు ఉండేవి కావు.

క్రికెటర్ కాబోయి.. : చిన్నతనంలో బోల్ట్ అల్లరి పిల్లాడు. ఒక చోట కుదురుగా కూర్చొనేవాడు కాదు. తండ్రి మాట వినేవాడు కాదు. డాక్టర్ దగ్గరికి తీసుకెళ్తే 'మీ వాడు హైపరాక్టివ్' అని చెప్పడంతో మరింత కంగారు పడ్డాడు. అయితే, పాఠశాలలో క్రికెట్, ఫుట్‌బాల్, రన్నింగ్ ఆడడం మొదలు పెట్టాక బోల్ట్ కాస్త కుదుటపడ్డాడు. సోదరుడితో కలిసి వీధుల్లో క్రికెట్ ఆడేవాడు. మంచి బ్యాట్స్‌మన్‌గానే కాకుండా ఫాస్ట్ బౌలర్‌గానూ రాణించేవాడు. అయితే పిచ్ మీద బోల్ట్ వేగాన్ని చూసిన క్రికెట్ కోచ్ ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్లపై దృష్టి పెట్టాలని సూచించాడు. అప్పుడే బోల్ట్ జీవితం మలుపు తిరిగింది.

జోక్ చేసి లాకప్‌లోకి..

> **టీ**నేజ్‌లో బోల్ట్ అంతగా క్రమశిక్షణతో ఉండేవాడు కాదు. కొన్నిసార్లు శిక్షణ ఎగ్గొట్టి స్నేహితులతో తిరిగేవాడు. కారిఫ్టా టోర్నీలో 200 మీటర్ల ఫైనల్ సన్నాహకాలు ఎగ్గొట్టి ఓ వ్యాన్ వెనకాల దాక్కున్నాడు. అతను తరచుగా వేసే ప్రాక్టికల్ జోక్స్ కోచ్ మెక్‌నీల్‌కు కోపం తెప్పించేవి. ఒకసారి ప్రాక్టికల్ జోక్ చేసినందుకు ఉస్సేన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు కూడా.



ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం

టైటాన్స్ ఆరో 'సారీ'..



యూపీ చేతిలో చిత్తు

రాహుల్ చౌదరిని పట్టేసిన ప్రత్యర్థి ఆటగాళ్లు

అహ్మదాబాద్: ప్రొ కబడ్డీ లీగ్ ఐదో సీజన్‌లో తెలుగు టైటాన్స్ జట్టు ఆట.. రాత మారడం లేదు. గత మ్యాచ్‌ను టై చేసుకున్న టైటాన్స్ మళ్లీ నిరాశ పరిచింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో 32-39తో చిత్తయి టోర్నీలో ఆరో ఓటమిని మూటగట్టుకుంది. కెప్టెన్ రాహుల్ చౌదరి (12 పాయింట్లు), రక్షిత్ (6) సత్తాచాటినా.. మిగతా ఆటగాళ్లు పూర్తిగా విఫలమయ్యారు. యూపీ జట్టులో కెప్టెన్ నితిన్ తోమర్ (10), రిషాంక్ దేవడిగా (6), రాజేష్ నర్వాల్ (5) రాణించారు. ఆరంభంలో ఇరు జట్లు నువ్వానేనా అన్నట్టు తలపడ్డాయి. 11వ నిమిషంలో రాహుల్ ఒకే రైడ్‌లో నాలుగు పాయింట్లు తెచ్చి జట్టును 10-7తో ఆధిక్యంలో నిలిపాడు. దీన్ని సద్వినియోగం చేసుకోలేకపోయిన టైటాన్స్ అనవసర టాకిల్స్‌తో పాయింట్లు కోల్పోయి 13-14తో ఫస్టాఫ్‌ను ముగించింది. విరామం తర్వాత జోరు పెంచిన తెలుగు జట్టు 27వ నిమిషంలో ప్రత్యర్థిని ఆలౌట్ చేసి 24-22తో ముందంజ వేసింది. కానీ, ఈ దశలో యూపీ ఒక్కసారిగా విజృంభించింది. కాగా, మరో మ్యాచ్‌లో గుజరాత్ ఫార్చూన్ జెయింట్స్ 29-25తో దబాంగ్ ఢిల్లీని ఓడించింది.

నేటి మ్యాచ్‌లు

పట్నా X యూపీ యోధా
గుజరాత్ X జైపూర్

ధవన్ దంచేసినా..

● మిడిలార్డర్ ఫ్లాప్ షో ● భారత్ 329/6 ● లంక బౌలర్ల పోరాటం



ధవన్ (119) రాహుల్ (85)

క్యాండీ: తొలి రెండు టెస్టుల్లో తేలిపోయిన శ్రీలంక ఆఖరాటలో భారత్‌కు గట్టి పోటీ ఇస్తోంది. శనివారం మొదలైన మూడో టెస్టులో తొలి రోజు చివరకు భారత్ 6 వికెట్లకు 329 పరుగులు చేసింది. శిఖర్ ధవన్ (123 బంతుల్లో 17 ఫోర్లతో 119) మెరుపు సెంచరీ చేయగా, లోకేశ్ రాహుల్ (135 బంతుల్లో 8 ఫోర్లతో 85) వరుసగా ఏడో హాఫ్ సెంచరీతో ప్రపంచ రికార్డు సమం చేశాడు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 188 పరుగుల రికార్డు భాగస్వామ్యం నెలకొల్పినా మిడిలార్డర్ వైఫల్యంతో భారత్ తడబడింది. కెప్టెన్ కోహ్లీ (42), అశ్విన్ (31) ఫర్వాలేదనిపించగా, పుజారా (8), రహానె (17) నిరాశపరిచారు. లంక స్పిన్నర్లు పుష్పకుమార (3/40), లక్షన్ సందకన్ (2/84) భారత జోరును అడ్డుకున్నారు. సాహా (13 బ్యాటింగ్), హార్దిక్ పాండ్యా (1 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

ఓపెనర్ల వీర విహారం..: టాస్ నెగ్గి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఓపెనర్లు అదిరిపోయే ఆరంభం ఇచ్చారు. తాను దుర్కొన్న రెండో బంతినే బౌండ్రీకి చేర్చిన ధవన్ ప్రత్యర్థికి హెచ్చరిక పంపాడు. కుమార వేసిన నాలుగో ఓవర్లో రాహుల్ కూడా బౌండ్రీలతో ఖాతా తెరిచాడు. అతని బౌలింగ్‌లోనే మరో రెండు ఫోర్లతో చెలరేగాడు. ఇంకో ఎండ్‌లో శిఖర్ బౌండ్రీలే లక్ష్యంగా బ్యాటింగ్ చేశాడు. మంచి బౌన్స్ లభిస్తున్నా.. పేసర్లు లాహిరు కుమార, ఫెర్నాండోలను సమర్థంగా ఎదుర్కొన్న ఓపెనర్లు.. 107 బంతుల్లోనే 100 పరుగులు జోడించారు. ఈ క్రమంలో ధవన్ 47 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకోగా.. రాహుల్ 67 బంతుల్లో ఈ మార్క్ చేరాడు. అయితే, ఇన్నింగ్స్ 40వ ఓవర్లో పుష్పకుమార వేసిన గుడ్ లెంగ్త్ బాల్‌ను తప్పుగా అంచనా వేసి మిడాన్‌లో కరుణరత్నెకు క్యాచ్ ఇచ్చిన రాహుల్ సెంచరీ చేసే అవకాశాన్ని కోల్పోయాడు. అయినా.. వెనక్కి తగ్గని ధవన్.. పుష్పకుమార బౌలింగ్‌లో మిడాఫ్ మీదుగా బౌండ్రీ కొట్టి 107 బంతుల్లోనే కెరీర్‌లో ఆరో సెంచరీ పూర్తి చేశాడు. పుజారాతో కలిసి 31 పరుగులు జోడించాడు. భారీ ఇన్నింగ్స్ ఆడేలా కనిపించిన ధవన్ స్వీప్ షాట్ ప్రయత్నంలో అవుటయ్యాడు.

ఆతిథ్య బౌలర్ల జోరు... : క్రీజులో అసౌకర్యంగా కనిపించిన పుజారాను పెవిలియన్ చేర్చిన సందకన్ భారత్‌కు షాకిచ్చాడు. మూడో సెషన్‌లో ఆతిథ్య జట్టు మరింత ఆధిపత్యం చెలాయించింది. కోహ్లీతో కలిసి 35 పరుగులు జోడించిన రహానెను పుష్పకుమార స్ట్రెయిట్ బాల్‌తో బోల్తాకొట్టించాడు. ఈ దశలో అశ్విన్‌తో కలిసి కోహ్లీ ఆచితూచి బ్యాటింగ్ చేశాడు. ఈ ఇద్దరూ కుదురుకున్న దశలో సందకన్..విరాట్‌ను అవుట్ చేసి లంక శిబిరంలో మరింత ఉత్సాహం నింపాడు. ఇక మొదటి రోజు ఆట చివర్లో ఫెర్నాండో బౌలింగ్‌లో అశ్విన్ వెనుదిరిగాడు.

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్ : ధవన్ (సి) చాందిమల్ (బి) పుష్పకుమార 119, రాహుల్ (సి) కరుణరత్నె (బి) పుష్పకుమార 85, పుజారా (సి) మాథ్యూస్ (బి) సందకన్ 8, కోహ్లీ (సి) కరుణరత్నె (బి) సందకన్ 42, రహానె (బి) పుష్పకుమార 17, అశ్విన్ (సి) డిక్‌వెలా (బి) ఫెర్నాండో 31, సాహా (నాటౌట్) 13, హార్దిక్ (నాటౌట్) 1; **ఎక్స్‌ట్రాలు: 13; మొత్తం: 90 ఓవర్లలో 329/6; వికెట్ల పతనం:** 1-188, 2-219, 3-229, 4-264, 5-296, 6-322; **బౌలింగ్:** ఫెర్నాండో 19-2-68-1, లాహిరు కుమార 15-1-67-0, కరుణరత్నె 5-0-23-0, పెరీర 8-1-36-0, లక్షణ్ సందకన్ 25-2-84-2, పుష్పకుమార 18-2-40-3.

భారత్‌కు డ్యురాంట్ క్షమాపణ



న్యూఢిల్లీ: భారత్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు అమెరికా బాస్కెట్‌బాల్ స్టార్ కెవిన్ డ్యురాంట్ శనివారం క్షమాపణలు చెప్పాడు. విజ్ఞాన సముపార్జనలో భారత్ 20 ఏళ్లు వెనుక బడిఉందని, ఇక్కడి ప్రజల నాగరికత, జీవన విధానం ఎంతో నాటుగా ఉందంటూ అలాంటి వారికి బాస్కెట్‌బాల్ ఆట కావాల్సి వచ్చిందా..అని డ్యురాంట్ ఎద్దేవా చేసిన సంగతి తెలిసిందే. ఇటీవలి తన భారత పర్యటన అనంతరం అతడీ వ్యాఖ్యలు చేశాడు. అయితే దీనిపై డ్యురాంట్ వివరణ ఇస్తూ తన వ్యాఖ్యల్ని వేరుగా అర్థం చేసుకున్నారన్నాడు.

క్రికెట్ అడ్మినిస్ట్రేషన్‌కు మోదీ గుడ్‌బై!



న్యూఢిల్లీ: వివాదాస్పద ఐపీఎల్ మాజీ చైర్మన్ లలిత్ మోదీ క్రికెట్ పరిపాలనా వ్యవహారాలకు గుడ్‌బై చెప్పాడు. నాగ్‌పూర్ జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష పదవికి రాజీనామా చేసినట్టు మోదీ శనివారం ప్రకటించాడు. ఈ మేరకు రాజస్థాన్ క్రికెట్ సంఘం (ఆర్‌సీఏ) అధ్యక్ష పదవి నుంచి కూడా తప్పుకుంటున్నట్టు బీసీసీఐ సీఈఓ రాహుల్ జోహ్రికి లలిత్ లేఖ రాశాడు. దక్షిణాఫ్రికా (2009)లో నిర్వహించిన ఐపీఎల్‌లో ఆర్థిక అవకతవకలకు పాల్పడినట్టు లలిత్ ఆరోపణలు ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మనీలాండరింగ్ కేసు నమోదు చేయడంతో ప్రస్తుతం లలిత్ లండన్‌లో తలదాచుకుంటున్నాడు.

రన్నరప్ ఆనంద్

సెయింట్ లూయిస్ (అమెరికా): సింక్‌ఫీల్డ్ కప్ తొమ్మిదో, ఆఖరి రౌండ్‌ను గ్రాండ్‌మాస్టర్ ఆనంద్ డ్రాగా ముగించాడు. అమెరికాకు చెందిన వెస్లీ సోతో గేమ్‌ను 33 ఎత్తుల్లో డ్రా ముగించిన ఆనంద్..మొత్తం 5.5 పాయింట్లతో సంయుక్తంగా రెండో స్థానంలో నిలిచాడు. మాగ్జిమ్ వాషిర్ లగ్రావ్ (ఫ్రాన్స్) ఆరు పాయింట్లతో టైటిల్ కైవసం చేసుకున్నాడు.

డీఎన్‌ఏ కలిపిన బంధం



- **46 ఏళ్ల తర్వాత తల్లి ఒడికి..!**

డల్లాస్, ఆగస్టు 12: ఊహ తెలిసే నాటికి కన్న తల్లి ఎలా ఉందో, ఎక్కడ ఉందో తెలీదు. ఎలాగైనా అమ్మను చూడాలని ఆరాటపడ్డాడు. అందుకోసం వెతకని చోటు లేదు. తిరగని ప్రాంతం లేదు. అడగని చిరునామా లేదు. ఇక దొరకదా.. అన్న నైరాశ్యంలో ఉన్న తరుణంలో అతడికి చిన్న దారి దొరికింది. అదే.. డీఎన్‌ఏ. 46 ఏళ్ల క్రితం వేరైన తల్లీకొడుకుల రక్త సంబంధాన్ని డీఎన్‌ఏ కలిపింది. 1970లో అమెరికాలోని ప్యూర్టోరికో భర్తతో గొడవ పడి ఎల్సీ రమిరేజ్(64) చెప్పాపెట్టకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. అప్పటికే ఆమెకు ఇద్దరు కుమారులు రేమండ్ అంబ్రూ(47), ఆంటోని విగ్స్(46). కొన్నాళ్లకు రేమండ్‌ను అతడి నానమ్మ, తాతయ్య తీసుకెళ్లగా, ఆంటోనిని అతడి నాన్న ఒక కుటుంబానికి దత్తత ఇచ్చాడు. అమ్మ ఏమైందో తెలీదు. తండ్రి చనిపోయాడు. ఎవరికి వారు చెల్లాచెదురయ్యారు. కానీ, తనవారిని కలవాలన్న ఆశ ఆంటోనీలో వేళ్లూనుకుంది. ఆంటోనిని దత్తత తీసుకున్న కుటుంబం అతడికి జన్మదిన ధ్రువపత్రం చూపించారు. దాని సాయంతో 27వ ఏట అన్న రేమండ్స్ జాడ కనుగొన్నాడు. ఇద్దరూ తల్లికోసం వెతుకులాట ప్రారంభించారు. తల్లిని కనిపెట్టాలన్న కసిని గుర్తించిన ఆంటోని గర్ల్‌ఫ్రెండ్ అతడికి మేలో డీఎన్‌ఏ పరీక్ష చేయించింది. రికార్డుల్లో అతడి డీఎన్‌ఏతో ఎవరిదైనా కలుస్తుందోనని చూశారు. నిరీక్షణ ఫలించింది. ఓ అజ్ఞాత వ్యక్తి డీఎన్‌ఏతో ఆంటోని డీఎన్‌ఏ కలిసింది. అతడు ఎల్సీ మేనల్లుడే. ఆరా తీస్తే తల్లి బతికే ఉందని తెలిసింది. శుక్రవారం ఇద్దరూ డల్లాస్ ఫోర్ట్‌వర్త్ విమానాశ్రయంలో తల్లిని కలుసుకున్నారు.

రైతు ఆత్మహత్యలు తగ్గాలంటే..

పురుగు మందులు నిషేధించాల్సిందే

- **శ్రీలంక, బంగ్లాదేశ్ సహా 5 దేశాల్లో సత్ఫలితాలు**
- **భారత్ సహా 5 దేశాల్లో పురుగు మందుల నియంత్రణ**
- **నియంత్రణ కాదు నిషేధమే మంచిది: బ్రిటన్ పరిశోధకులు**

లండన్, ఆగస్టు 12: వర్షాల్లేకనో, వరదల వల్లో రైతులు పంటను నష్టపోతున్నారు. వాటన్నింటినీ తట్టుకుని పంటను దక్కించుకున్నా దళారుల రాజ్యంలో సరైన ధర రాక నష్టపోతున్నారు. వాటికి తోడు పంట పెట్టుబడికి చేసిన అప్పులు మూటల్లా పెరిగిపోయి రైతన్న నడ్డి విరుస్తున్నాయి. వాటికి సరైన పరిష్కారం చావే అనుకుని పంటకు కొట్టాల్సిన పురుగు మందులను గొంతులోకి ఒంపేసుకుని జీవం విడుస్తున్నాడు రైతు. ఇలా ఉసురు తీసుకుంటున్న రైతును కాపాడేందుకు పరిశోధకులు ఓ పరిష్కారం చూపిస్తున్నారు. ఆ పరిష్కారమే ప్రమాదకర పురుగు మందులను నిషేధించడం. అవును, పురుగు మందుల దిగుమతి, అమ్మకాలపై నిషేధం విధిస్తే రైతుల ఆత్మహత్యలు తగ్గుతాయంటున్నారు. బ్రిటన్‌కు చెందిన బ్రిస్టల్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు దీనిపై అధ్యయనం చేశారు. 14-20% ఆత్మహత్యలు పురుగు మందుల వల్లే సంభవిస్తున్నాయన్న ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ఆధారంగా ఈ అధ్యయనం చేశారు. ప్రమాదకర పురుగు మందులను నిషేధించడం ద్వారా ఏటా కొన్నివేల ఆత్మహత్యలను నివారించవచ్చని అధ్యయనానికి నేతృత్వం వహించిన ప్రొఫెసర్ డేవిడ్ గనెల్ చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా వాటిని నిషేధిస్తే పొలాల్లో వాటి వాడకం తగ్గిపోతుందన్నారు. 16 దేశాలపై (5 అల్ప, మధ్య ఆదాయ దేశాలు, 11 అధిక ఆదాయ దేశాలు) 27 అధ్యయనాలు నిర్వహించారు. శ్రీలంక, బంగ్లాదేశ్ సహా 6 దేశాల్లో నిషేధం విధించగా 5 దేశాల్లో ఫలితాలు కనిపించాయన్నారు. శ్రీలంక, బంగ్లాదేశ్‌ల్లో ఆత్మహత్యలు గణనీయంగా తగ్గిపోయాయన్నారు. భారత్ సహా 5 దేశాల్లో వాటి అమ్మకాలపై ఆంక్షలు విధించగా ఆశాజనక ఫలితాలు కనిపించలేదన్నారు. ప్రమాదకర పురుగుమందులను వాడుతున్న అల్ప, మధ్య ఆదాయ దేశాల్లో నిషేధించాలని, వాటి స్థానంలో మెరుగైన కలుపు నివారణకు సురక్షిత, తక్కువ విషపూరిత మందులు తేవాలని సూచించారు. పురుగు మందులను నిషేధిస్తే పంట దిగుబడులు తగ్గే అవకాశం ఉందన్న వాదనలను ఆయన కొట్టిపారేశారు.



అంతర్జాతీయ యుద్ధ ట్యాంకుల పోటీ బయథ్లాన్‌లో భారత్‌కు ఓటమి ఎదురైంది. అప్పటి వరకు పోటీలో ఉన్న దేశాలకు ముచ్చమటలు పట్టించిన భారత్ సెమీ ఫైనల్‌లో వెనుదిరగాల్సి వచ్చింది. రష్యాలోని అలాబినోలో జరుగుతున్న బయథ్లాన్‌లో 19 దేశాలు పోటీలోకి దిగాయి. భారత్ అధునాతన టీ-90 యుద్ధ ట్యాంకులను రంగంలోకి దించింది. కాగా, ఈ పోటీలో సెమీ ఫైనల్స్ నుంచి రష్యా, చైనా, బెలారస్, కజఖ్‌స్థాన్ తుది దశ పోరుకు చేరాయి. రష్యా, కజఖ్‌స్థాన్‌లు టీ-72బీ3 ట్యాంకులతో పోటీలోకి దిగాయి. బెలారస్ అధునాతన టీ-72ను, చైనా తమ స్వదేశీ యుద్ధ ట్యాంకు 96బీని పోటీలోకి దింపింది.

భారత్-చైనా చర్చలు అసంపూర్ణం

- **డోక్లాంపై సైనికాధికారుల ఫ్లాగ్ భేటీ.. సేనల ఉపసంహరణపై ఎవరి వాదన వారిదే**

న్యూఢిల్లీ, ఆగస్టు 12: డోక్లాం సంక్షోభ పరిష్కారానికి దౌత్యపరంగానే గాక ఉభయ సైన్యాల తరపున కూడా శాంతి చర్చలు సాగుతున్నాయి. ఇప్పటికే చైనా సరిహద్దు పొడవునా బలగాలను మోహరించి.. తన మీడియా ద్వారా సమర నినాదాలు చేయిస్తోంది. ముందుజాగ్రత్త చర్యగా భారత్ కూడా 45 వేల మంది జవాన్లను తరలించింది. ఈ పరిస్థితుల్లో భారత్, చైనా సైన్యాల బ్రిగేడ్ కమాండర్ల స్థాయి అధికారులు ఈ నెల 8న సమావేశమై మంతనాలు జరిపారు. బోర్డర్ పెట్రోల్ మేనేజ్‌మెంట్(బీపీఎం)ను సమావేశపరచాలని నిర్ణయించారు. తదనుగుణంగా ఉభయ పక్షాల మేజర్ జనరల్ ర్యాంకు అధికారులు మొత్తం ఐదు సరిహద్దు ప్రాంతాల్లో.. సిక్కింలోని నాథులా పాస్, లడఖ్‌లోని దౌలత్ బేగ్ ఓల్డీ, చుసుల్.. అరుణాచల్‌లోని కిబితూ, బుమ్-లా వద్ద శుక్రవారం విస్తృతంగా చర్చలు జరిపారు. రెండు దేశాల సేనలు ఏకకాలంలో డోక్లాం నుంచి వెనక్కి మళ్లితే సమస్య తేలిగ్గా పరిష్కారమవుతుందని భారత్ ఈ సందర్భంగా ప్రతిపాదించింది. చైనా మాత్రం భారత సైన్యమే ఉపసంహరించుకోవాలని, ఇది తన భూభాగమని పట్టుబట్టింది. దీంతో చర్చలు అసంపూర్ణంగా మిగిలాయని సైనిక వర్గాలు తెలిపాయి. తదుపరి చర్చలు ఎప్పుడు జరుగుతాయో వెల్లడించలేదు. కాగా, శ్రీలంకకు వ్యూహాత్మకంగా కీలకమైన హంబన్‌టొట రేవును చైనాకు లీజుకివ్వడం తగదంటూ న్యాయశాఖమంత్రి విజేయదశ రాజపక్షే చేస్తున్న వ్యాఖ్యలు వివాదాస్పదమవుతున్నాయి. నష్టాల్లో నడుస్తున్న ఈ పోర్టును చైనాకు అప్పగించడం శ్రీలంక ప్రయోజనాలను తాకట్టు పెట్టడమేనని రాజపక్షే ఇటీవల వ్యాఖ్యానించారు. కేబినెట్ సమష్టిగా నిర్ణయం తీసుకున్న తర్వాత దానికి వ్యతిరేకంగా మాట్లాడడం మంత్రిగా రాజపక్షేకు తగదని సహాయ మంత్రి హర్ష డీ సిల్వా అన్నారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao**, on behalf of Aamoda Publications Pvt. Ltd., at the Aamoda press at Gollapalli road.,Dharmaram(B)Village,Dichpally Mandal, Nizamabad- 503230. Editor: **K. Srinivas**, Ph. Nos. 08461-245301, 245306. Fax 245307, RNI NO: AP TEL /2004/12975 .**Managing Director : Vemuri Radha Krishna**, Founder: K.L.N.Prasad.